ఆంధ్రపత్రిక

సచిత్ర వారపత్రిక



హైదరాబాదు విమోచన దినోత్సవ సంచిక

18-9-49 ANDHRA PATRIKA ILLUSTRATED WEEKLY వెల 4 అణాలు

ఆంధ్రపత్రిక

సంవత్సర చందా రు. 12-0-0

విడిపత్రిక అణాలు 0-4-0

ప్రతి బుధవారమున ప్రకటింపబడును


సంపుటము 42

సంచిక 3


ఒరు లేయవి యొనరించిన నరవర ' యప్రియము తన మనంబున కగు దా
నొరులకు నవి సేయకునికి పరాయణము పరమధర్మ పథముల కెల్లన్. (మహాభారతము)

Founder : K. NAGESWARA RAO

విరోధి సంవత్సర భాద్రపద బహుళ దశమి ఆదివారము



భిల్ల దంపతులు



ఆంధ్రపత్రిక

1949-వ సం॥ సెప్టెంబరునెల 18-వ తేది ఆదివారము

చారిత్రక దినము

నవభారతచరిత్రలో ఇది అత్యంత శుభప్రదమైన, చిరస్మరణీయమైన దినము. భారత దేశ స్వాతంత్ర్యావతరణమును సాకుగ తీసికొని హైదరాబాదు సంస్థానమున కొన్ని ప్రతీపవర్గములు ప్రజ్వలింపజేసిన అశాంతిని అణచివేయుటకు, దేశమధ్యమున ఏర్పడిన విష కలుషితవాతావరణమును తుద ముట్టించుటకు భారత ప్రభుత్వము గత సంవత్సరము సెప్టెంబరు 13-వ తేది ప్రాతఃకాలమున సాహసోపేతముగ ప్రారంభించిన 'పోలీసు చర్య' సరిగా నాల్గు రోజులైన పూర్తి గాక పూర్వమే, వందగంటలైన నిండకుండగనే అత్యంత జయప్రదముగ సమాప్తమైనది నైజాం నవాబు 'దాసోహ' మన్నదీ ఈ రోజునే.

నైజాం సంస్థానమున ఆనాడు అధికారము చెలాయించుచున్న లాయఖాలీ ప్రభుత్వాదరణ ప్రోత్సాహములతో విశృంఖలముగ విజృంభించిన దుండగుల క్రూరకృత్యములకు, కాశిం రజ్వీనాయకత్వమున ఇత్తెహాదుల్ ముస్లిమీన్ సంస్థ సాగించిన ధన మాన ప్రాణాపహరణకాండకు తాళలేక, స్వగృహములను తమ సర్వస్వమును వదలివేసి ప్రాణములు అరచేత పట్టుకొని సంస్థానప్రజలు వేలాదిగా భారత యూనియన్ భూభాగములకు తలదాచుకొనుటకై వచ్చివేసిరి. సంస్థాన జనాభాలో దాదాపు నూటికి 90 వంతులుగ వున్న హిందువులకే ఆ సంస్థానమున నిలువ నీడ లేకపోయెను.

ఇత్తెహాదుల్ ముస్లిమీన్ సంస్థచేతులలో కేవలము కీలుబొమ్మగ పరిణమించిన నైజాము నవాబుతోనూ, సంస్థానప్రభుత్వముతోనూ భారత ప్రభుత్వము అతిసౌమ్యముగ, అతి ఉదారముగ, స్నేహభావమున జరిపిన రాయబారములన్నియూ విఫలమాయెను. చివరకు భారతప్రభుత్వమునకు దండోపాయమే శరణ్యమైనది. హైదరాబాదు విషమపరిస్థితులను వేయికళ్లతో కనిపెట్టివున్నామనియు, ఆ అదను వచ్చినవెంటనే, స్థితిగతులు పరిపక్వము కాగానే తగిన 'శస్త్ర చికిత్స' చేసెద మనియు పలు మార్లు అభయహస్త మిచ్చిన భారతప్రధాని నెహ్రూ, ఉపప్రధాని సర్దార్ పటేల్ ప్రభృతులు 'పోలీసుచర్య' ద్వారా తమ వాగ్దానమును చెల్లించి, ప్రజల కృతజ్ఞతకు పాత్రులైరి. దుర్భరముగను, కంటకప్రాయముగను పరిణమించిన బీభత్స పరిస్థితులనుండి నైజాం సంస్థానప్రజలు అంతటితో విముక్తులై కొంత స్వాస్థ్యమును పొంది తిరిగి స్వస్థానములకు చేరసాగిరి. ప్రజాకంటకులుగ పరిణమించిన కాశింరజ్వీ, లాయఖాలీ ప్రభృతులు నేడు కారాగారబద్ధులై వున్నారు.

పోలీసుచర్య సమాప్తము కాగానే, సంస్థానమున ఏర్పడిన మిలిటరీ గవర్నరు ప్రభుత్వము మేజర్ జనరల్ చౌదరీ అధ్వర్యమున సంస్థాన పరిపాలనావ్యవహారములను నిర్వహించుచున్నది. రజాకార్ పీడ వదలినదని సంతోషించుచుండగనే, సంస్థానమున--ముఖ్యముగా తెలంగాణాలోని వరంగల్ నల్గొండ జిల్లాలలో--వెర్రితల లెత్తిన కమ్యూనిస్టు దౌష్ట్యములను అణచివేయుటలో ఈ మిలిటరీ ప్రభుత్వము ప్రజాసహకారముతో క్రమశః కృతకృత్యమగుచున్నది.

గత పన్నెండు మాసములలోనూ మిలిటరీ ప్రభుత్వము సంస్థానములో ఒకవైపు సంపూర్ణ శాంతిస్థాపనమునకై నిర్విరామకృషి చేయుచూ, మరొకవైపు విప్లవాత్మకములైన ఆర్థికసామాజికసంస్కరణలనుసైతము సాధించగలిగినది. దాదాపు 8 వేల చదరపు మైళ్ల విస్తీర్ణము గల 'సర్ఫెఖాస్' అనే నైజాం నవాబు స్వంతభూములను నవాబుఆధిపత్యమునుండి తొలగించి ప్రభుత్వము వశపరచుకొన్నది. పిదప అధికారమును నవాబే బుద్ధిపూర్వకముగ వదులుకొని జాగీర్దారీవిధానమును రద్దుచేయుటకు మార్గమును సుగమము చేసెను. ఈ భూములపై నైజాం నవాబుకు వచ్చుచుండిన దాదాపు మూడుకోట్ల రూపాయల స్వంత దాయము ఇప్పుడు సంస్థానబొక్కసమునకు లభ్యమగుచున్న దన్నమాట. సంస్థానములో తరతరములుగ పాతుకొనిపోయిన ప్రాతనిరంకుశ భూస్వామ్య విధానమును రద్దుచేయుటకు ఇది నాంది. జాగీర్దారీవిధానమునకు స్వస్తిచెప్పి కర్షకజనోద్ధరణను సాధించుటకు కూడ సంస్థానమిలిటరీప్రభుత్వము కంకణము కట్టుకొన్నది. ఈ నెల 15-వ తేదిన వనపర్తి సంస్థానమును, కొన్ని పాయిగాలను స్వాధీనపరచుకొనుటతో జాగీర్దారీవిధానరద్దుకార్యక్రమమునకు అంకురార్పణ జరిగినది.

కేవలము 'కలంపోటు'తో ఏర్పడిన ఈ జాగీర్లను మిలిటరీ ప్రభుత్వం విశేష కాలహరణము లేకుండ ప్రజాస్వామ్య ప్రభుత్వ మేర్పడువరకు వేచివుండకుండ 'కలంపోటు' తోనే రద్దుచేసి సమాన్య ప్రజా శ్రేయస్సునకై పూనుకొనుట ప్రశంసార్హమైన విషయము.

కేవలము యుద్ధానంతర ఆర్థికపరిస్థితులను అవకాశముగ తీసికొని ప్రజలలో అశాంతిని, అరాజకమును రెచ్చగొట్టుటకు ప్రయత్నించుచున్న కమ్యూనిస్టులకు, ఈ భూస్వామ్యవిధాన సంస్కరణలు తగిన జవాబు కాగలవని చెప్పవచ్చు. ఇదేవిధముగ సంస్థానకార్మిక జనోద్ధరణకుకూడ మిలిటరీ ప్రభుత్వము అనేకసంస్కరణలను తలపెట్టి పనిచేయుచున్నది. పోలీసుచర్య పూర్తిఅయి ఇప్పటికి నిండుసంవత్సరము గడచినను, హైద్రాబాద్ సంస్థానరాజకీయభవిష్యత్తు ఇంకను తేలవలసివున్నది. ఈ సమస్యను తేల్చవలసినది సంస్థానప్రజలే గాని, ఇందులో ఇతరుల నిర్బంధముగాని, ప్రమేయముగాని ఏమాత్రము వుండదని, వుండబోదని భారతప్రభుత్వము ఆదిలోనే అతిస్పష్టముగ ప్రకటించినది.

త్వరలోనే రాజ్యాంగపరిషత్తు నొకదాన్ని ఏర్పరచుటకు సంస్థానంలోని వయోజనులందరినీ చేర్చి ఓటర్ల జాబితాలను మిలిటరీ ప్రభుత్వము తయారు చేయుచున్నది. ఈ సంవత్సరాంతమునకు ఎన్నికలు జరిగి, రాజ్యాంగపరిషత్తు ఏర్పడే అవకాశము ప్రబలముగ కనబడుచున్నది.

ఇక కొలది మాసములలోనే ఏర్పడనున్న ఈ రాజ్యాంగపరిషత్తు, సంస్థాన రాజకీయభవిష్యత్తును, భారతదేశంలో విలీనీకరణసమస్యను మాత్రమే గాక నైజాంనవాబుభవిష్యత్తును సైతము తేల్చవలసివున్నది. దేశంలోని మిగతా సంస్థానములవలెగాక, నైజాంసంస్థానము త్రిభాషాప్రాంతము. అందుచేత సంస్థానాన్ని త్రిభాషాప్రాంతములుగ విభజించి, సరసన వున్న ఆయాభాషా రాష్ట్రాలలో చేర్చివేయవలెనా లేదా ఆ సమస్యను పరిష్కరించవలసిన గురుతరబాధ్యత సంస్థానప్రజలపైనే, ముఖ్యముగ సంస్థానకాంగ్రెస్‌పైనే వున్నది.

దాదాపు 90 లక్షల సంఖ్యాబలము, 42 వేల చదరపు మైళ్ల విస్తీర్ణము గల ఎనిమిది తెలంగాణాజిల్లాలను సర్కార్లతోనూ, రాయలసీమతోనూ చేర్చి విశాలాంధ్రమును నిర్మించుటే తమ లక్ష్య మని, ఈ లక్ష్యసాధనకే తాము కృషిచేసెద మని తెలంగాణా కాంగ్రెస్, సర్దార్ జమలాపురం కేశవరావుగారి అధ్వర్యమున ఇదివరలో తీర్మానించివున్నది. త్రిభాషాప్రాంతములుగా విభజించుటే సంస్థానప్రజలకు క్షేమప్రద మని సంస్థానకాంగ్రెస్ అధ్యక్షులు స్వామిరామానంద తీర్థ గారు కూడ ఉద్బోధించివున్నారు.

అనతికాలములోనే మిలిటరీ పాలనకు స్వస్తిచెప్పి అధికారస్వీకారము చేసి ఈ ప్రధానసమస్యను పరిష్కరించవలసిన బాధ్యత తమపై వుండగా, సంస్థానకాంగ్రెస్‌లో స్పర్థలు పొడసూపుట శోచనీయము. ఈ మాసాంతమున జరుగవలసిన సంస్థానకాంగ్రెస్ ఎన్నికలలో ఎవరిని అధ్యక్షస్థానమునకు ఎన్నుకొనవలెనను విషయమున తీవ్ర భేదాభిప్రాయములు ఏర్పడినట్లు వ్యక్త మగుచున్నది.

వివిధసంస్థానములలోనూ రాజుల, మహారాజుల పరిపాలనమును అంతమొందించి పరిపాలనను ప్రజాపరము చేసినది కాంగ్రెస్‌వాదులు తమలో తాము కీచులాడుకొనుటకు, స్పర్థలను పెంచుకొనుటకు కాదని భారత ఉపప్రధాని పదేపదే చేసిన హెచ్చరికను హైదరాబాదు కాంగ్రెస్‌వాదులు గమనించుట అవసరము.

నిజాంనిరంకుశత్వంపై అవిరళోత్సాహముతో జాతీయప్రతిఘటనోద్యమము సాగించిన తెలంగాణాకాంగ్రెస్‌వాదులు అంతరంగికవిభేదములను విస్మరించి, లక్ష్యశుద్ధితో తమ సంకల్పమును ఆచరణలోపెట్టి, విశాలాంధ్రనిర్మాణమునకు అవిచ్ఛిన్నముగ దోహదము చేకూర్చెద రని ఆంధ్రజాతి ఈ విమోచన దినోత్సవసందర్భమున హృదయపూర్వకముగ ఆశించుచున్నది.

ప్రత్యేక సంచికకు పెక్కురు రచయితలు ఉత్సాహముతో తమతమ వ్యాసముల నంపినందుకు వారి కందరికీ మా కృతజ్ఞతను తెలుపుచున్నాము. స్థలాభావముచేతను, కాలవ్యవధిచాలమిని కొన్ని వ్యాసములను ఇందులో ప్రచురించలేకపోయినందుకు విచారించుచు అట్టి వ్యాసకర్తల మన్ననల నర్థించుచున్నాము.



కొత్త ప్రభుత్వం రాకతో ప్రజలలో మతవర్గ విద్వేషాలకు ఆస్కారం నశించింది. పేరునకు మిలిటరీ ప్రభుత్వమైనా ప్రజాస్వామ్య పద్ధతులలో సర్వప్రజలకు సమ్మతమయి, రాబోవు సంపూర్ణ ప్రజాస్వామ్యపాలక సంస్థకు నాందిగా ఉంది. ముస్లిం ప్రజలు గవర్నరు గారిని ఆహ్వానిస్తున్న దృశ్యం.

హైదరాబాద్‌లో ప్రస్తుత పరిస్థితి.

హైదరాబాద్ గత కొన్ని దశాబ్దులుగా శీఘ్రగతిని పరివర్తన చెందుతోంది. శాంతి సామరస్యాలు, తరువాత మతవిద్వేషాలు, ఆపైని క్రమంగా ప్రజాస్వామ్యవ్యవస్థ వస్తోంది.

మొగల్ సామ్రాజ్యవిచ్ఛిత్తినుంచి హైదరాబాద్ సంస్థానం పుట్టింది. భూమిశిస్తువిధానంలోనూ, పన్నుల విధానంలోనూ మొగల్ సాంప్రదాయాలే హైదరాబాద్‌కు సంక్రమించాయి. మధ్యమయుగంలో మతవర్గజాతివిభేదాలకు అతీతమైన వ్యవస్థ ఉండేది. వివిధ మతాలవారిమధ్య సఖ్యతాభావం ఉండేది. వివిధమతాలవారిమధ్య ప్రభుత్వానికి కొందరిపట్ల పక్షపాతం ఉండినా, అది వ్యక్తిగతంగానూ ఆ ప్తకోటికిమాత్రమే లభికలిగే విధంగానూ ఉండేదికాని మతభేదం ఎప్పుడూ ప్రధానంగా లేదు. కొద్దికాలంక్రితంవరకూ ఇతరప్రాంతాలలో లేని శాంతిసామరస్యాలు హైదరాబాద్‌లో కానవచ్చేవి. పండుగలు వివాహాలలో కూడా భిన్నమతాలవారు సోదరభావంతో ఉత్సవం చేసుకునేవారు. కాని ఉత్తరోత్తరా కొందరు స్వార్థాశయంతో మతవిద్వేషాలు పురిగొల్పారు.

హైదరాబాద్‌లో మతవిద్వేషాలు ఇటీవల వచ్చినవే.

ఫ్రెంచివారితో తలపడినరోజుల్లో ఇంగ్లీషువారు సంస్థానాల్ని ప్రమాదకరమైన ప్రాంతాలుగా పరిగణించేవారు. వివిధసంస్థానాల్ని కలిసికుట్రపన్నకుండా విడగొట్టారు. అదీకాక వీనికి సముద్రతీరానికి దారిలేకుండా చేశారు. సంస్థానాధీశులను పరిపాలనతో నిమిత్తం లేకుండా దూరంగా ఉంచారు. తరుచు సంస్థానాధీశులు బ్రిటిష్‌పాలకవర్గప్రతికూలురు, ప్రధానమంత్రులు వారికి అనుకూలురుగా ఉంటూవచ్చారు. ప్రధానమంత్రుల్ని బ్రిటిష్ ప్రభుత్వం తమ చెప్పుచేతల్లో ఉంచుకునేవారు. సంస్థానాధీశులు కేవలం కీలుబొమ్మలైనారు.

జాతీయోద్యమం సంస్థానప్రజల్లోకూడా కొద్దిగా వ్యాపించింది. బ్రిటిష్‌వారితో తమ వ్యవహారాలెలా ఉన్నప్పటికీ ప్రజలపై సంపూర్ణ పరిపాలనాధికారం తమకున్నదని భావించే సంస్థానాధీశులు క్రమంగా తమ వైఖరి మార్చుకున్నారు. ప్రజోద్యమాల ఒత్తిడిని అణచడానికి సంస్థానాధీశులు ఉత్తరోత్తరా బ్రిటిష్‌వారివైపే మొగ్గనారంభించారు. బ్రిటిష్‌వారికి సర్వాధిపత్యం లభించింది.

పూర్వాపరాలు

[జనాబ్ బకర్ ఆలీ మీర్జా]

బ్రిటిష్ రాజకీయోద్యోగులు (రెసిడెంట్స్) వాస్తవపరిపాలకులైనారు.

భారతజాతీయకాంగ్రెస్ ఈ వాస్తవాలను గ్రహించి సంస్థానాల్లో జాతీయోద్యమాల్ని నిరుత్సాహపరచకపోయినా అంతగా ప్రోత్సహించలేకపోయింది. అందువల్ల సంస్థానాల్లో జాతీయోద్యమాలు వెనుకపడ్డాయి. పరిపాలన సంక్రమిస్తే వారిప్పుడు నిర్వహించలేని స్థితిలో ఉన్నారు. జాతీయోద్యమవ్యాప్తితో భయం భారతదేశంలో మతసమస్యను పరిష్కరించడంద్వారానే రాజకీయసమస్య పరిష్కారమయ్యే స్థితి తెచ్చిపెట్టారు బ్రిటిష్‌పాలకులు. భారతరాజకీయనాయకులు ఈ ఉచ్చులో చిక్కుకుని మతప్రధానరాజకీయవాదుల్తో సమాధానానికి రావలసివచ్చింది. వారికి తావిచ్చిన కొద్దీ మతప్రధానరాజకీయాలు బలపడినాయి. భారతజాతీయోద్యమంలో పెద్ద పొరపాటు జరిగిపోయింది. హైదరాబాద్‌లో కూడా మతానికి రాజకీయరాయబారాల్లో ప్రధానస్థానం లభించింది. స్వాతంత్ర్యోదయసమయానికి హైదరాబాద్‌లో మతద్వేషాలు ఉచ్చశిఖరాన్నందుకున్నాయి. అధికారుల ప్రోద్బలంపై ఇత్తెహాదుల్ ముస్లిమీన్ సంస్థ బలపడింది. దేశవిభజనతో నీరసించిన భారతావని సంస్థానాల సమస్యతో మరింత డీలాపోయే స్థితి వచ్చింది. సంస్థానాలపై సర్దార్ పటేల్ పోరాటం జరిపారు. తిరువాన్కూరులో ప్రప్రథమంగా విజయం లభించింది. అదృష్టవశాత్తు సంస్థానాలన్నీ దాదాపు భారతఅధినివేశంలో చేరాయి. కాని ఈ చేరడంలో భారతప్రభుత్వం విధించిన షరతులు వివిధసంస్థానాలమధ్య పక్షపాతపద్ధతికి తావిచ్చింది. మహమ్మదీయుల భీతి, మతావేశం, వ్యాపారుల స్వార్థం, పాకీస్తాన్ ప్రోద్బలం తోడై హైదరాబాద్‌లో పరిస్థితి ప్రమాదకరంగా పరిణమించింది. హైదరాబాద్‌లో నాయకులకు, అధికారులకు మార దృష్టి లోపించింది.


సంస్థానంలో కాంగ్రెస్ చిరకాలం నిషేధంలో ఉండి, ఇప్పుడు బలవత్తరమైన ఇత్తెహాద్ సంస్థని ఎదిరించవలసివచ్చింది. ప్రజాప్రాతినిధ్యపరిపాలన, భారత అధినివేశంలో చేరిక కోరిన కాంగ్రెస్‌తో సర్ మీర్జా ఇస్మాయిల్ సమాధానం సాధించడానికి యత్నించారు. కాని వ్యాపారులు సాగనివ్వలేదు. జర్మనీధనవంతులు నాజీలను బలపర్చినట్లే హైదరాబాద్‌లో ధనవంతులు ఇత్తెహాద్‌ను బలపరిచారు. ఇత్తెహాద్ ప్రత్యర్థుల్ని హింసించి అణచడానికి యత్నించింది. మతోన్మాదం మితిమీరింది. భారతదేశం యథాతథఒడంబడికను అంగీకరించింది తన సైన్యాలను సికందరాబాద్ నుంచి తరలించింది. ఎంత అణచినా కాంగ్రెస్ ఉద్యమం వీగిపోలేదు. విరామంలేకుండా భారతప్రభుత్వం నడిపిన రాయబారాలు వ్యర్థమైనాయి. యుద్ధానికి సన్నాహాలు జరిగాయి. బ్రిటిష్ అమెరికన్ కన్సర్వేటివ్ ప్రచారం, పాకీస్తాన్ ప్రచారం తోడైనాయి. కాశ్మీరంలో ఒకవైపు యుద్ధం, హైదరాబాద్ కోరిన స్వతంత్రవ్యవస్థను అంగీకరించడం భారతదేశానికి ఆత్మహత్యాసదృశమే. పోలీసుచర్య అనివార్యమయింది.

పోలీసుచర్యతో అనేకబలాలు విడివడ్డాయి. కొన్ని మంచివి, కొన్ని చెడ్డవి. స్తంభించిపోయిన పరిపాలనావ్యవస్థను తిరిగి నడపడానికి వ్యవధి పట్టింది. ఈలోగా దుష్టశక్తులు విజృంభించాయి. దోపిళ్లు అరాచకాలు చెలరేగాయి. పూర్వదోషాలకు ప్రతీకారాలు జరిగాయి. పాకీస్తాన్ భారత అధినివేశాలకు అధికారందత్తమైనప్పుడే అమాయకులైన అనేకలక్షలమంది ప్రజలు నానాహింసలకు లోనుకాక తప్పలేదు. హైదరాబాద్‌లో రజాకార్లు, రాష్ట్రీయస్వయంసేవకులవల్ల ప్రజలు హింసలకు లోనైనారు. తెలంగాణాలోమాత్రం ప్రతీకారం జరగలేదు. ఎంతకాలం ప్రచారంజరిగినా హిందూముస్లిం వైరాలు తీవ్రంగా లేవని ఇక్కడ ఋజువయింది. కేంద్రప్రభుత్వవిధానంలోని బలంవల్లనూ, కాంగ్రెస్ ప్రాబల్యంవల్లనే సంస్థానంలో కూడా సులువుగా మతద్వేషాలు సమసిపోయినాయి.

మిలిటరీప్రభుత్వం సంరక్షకప్రభుత్వంగా స్థాపించబడింది. ప్రజలందరూ విముక్తిపొందినట్లు ఆనందించారు.

చిరకాలసంగ్రామంఅనంతరం సంస్థాన కాంగ్రెస్‌కు సుస్థిరత లభ్యమయింది. సంస్థాన భవిష్యత్తును నిర్ణయించవలసిన బాధ్యత వారిపైన బడింది. కాని అంతఃకలహాలవల్ల అది నెరవేర లేదు. అనేకమంది అన్యులు సమయ

(17-వ పేజీ చూడుడు)



హైదరాబాదు - ఆర్థికాభివృద్ధి

[శ్రీ మందుముల నరసింగరావు]

['రయ్యత్' ఉర్దూపత్రికద్వారా హైదరాబాద్ ప్రజానీకానికి అపారసేవ చేసినవారు. సంస్థాన ఆర్థికవిషయాలలో నిధి. సంస్థానంలో హిందూమహమ్మదీయసఖ్యతకు పాటుపడినారు. ఉర్దూభాషాపండితులుగా ప్రసిద్ధులు.]

హైదరాబాదుసంస్థానాన్ని లేక రాష్ట్రాన్ని ఒక ఆర్థిక ప్రాంతముగా పరిగణించుట పొరపాటు కాదు. దాన్ని సంపూర్ణస్వయం పోషకవంతముగా చేయటానికి అనువైన సహజ సంపద పుష్కలముగా ఉన్నది. అభివృద్ధిసాధన కనుకూలించే వస్తుసంపద ఉన్నది నవీనసౌకర్య సృష్టికి ఉపకరించే ఆధారాల్ని ప్రకృతిమాత కల్పించింది.

ఈ రాష్ట్రపు వైశాల్యం 5,29,26,720 ఎకరాలు 2,50,32,000 ఎకరాలు సాగులో ఉంది. ఇందులో కల్పితజలసౌకర్యాలక్రింద (ప్రాజెక్టుల క్రింద) 17,94,000 ఎకరాలు సాగవుతోంది. మొత్తం సాగులో 14,19,000 ఎకరాలు వరి పంటక్రింద, 4,85,000 ఎకరాలు గోధుమ, 75,55,000 ఎకరాలు జొన్న, 29,36,000 ఎకరాలు వేరుశెనగ, 21,56,000 ఎకరాలు ప్రత్తి పంటలక్రింద ఉంది దాదాపు 33 వేల చెరువు లున్నయ్యి. 60,58,240 ఎకరాల అడవు లున్నవి. ఇంకా బోలెడు భూమిని సాగుకు, అడవుల్ని నాటటానికి వినియోగించవచ్చు

తెలంగాణాలో భూమి అంతా ఇసుకతో కూడిన ఎర్రమట్టి. ఎక్కువగా వాననీటిని భూసారం నిలవచేసుకోలేదు. కాని తెలంగాణాలో, మహారాష్ట్రప్రాంతంలోకంటె వర్షం ఎక్కువ. తత్ఫలితంగా తెలంగాణాలో చెరువు లెక్కువ అదీగాక భూసారాన్ని బట్టి మాగాణి పంట అనుకూలం కాబట్టి, ప్రాజెక్టుల అవసరం కూడా అధికం—ప్రతినీటి బిందువునూ వినియోగం చేయాలనే తెలంగాణా ఎల్లప్పుడూ ఆసక్తిచూపుతూ ఉంటుంది

మరాట్వాడా అంతా సున్నంతో కూడిన నల్లమట్టి వాననీటిని నిలవచేసుకోగలదు అందువలన ఇక్కడ మెట్టపంటలే అధికం జొన్నలు, గోధుమ ఇక్కడి పంటలు. పశ్చిమ కనుమలు, ఋతుపవనాల రాకకు అవరోధంగా పరిణమించటం వలన వానలు తక్కువ. అయినా లభించే నీటిని భూసారం జాగ్రత్త చేస్తుంది బావుల నీటితో, తోటలు పెంచుకుంటారు అనేకచోట్ల

తెలంగాణాలో వరిపంటేగాక, ముఖ్యమైన మెట్టపంట నూనెగింజలు మరాట్వాడాలో గోధుమేగాక ముఖ్యమైన మరొకపంట ప్రత్తి చక్కగా అభివృద్ధి చేస్తే తెలంగాణపు నూనె పరిశ్రమ, మరాట్వాడా గుడ్డల పరిశ్రమ భారత దేశపు నూనె, గుడ్డ అవసరాల్ని చాలా భాగం తీరుస్తాయి

తెలంగాణాలో జొన్నలు పునాసపంట — మరాట్వాడాలో జొన్నలు శీతకట్టుపంట ఒక ప్రాంతానికి క్షామం వస్తే, రెండో ప్రాంతం ఆదుకోగలదు ఈవిధంగా హైదరాబాదు, పరస్పరం సహకరించి, మొత్తం ప్రాంతానికి స్వయంపోషకత్వాన్ని సాధించిపెట్టగల, రెండు ఉపప్రాంతాల క్రింద, సహజంగా విభజింపబడిఉంది

ప్రాజెక్టులక్రింద లేక శాస్త్రీయంగా చేయబడ్డ నీటివసతులక్రింద సాగయ్యేభూమి చాలా తక్కువ నీటివసతులు బాగా లేకపోతే వ్యవసాయంలో తగిన ఉత్సాహం కనపడదు. నీటవసతిలేని వ్యవసాయం లాభసాటి వ్యాపారం కాదు. కేవలం వానపైన ఆధారపడి, భూమిపైన పెట్టుబడి పెట్టరు ఎలక్ట్రిసిటీని ఇతర దేశాల్లో విస్తృతోపయోగంలోకి తెస్తున్నట్లు వింటున్నాం. కాని మనకు ముందు నీటవసతులు అభివృద్ధి కావటం ముఖ్యం. హైదరాబాదుకు నీటిసౌకర్యాలను కల్పించటానికి పనికొచ్చే ఆధారాలు రెండు. ఒకటి గోదావరి; రెండు కృష్ణ ఈనాటివరకూ కృష్ణాగోదావరులు పుణ్యజలవాహినులు - బహుశా సుందర దృశ్యాలు కూడా నేమో! కాని మన భూములకు ఆ పుణ్యజలస్నానం చేయిస్తే హైదరాబాదు భూలోక స్వర్గం అవుతుంది. ఆ ప్రయత్నంలో ఎలెక్ట్రిసిటీ కూడా లభిస్తుంది

గోదావరి

సంస్థానపు ఉత్తరప్రాంతంలో గోదావరి 432 మైళ్లదూరం ప్రవహిస్తుంది నాందేడ్, పర్భని, నిజాంబాదు, అదిలాబాదు జిల్లాలగుండా ప్రవహించి కరీంనగరం, వరంగల్ జిల్లాలకు తూర్పు సరిహద్దుగా ప్రవహిస్తూ పేరంటపల్లిదగ్గర మరోసారి సంస్థానంలో ప్రవేశిస్తుంది అక్కడనుంచి తిరిగి చెన్నరాష్ట్రానికి ప్రవహిస్తుంది సంస్థానంలో దీని కనేకం ఉపనదు లున్నాయి. మంజీరా, పూర్ణా, ప్రాణహిత, మానేరు, పెన్‌గంగ, వార్ధా, కదం మొదలైనవి ఇందులో ఒక్క మంజీరానీరు మాత్రమే ఉపయోగింపబడుతోంది. నైజాంసాగరాన్ని పోషించేది మంజీరా నది. ఇంతకు మినహా మిగిలిన ప్రవాహాలన్నీ ఇంతవరకూ ఉపయోగంలోకి రాకుండానే ఉన్నాయి. కాని అదిలాబాదు జిల్లాలో గోదావరిజలాన్ని తృప్తికరంగా వినియోగించుకునే అవకాశాలనంతంగా ఉన్నాయి. ఈ జిల్లాలో కిష్టాపురం దగ్గర గోదావరికి ప్రాజెక్టును కట్టేటట్లయితే - అదిలాబాదు, కరీంనగరం, వరంగల్ - ఈ మూడు జిల్లాల్లో వ్యవసాయాన్ని అభివృద్ధి చేయవచ్చు. చాలా భూమిని సాగులోకి తీసుకురావచ్చు ఈ మధ్య ప్రభుత్వంవారు వేసిన పథకప్రకారం కిష్టాపురం ప్రాజెక్టునుంచి బయలుదేరే ఒక కాలువ (160 మైళ్లు) కరీంనగరం, వరంగల్లు జిల్లాలలో ఇతర సౌకర్యాల మాట అటుంచి 907000 ఎకరాలను సాగులోకి తీసుకురాగలదు ఉత్తరపు ప్రక్కగా పోయే మరొక కాలువ 26 మైళ్లు ప్రవహించిన తర్వాత 220 అడుగుల ఎత్తునుంచి పతనం చెంది, తిరిగి ఆరుమైళ్లు పోయిన తర్వాత పెద్దూరుదగ్గర 210 అడుగుల ఎత్తునుంచి కదంనదిలోకి దూకుతుంది. అక్కడినుంచి కొద్దిదూరంలో ఉన్న గొడిశాల్ గ్రామందగ్గర కదంనది, గోదావరిలో కలుస్తుంది ఇక్కడొక ఆనకట్ట కడ్తే, చక్కటి నీటి రిజర్వాయిర్ తయారవుతుంది-పై కాలువ ప్రవాహంలో సంభవించే రెండు జలపాతాలు, విద్యుదుత్పత్తికి ఉపకరిస్తాయి ఇవిగాక ఇంకా 175 మైళ్లు నిడివిగల కాలువల్ని త్రవ్వటానికి కూడా ప్రణాళికలో అవకాశాలుచూపబడ్డాయి. కదం గోదావరిసంగమం దగ్గర, ఆనకట్ట నిర్మాణం సాధ్యమైతే, విద్యుచ్ఛక్తి అత్యధికంగా (80 వేల కిలోవాట్లు) లభించే అవకాశా లున్నాయి పది లక్షల ఎకరాలకు పైగా సాగవుతుంది ఇంత ప్రాజెక్టుకు దాదాపు 20 కోట్ల రూపాయలు ఖర్చు కావచ్చు కాని పెట్టుబడి నష్టం కాదు. నిర్మాణం ఏడేళ్ళలో పూర్తి అవుతుంది.

ఈ ప్రాజెక్టుప్రాంతంలోనే తాండూరు బొగ్గుగను లున్నాయి. సిమెంటుఉత్పత్తికి కావలసిన ముడిసరకు లున్నాయి-అడవు లున్నాయి - పంగాణీ పరిశ్రమకు పనికొచ్చే మట్టి, గాజుపరిశ్రమకు కావలసిన రాళ్లు ఉన్నయ్యి. ఇనుము కూడా దొరుకుతుంది

ఇక్కడ—మద్రాసు - ఢిల్లీ రైల్వేలైను గోదావరిని దాటే చోట - ఒక ఆదర్శ పట్టణాన్ని నిర్మించి పరిశ్రమల్ని నెలకొల్పాలని యుద్ధానంతర పునర్నిర్మాణశాఖవారు పెద్ద ప్లాన్ వేసుకున్నారు. ఈ పథకమే కనక అమలు జరుగుతే తెలంగాణాకు ఆహారసమస్య అనేదే ఉండదు.

నైజాం సాగరము

నైజాం సాగరం క్రింద వరి, చెరుకు పండుతోంది మొదట రెండులక్షల డెబ్బది అయిదు వేల ఎకరాల్లో పంటలకు సరిపడే నీటిసౌకర్యాల్ని చేయవచ్చునని తీర్మానించారు. తీరా లక్షా నలభై వేల ఎకరాలకంటె ఎక్కువ (వరిపంట క్రింద) సాగు కాలేకపోయింది దాదాపు 20 వేల ఎకరాల్లో చెరుకు పండుతోంది నీటిని ఇతోధికంగా వినియోగించటానికి సౌకర్యాల్ని చేస్తే అదనంగా ఒక లక్ష యకరాలు సాగులోకి వస్తుంది దానికి తోడు ఎరువుల్ని కూడా సప్లై చేస్తే, మొత్తంమీద నలభై లేక ఏభై వేల టన్నుల ధాన్యం అదనంగా లభిస్తుంది ఇక్కడ ఒక పెద్ద విద్యుదుత్పత్తికేంద్రాన్ని నిర్మించుతున్నారు. దీనివల్ల 15 వేల కిలోవాట్ల విద్యుచ్ఛక్తి వుత్పత్తి అవుతుంది విద్యుచ్ఛక్తిని పరిసరప్రాంతాల్లోనే వినియోగించి, వ్యవసాయాన్నిగాని, లేక ఇతర చిన్న పరిశ్రమలనుగాని అభివృద్ధిచేయాలి. ప్రభుత్వం ఈశక్తినంతా హైదరాబాదుకు సప్లై చేయదలపెట్టినట్లు తెలుస్తోంది. ఇది చాల పొరపాటు

మానేరు

నిజాంబాదుజిల్లాలో మానేరు - కూడెలేరు కలిసేచోట ఒక ప్రాజెక్టు కట్టబడుతోంది. బహుశా ఈ సంవత్సరాంతంలో నిర్మాణం పూర్తికావచ్చు ఈ ప్రాజెక్టుక్రింద దాదాపు 18 వేల ఎకరాలు—ఎక్కువగా కరీంనగరం జిల్లా ప్రాంతంలో-సాగవుతుందని అంచనా

తుంగభద్ర

నదులనీటిపంపకంవిషయమై ఇంతవరకూ హైదరాబాదుకు, చుట్టప్రక్కల రాష్ట్రాలకు పేచీలు వస్తూఉండేవి తుంగభద్రజలాల వినియోగంకోసం 60 ఏండ్లనుంచి సంభాషణలు, జేరాలు సాగి, అది ఎట్లాగో చివరకు ప్రారంభమయింది. ఇంకనుంచి ఇట్లాంటి తగాదాలు రావనే ఆశించవచ్చు 1921 లోనే బెన్నూరు దగ్గర ఒక ప్రాజెక్టు కట్టటానికి హైదరాబాదు ప్రభుత్వం సంకల్పించింది నిజంగా కట్టేవారేమో - కాని మద్రాసుప్రభుత్వం ఒప్పుకోలేదు తీరా 1929 లో, మల్లాపురందగ్గర ప్రాజెక్టు కట్టడానికి పరిశోధనలు ప్రారంభమయ్యాయి ప్రస్తుతం నిర్మాణం జరుగుతోంది. హైదబాదులో మూడున్నరలక్షల ఎకరాలు సాగయ్యే అవకాశాలు లభిస్తాయి పైగా అరవై వేలకిలోవాట్ల విద్యుచ్ఛక్తి కూడా ఉత్పత్తి అయ్యే వీలున్నాయి.

రాజోలిబండ

మల్లాపురంకి 80 మైళ్లక్రింద రాజోలిబండ అనేచోట తుంగభద్రపైన ఒక ప్రాజెక్టు నిర్మింపబడ్తోంది. దీనిక్రింద 79 వేల ఎకరాలు సాగవుతుంది

కృష్ణా

కాని కృష్ణానది, ఈ రాష్ట్రంలోనే భీమ, తుంగభద్రానదుల్తో కలుస్తుంది. రాయచూరు, మహబూబునగరం జిల్లాలగుండా ప్రవహించి, నల్గొండ వరంగల్ జిల్లాలకు దక్షిణసరిహద్దుగా పారుతోంది భీమ, కృష్ణలజలాలు ఏ కొన్నైనా వినియోగపడ్తాయేమో ఇంతవరకు పరిశోధనలు జరిగేయి కాని కృష్ణలోపడే చిన్న నదులు కొన్ని ఉపయోగంలోకి తీసుకురాబడ్డాయి దండి (మహబూబునగరం) మునేరు (వరంగల్), మూసీ (నల్గొండ), పాలేరు (వరంగల్) - మొదలైనవాటికి చిన్నప్రాజెక్టులు నిర్మింపబడ్డాయి.

మొత్తంమీద ఇంతవరకూ ఈ క్రింది ప్రాజెక్టులు నిర్మింపబడ్డాయి నైజాంసాగరం (నైజాంబాదు), దిండి (మహబూబు నగరం) పాలేరు (వరంగల్లు) వైరా (వరంగల్లు) పెండ్లిపాకాల (నల్గొండ), పెద్దవాగుకాలవ (నల్గొండ) చంద్రసాగరం (మహబూబునగరం) బైతుపల్లి (వరంగల్లు) పోచారం (మెదక్) మహబూబ్ నహర్ (మెదక్) ఫతేనహర్ (మెదక్) శనిగారం (కరీంనగరం) భీమఘనపురం (కరీంనగరం) సింగభూపాలియం (వరంగల్) రూటీ (బీర్) వీటన్నింటిక్రింద, ఇప్పటికంటె దాదాపు రెట్టింపు భూమిని సాగుచేయుటానికి అవకాశాలున్నట్లు ప్రభుత్వపరిశోధకోద్యోగు లంటున్నారు ఇవిగాక, కరీంనగరంజిల్లాలో యాకీన్‌పురం, చేగావ్, మానేరులు, నల్గొండజిల్లాలో అర్జునపట్ల, గాగిల్‌పురాల ప్రాజెక్టులు నిర్మాణంలో ఉన్నాయి ఈ చిన్నప్రాజెక్టులు పూర్తి అవుతే 16 వేల ఎకరాలు అరకక్రిందకు వస్తుంది. ఇంకా చిన్నచిన్న ప్రాజెక్టులు మరో ఇరవైకి పైగా నిర్మించవచ్చు. ఈ చిన్నప్రాజెక్టులు దేశాభివృద్ధికి ఎంతైనా ఉపకరిస్తాయి త్వరలో, కొద్దిలో పూర్తిఅవుతాయి

ఇవిగాక, బావులక్రింద చెరువులక్రింద బోలెడు సేద్యం జరుగుతోంది కాని ఈ చెరువులకు సకాలంలో, సరిపోయే మరమ్మతులు జరగకపోవటంవల్ల, అవి పూర్తిగా ఉపకరించటం లేదు.

రాష్ట్రం మొత్తంమీదదాదాపు ముప్పదిలక్షల యకరాలభూమి, సేద్యానికి వీలైనది, బంజరుగా పడివుంది. సేద్యానికి సహజంగా లభించిన అనేకవీళ్లున్నాయి - ఇందులో అనేకం చిన్న ప్రాజెక్టులే

సంస్థానంలో సాలుకు కావలసిన ఆహార పదార్థాలు 25 లక్షల టన్నులు ఇందులో దాదాపు 23 లక్షల టన్నులు స్థానికంగానే ఉత్పత్తి అవుతోంది తీరాకావలసినది 2 లక్షల టన్నులు. చిన్న ప్రాజెక్టులను సత్వరమే నిర్మిస్తే ఈ కొరత తీరిపోతుంది అయితే పెద్ద ప్రాజెక్టుల నిర్మాణఫలితంగా, మనం అధికోత్పత్తిదారులమవటమే గాక, పారిశ్రామికాభివృద్ధికి కూడా ప్రయత్నించుకున్నవార మవుతాము దేశం ఆర్థికంగా అభివృద్ధి చెందాలంటే, వ్యవసాయం, పరిశ్రమలు అభివృద్ధికావాలి మన దేశానికి సరిపడ్డ వస్తుజాలాన్ని మనం ఉత్పత్తిచేసుకున్న తర్వాత, ఎగుమతివ్యాపారంసంగతి ఆలోచించవచ్చు

అనుకున్న నిర్మాణాలు సరిగ్గా పూర్తి అవుతే ఐదు లక్షల కిలోవాట్ల విద్యుచ్ఛక్తి లభించే అవకాశా లేర్పడుతాయి గోదావరి, కృష్ణ, తుంగభద్ర, మంజీరా మొదలైన నదీప్రవాహాల్లో సహజంగా ఉన్న ప్రవాహవేగాల్నిగాని, జలపాతాల్నిగాని విద్యుదుత్పత్తికి వినియోగించవచ్చు నేడు ఐదు లక్షల ఎకరాలకు పైగా బావుక్రింద సాగవుతోంది ఈ సాగుకు ఎంత పశుశక్తి, మానవశక్తి అవసరమౌతోందో ఊహించండి. ఎలెక్ట్రిసిటీ వస్తే, ఈ ప్రాజెక్టీ పీడన ఉండదు

అయితే కొత్తగా సాగులోకి తెచ్చే భూముల విషయంలో ప్రభుత్వం చాలా జాగ్రత్త వహించాలి. వ్యవసాయసంస్కరణల సంఘంవారి సిఫారసు లెట్లా ఉంటాయో ఊహించలేము. అవి ఎట్లున్నప్పటికి, కొత్తగా భూముల్ని పంపకం చేయటంలో ఒక సునిశ్చిత ఆర్థికసూత్ర

(26-వ పేజీ చూడుడు)

సంస్థానంలో కమ్యూనిజం స్వరూపం

[శ్రీ బూర్గుల రామకృష్ణరావు]


[సంస్థానకాంగ్రెస్‌లో ఒకవర్గానికి నాయకులు ప్రస్తుత కాంగ్రెస్ కార్యవర్గ సభ్యులు.]


అప్పుడప్పుడూ హైదరాబాదు కమ్యూనిస్టు సమస్యకు - ఆ సమస్యాపరిమాణం, తీవ్రతకు పోలిక లేనట్టి - అతిశయోక్తికరమైనట్టి ప్రాముఖ్యత ఇవ్వబడ్తోంది. తెలంగాణంలో కమ్యూనిస్టులు పోలీసుచర్యకు పూర్వం చేసినట్టి, తర్వాత చేస్తున్నట్టి చర్యలకు బోలెడు ప్రచారం లభించింది. ఈ ప్రచారానికి అనేక కారణాలున్నాయి - ముఖ్యమయినది, ప్రచారం చేసుకొనటంలో వారికిగల నిపుణత్వమే. మొదటి దినాల్లో అనేకులు విద్యావంతులు, భావోద్రేకులు, - ముఖ్యంగా నిరంకుశత్వానికి, భూస్వామిక తత్వానికి ఆటపట్టయిన ఈ సంస్థానంలోని విద్యావంతులు, భావోద్రేకులు - దీన్ని ఒక రకమైన అధునాతనసోషలిజం అని, "అభివృద్ధి కాము"లంతా రహస్యంగానైనా సానుభూతిని చూపదగినట్టి సాహసవిధానమని భావించి, అభిమానింపసాగారు. కమ్యూనిజం [ప్రస్తుతం నడుస్తున్న చర్యలు నిజంగా ఆ పేరు క్రిందకు వస్తే] మొలకలెత్తటానికి తెలంగాణా క్షేత్రం తగదని కాదు - కాని కేవలం స్థానికస్థితిగతులు, వ్యవసాయకుల అశాంతి, ఇట్టిది జన్మించటానికి తోడ్పడినవనటం శుద్ధతప్పు. వాస్తవానికి 1940 లో శ్రీ రావినారాయణరెడ్డి-ఆయన మిత్రులు-కామ్రేడ్ల సంఘాన్ని స్థాపించినప్పుడుగాని, సంస్థానంలోని ఒక ప్రాంతపు రాజకీయసంఘమయిన ఆంధ్రమహాసభలోకి వారు జొరబడ సాగించినప్పుడుగాని, ఈ చర్యలన్నీ భారత కమ్యూనిస్టుపార్టీ వారి ఆంధ్రశాఖయొక్క ఆదేశాల ప్రకారం జరుగుతున్నవని ఎవ్వరూ అనుమానించలేదు. ఈ ఉత్సాహవంతులైన యువకులు, గ్రామీణులమధ్య పనిచేస్తున్నప్పుడుగాని లేక గ్రామీణుల కష్టనిష్టూరాల్ని అశాంతి వ్యాప్తికి పరికరంగా ఉపయోగింప ప్రారంభించినప్పుడుగాని, వారి చర్యలలోగల అంతరార్థాన్ని గూర్చి ఎట్టి అపోహలు జనించనేలేదు. సంస్థల్లో జొరబడటం, సంస్థయొక్క వివిధ కార్యక్రమరంగాలను తమ అధీనంలోకి లాక్కోటం వారి విధానం. ఆ విధానాని కనుగుణంగానే అనుభవనీయులైన విశ్వాసపాత్రులైన నాయకుల పైన - అభ్యుదయం, యువజనోద్యమం పేర - తిరుగుబాటు జరిపి ఆంధ్రమహాసభను విచ్ఛిన్నం చేసి, ఆంధ్రప్రాంతంలో ఒకీయమైన స్థావరం ఏర్పరచుకున్నారు. చివరకు బలవంతాన సంస్థను తమ హస్తగతం చేసుకున్నారు. అధికసంఖ్యాకుల విశ్వాసాన్ని అనుభవిస్తున్నప్పటికినీ, మహాసభ నాయకులు తమ పదవుల్ని వదలివేసుకొనటం గాంధీతత్వానుగుణంగా ఉన్నదనటంలో సందేహం లేదు. కాని ఈ వదలుకొనటం, కమ్యూనిస్టులకు చాలా తక్కువ కాలంలో తమ సంస్థాబలాన్ని పెంపొందించుకొనటానికి అవకాశం ఇచ్చింది. అయినా ఈవిధంగా విడిపడిపోవటంవల్ల రెండు కక్షులయొక్క విధానాలు స్పష్టంగా తేలిపోయే అవకాశం లభించింది. రెండేండ్లతర్వాత తెలంగాణంలోని జాతీయవాదులంతా జాతీయ ఆంధ్రమహాసభను ఏర్పాటు చేయటానికి వీలు కలిగింది. అదే మహాసభ నేడు ఆంధ్రరాష్ట్రకాంగ్రెసుగా మారింది.

తెలంగాణాలో కమ్యూనిస్టులచరిత్రను క్లుప్తంగా చెప్పివేయవచ్చు. ముందుగా వారి దౌర్జన్య కార్యక్రమం జనగామ తాలూకా (నల్గొండజిల్లా)లో ఆరంభమయ్యాయి. ఆ తాలూకాలో ప్రజల్ని పీడించటంలో ఆరితేరిన విసూ్నూరు రామచంద్రారెడ్డి అనే ఒక చిన్న భూస్వామికి వ్యతిరేకంగా కమ్యూనిస్టుల చర్యలారంభించాయి. ఈ చర్యల ఫలితంగా కమ్యూనిస్టులకు, భూస్వామికతత్వాన్నెదుర్కొ గలిగిన విప్లవనాయకులని, పీడిత రైతుల పాలిటి రక్షకులని, పేరు ప్రతిష్ఠలు లభించి, బీదలసానుభూతి, సహకారాలుకూడా లభించాయి. పోలీసు, రెవెన్యూ అధికారులు అవినీతిని వదలి, పేదరైతుల స్థితిగతుల్ని సకాలంలో, సక్రమంగా విచారించి ఉన్నట్లయితే, కమ్యూనిస్టులకు నిలవనీడ ఉండేది కాదు. కాని ఉద్యోగుల అవినీతి, దుశ్చర్యల ఫలితంగా, కమ్యూనిస్టు విప్లవనినాదాలకు "పోలీసుజులుం నశించాలి"అనే అదనపు నినాదంకూడా చేరింది. ఈ నినాదంతో, ప్రభుత్వ వ్యతిరేకులంతా వారితో చేతులు కలిపారు. పార్టీ బలపడింది. తత్ఫలితంగా 1946 లో వారు గ్రామాలచుట్టూ రాకపోకల కవరోధాలు కల్పించి గోరిల్లా యుద్ధాలను చేయటం, సాయుధనిరోధం సాగించటం, చివరకు తమకు అనువైన గ్రామాల్లో పోటీ

(22 వ పేజీ చూడుడు)

హైదరాబాద్ సంస్థానాన్ని సంవత్సరంపైగా కల్లోలపరిచిన రజాకర్‌దళాలు









ఆరబ్ దుస్తుల్లో ఉన్న ఖాసిం రజ్వీ. రజ్వీరజాకార్ దళాలను సాయుధసైన్యాలుగా యుద్ధానికి తయారుచేశాడు. మోటార్ సైకిల్‌దళాలు, కవాతులు, సైనికప్రదర్శనాలతో ప్రజలను భీతావహుల్ని చేయ ప్రయత్నించాడు. ఆ దళాల సైనికసన్నాహాలు పై చిత్రాల్లో కనపడుతాయి.

హైదరాబాదులో శ్రీ కె. యం. మున్షీ

శ్రీ పెండ్యాల వామనరావు





రాజకీయచతురుడు, ప్రతిభావంతుడైన న్యాయవాది, నిశితవిమర్శకుడు, ప్రఖ్యాత నాయకుడు, ప్రసిద్ధరచయిత, శ్రీ కన్నయాలాల్ జీ మున్షీ. శ్రీమున్షీ అవులిస్తే పేగులు లెక్కపెట్టే వ్యక్తి. ఎట్లాంటి జటిలసమస్యనైనా క్షణంలో అర్థం చేసుకుంటాడు. కృష్ణపక్షిని మించిన సూక్ష్మదృష్టి శ్రీమున్షీ సొమ్ము. వాదఖడ్గాన్ని తర్కంపై ఎప్పటికప్పుడు నూరి సిద్ధంగా ఉంచుతాడు. అందుకనే, శ్రీమున్షీని హైదరాబాదులో ఏజెంట్ - జనరల్ గా నియమించారు! కాని ఆ పదవి శ్రీమున్షీకి ముళ్ల కిరీటం - అయినా ఎంత నిపుణత్వంతో, ఎంత తేలికగా, ఆ కిరీటాన్ని ధరించాడు!

ఆనాటి అధికారమత్తులు ఆయనను ఒక "వర్తకప్రతినిధి" అని ఆక్షేపించారు. పైకి ఆక్షేపించారు. కాని "దక్షిణసదనం" లో ఆయన ఉనికి, వారికి ఎంతో పిరికితనం కలగజేసింది. పిరికితనం విద్వేషంగా మారటం సహజం. మొదలు, ఆయన బొలారం రెసిడెన్సీలో 26 జనవరి 1948 నాడు భారతపతాకోత్సవం జరిపాడు. రోజులు బాగుండకపోయినా, అనేకులు ఉత్సవంలో పాల్గొన్నారు. పదకొండు దినాల తర్వాత, శ్రీమున్షీ దక్షిణసదనంలోకి మారాడు. ఎప్పుడుచూసినా, ఆయననివాసంలో ఒక సభ తీర్చి ఉండేది. సికింద్రాబాదు పౌరులాయనకు సన్మానం చేశారు. వేలాది ప్రజలా సన్మానకార్యక్రమంలో పాల్గొన్నారు. మున్షీని గౌరవించటంలో, ప్రజలు తెగించారు. ప్రభుత్వం కల్పించే అడ్డంకుల్ని లెక్కచేయకుండా, "మున్షీ మావాడు" అన్నారు.

ఆనాటి నాయకులు 'వాచా' 'కర్మణా' మున్షీకి అడ్డు నిలిచారు. అయినా, హైదరాబాదు రాజకీయనాడీపరీక్షనుంచి మున్షీజీ విరమించలేదు. బాపూజీఉపవాససందర్భంలో, శ్రీ మున్షీ ఇచ్చిన ఉపన్యాసాన్ని వేలాది ప్రజలు ప్రత్యక్షంగా విన్నారు. మున్షీ పలుకుబడి పెరుగుతోందని, "సంస్థానకాంగ్రెసుఅధ్యక్షుడు స్వామీజీ కాదు - మున్షీయే" అని ప్రభుత్వపక్షీయులకు ఆందోళన పట్టుకుంది.

ఆయన, ప్రతమసరిహద్దుసంచారాన్ని ఆపేయాలని ప్రభుత్వం మహాతంటాలు పడింది. కాని తన కార్యదర్శి శ్రీ యం. టి. రాజుతో, నల్గొండలో మతకల్లోలస్థితుల్ని పరీక్షించటానికి బయల్దేరాడు. ఆయనపర్యటనమార్గంపొడుగునా, ప్రజలు గుమిగూడి, ఆయనను తమవాణ్ణిగా గౌరవించారు. వారిలో, 'విముక్తి కలుగుతుంది, అనే ఆశను సజీవంగా ఉంచాడు మున్షీజీ. పర్యటన చేయలేదు. బహుశా ఆ ఉద్యోగకృత్యా పర్యటన సక్రమం కాదేమో. ఫిబ్రవరిమాసంలో గాంధీజీచితాభస్మాన్ని 'సంగం' నదిలో నిక్షేపంచేసే సందర్భంలో, తిరిగి బహిరంగకార్యక్రమంలో పాల్గొన్నాడు. గాంధీజీయెడ ఆనాడు ప్రజానీకం చూపిన భక్తి, ప్రభుత్వానికి, గుండెల్లో రాయి అయిపోయింది.


ప్రభుత్వానికి యుద్ధానికి సిద్ధం కావటం ముఖ్యకార్యక్రమ మయింది. సిడ్నీకాటన్, దొంగతనంగా వచ్చి, ఆయుధాల్ని పారేసి పోతున్నాడు. సాయుధదుండగులు, భారతయూనియన్ ప్రాంతాల్లోకికూడా జొరబడి, దుష్కృత్యాలు సాగిస్తున్నారు. చివరకు మున్షీని హత్యచేయటానికికూడా ప్రయత్నాలు ప్రారంభమైనట్లు నమ్మకంగా తెలియసాగింది. మున్షీ చలించలేదు. భయపడలేదు. ఇవన్నీ ఢిల్లీకి పోవలసిన వార్తలు. ఆయనకు అన్ని రహస్యాలువచ్చేవి. ఆవార్తల్ని పంపటమే ఆయనపని. సంభాషణాచతురుడు మధురభాషి, కాబట్టి నమ్మకమైన మిత్రులనేకులు లభించారు. ఆయన పనికూడా సులభమయింది.

దక్షిణసదనంలో ప్రథమభారతస్వాతంత్ర్య దినోత్సవం జరిగింది. ఆవేడుకను చూడటానికి వచ్చినకొందరిని సాయుధగూండాలు అమానుషంగా హింసించారు. పరిపాలనను నడిపే పెద్దలుకూడా బాధకుల్ని చూసి, చూడనట్లే ఊరుకున్నారు. ఒకవారంతర్వాత షోయీబ్ - ఉల్లాఖాన్ హత్యచేయబడ్డాడు. నానజ్, కోదాడు దగ్గర గూండాలచర్యలవల్ల విపరీతపరిస్థితులేర్పడ్డాయి. ఈలోగా మున్షీజీ, రాబోయే పోలీసుచర్యకు పథకొన్ని తయారుచేస్తున్నాడు. ముందు సంస్థానంనుంచి యూరోపియను యటకు పోయే స్థితిని కల్పించాడు. అప్పటికీ నైజాం కళ్లు తెరవలేదు.

సెప్టెంబర్ 13 వ తేదీనాడు పోలీసుచర్య ప్రారంభమయింది. లాయక్ ఆలీ ప్రభుత్వానికి ప్రథమశత్రువు మున్షీజీ. పైగా శ్రీ మున్షీ దక్షిణసదనం వదలి పారిపోలేదు. "విమానం ఇస్తాం. పో" అన్నా పోవటానికి నిరాకరించినట్లు వదంతి. ఈ గూండాలు, ఆయనను ప్రాణంతో వదుల్తారా అని ప్రతివాడూ భయపడ్డాడు. కాని ఆయనఉనికి అందరికీ ధైర్యం కల్గించింది. ఆయన దక్షిణసదనంలోనే ఉండిపోవ సంకల్పించటంవల్ల ప్రజల కాయనపై ఆదరాభిమానాలు హెచ్చాయి. హైదరాబాదులో మున్షీ ఉన్నంతకాలం, మన ప్రాణాలకు ముప్పులేదని ప్రజలు నిబ్బరం వహించారు.


దక్షిణసదనాన్ని నైజాంసైన్యం వశపర్చుకొబూనింది. కాని ఉన్న కొద్దిమందిసిబ్బంది, నైజాంసైన్యంతో పోట్లాడుతామన్నారు. మున్షీజీ, వారికి లొంగిపొండని ఆదేశించాడు. తర్వాత ఆయనను లేక్ వ్యూలో నిర్బంధించారు. ఒకనాడు మున్షీ, గాలికోసం బయటకొచ్చేసరికి, కాపలాసైనికుడొకడు, లోపలికిపొమ్మని కసిరాడు. 'నీ పైవారితో చెప్పుకో' అని మున్షీ ప్రత్యుత్తర మిచ్చాడు. ఆ సైనికునికి, కోపంవచ్చి, తుపాకి చూపి బెదిరించాడు. కాని తర్వాత ఒక సైనికోద్యోగి వచ్చి, క్షమార్పణ చేసుకున్నాడు.

సెప్టెంబర్ 16 తారీకు రాత్రికి, అసలు ఈ పోలీసుచర్యనైన మేమో తెలుసుకోవాలని నైజాంకు కోర్కెపుట్టింది. మున్షీని పిల్చి సలహా అడగక తప్పలేదు. రెండుమూడు రోజుల్లో భారతసైన్యాలు హైదరాబాదులో ప్రవేశించేవి. ఆ ఆవేశంతో ప్రవేశించిఉన్నట్లయితే, చాలా దారుణచర్యలు జరిగేవి. కాని మున్షీ చతురతవల్ల హైదరాబాదుప్రజల ప్రాణాలూ, భారతప్రభుత్వ గౌరవమూ దక్కాయి. నైజాం, తాను లొంగిపోయినట్లు ఒప్పుకొని, భారతసైన్యాల్ని ఆహ్వానించటానికి తయారైనాడు. మున్షీ, తన సహజ ఔదార్యంతో, నైజాంకు దారిచూపి, పోలీసుచర్యకు దారుణఫలితాలేవీ సంభవించకుండాకే జాగ్రత్త వహించాడు. హైదరాబాదుకు కష్టకాలంలో ఆయన మిత్రునిలాగా సాయపడ్డాడు. హైదరాబాదుకోసం ఆయనపడిన హృదయావేదన సత్వరవిముక్తి దోహదంచేసింది. శ్రీమున్షీ, హైదరాబాదులో ఉన్న, భారతప్రభుత్వాధికారిమాత్రమే కాదు. హైదరాబాదు ప్రజలను మనసారా ప్రేమించి కాపాడిన మహాపురుషుడు. ఆయనను ప్రజలు మరువలేరు.



భారతప్రభుత్వ సంస్థానశాఖ కార్యదర్శి, వి. పి. మీనన్‌తో స్వామి రామానంద తీర్థ, శ్రీ మాడపాటి రామచంద్రరావుగార్లు

హైదరాబాద్ సంస్థాన పరిపాలక కార్యవర్గం



శ్రీ దత్తప్రసన్న సదాశివ బాక్లే

హైదరాబాద్ ఛీఫ్ సివిల్ అడ్మినిస్ట్రేటరు, శ్రీ డి. యస్. బాక్లే విద్యాభ్యాసము బొంబాయి ఎల్ఫిన్‌స్టన్ కాలేజీ, లండన్ స్కూల్ ఆఫ్ ఎకనమిక్సులలో జరిగింది. లండన్ ప్రాచ్యభాషల కళాశాలలో కూడా చదువుకొన్నారు.

1926 లో ఇండియన్ సివిల్ సర్వీసులో ప్రవేశం. కనరా జిల్లాలో కలెక్టరు చేశాడు భారత ప్రభుత్వంలో హోం డిపార్టుమెంటులోను, ఆతర్వాత బొంబే నేషనల్ సర్వీస్ లేబరు ట్రిబ్యూనల్ అధ్యక్షుడుగాను, యుద్ధకాలంలో సప్లై, కంట్రోల్ మొదలైన శాఖలలో కమీషనరు హోదా పదవులలోనూ పని చేశారు.

సౌరాష్ట్రం ప్రత్యేకరాష్ట్రం అయినప్పుడు ఆ ప్రభుత్వానికి ప్రధాన కార్యదర్శిగా నియమితులయ్యారు. తరువాత బొంబాయి హోం సెక్రెటరీ. 1948 సెప్టెంబరులో పూనా దక్షిణ సైనిక ప్రధానకార్యాలయంలో ఛీఫ్ సివిల్ లైజాన్ ఆఫీసరుగా నియమింపబడ్డారు. అక్కడినుంచి సెప్టెంబరు 19 న ఛీఫ్ అడ్మినిస్ట్రేటరుగా హైదరాబాద్ వచ్చారు.



శ్రీ జయంత్‌నాథ్ చౌదరి, మిలిటరీగవర్నర్

మేజర్ జనరల్ జయంతనాథ్ చౌదరి భారతీయసేనాపతులందరిలోకీ చాలా చిన్నవారు. వయస్సు 40 ఏండ్లు. సర్వజనసులభుడు. శాంతస్వభావుడు. భావుకుడు. పక్షపాత రహితుడు. ప్రజాభిమానం చూరగొనగల సంపద్విశేషమంతా ఆయనశీలంలో ఇమిడిఉంది.

శాండ్‌హర్స్టు విశ్వవిద్యాలయంనుండి వచ్చిన తర్వాత 1928 లో వీరిని "7 వ లైట్ కేవల్రీ" సైన్యంలో నియమించారు. గత సంగ్రామారంభంలో సూడాన్, ఎరిట్రియా, అబిసీనియా రంగాలలో వీరున్న 5వ ఇండియన్ డివిజన్ చాలా ప్రఖ్యాతివహించింది.


భారత సాయుధదళాల్లోకల్లా పెద్దదైన సాయుధసేనకు నేతగా రంగూన్‌పై యుద్ధం సాగించి కేంద్ర బర్మాయుద్ధంలో తనకు తన దళానికీకూడా పేరు తెప్పించాడు. 1946 లో మలయా కమాండు పరిపాలనానిర్వహణకు బ్రిగేడియర్‌గా నియమింపబడ్డారు. గత ఫిబ్రవరిలో ఈయన మేజర్ జనరల్ అయ్యారు.

హైద్రాబాద్ మిలిటరీ గవర్నరుగా, మంచిపరిపాలనాదక్షతయు, చతురరాజకీయజ్ఞత కలవారని జయంత్ చౌదరి నిరూపించుకొన్నారు.



నవాబ్ జైన్‌యార్‌జంగ్ బహదూర్ పబ్లిక్‌వర్క్స్ శాఖా సభ్యులు.

★




శ్రీ రాజాధోండిరాజ్ బహదూర్: విద్యాశాఖా సభ్యులు.



శ్రీ వి. హెచ్. కృష్ణారావుగారు
సప్లై శాఖాసభ్యులు




శ్రీ శేషాద్రిగారు
రెవిన్యూశాఖా సభ్యులు



శ్రీ సి. వి. యస్. రావుగారు
ఆర్థికశాఖాసభ్యులు.

భారతదేశ ఆర్థిక వ్యవస్థలో హైదరాబాద్ సమీకరణ



[శ్రీ లక్ష్మీనారాయణ గుప్త]

[హైదరాబాద్‌లో ఇదివరలో ఆర్థికశాఖాకార్యదర్శిగా ఉన్నారు. ఇప్పుడు జాగీర్ల పరిపాలనాశాఖ కమిషనర్‌గా పనిచేస్తున్నారు.]

హైదరాబాద్ భౌగోళిక స్థితినిబట్టీ, జాతి, మతసాంఘిక బాంధవ్యాలనుబట్టీ, హైదరాబాద్ భారతదేశంలో అంతర్భాగంగానే ఉంది. ఇక ముందు కూడా అలాగే ఉంటుంది. హైదరాబాద్ సంస్థాననివాసులు తాము భారతీయులనే ఎల్లప్పుడూ భావించారు. భారతదేశసమైక్యతయే వారితలపుల్లో ఉండేది. ఒక చిన్నవర్గం హైదరాబాద్‌ను భారతదేశంనుంచి, రాజకీయంగానూ ఆర్థికంగానూ విడగొట్టాలని ప్రయత్నంచేసినప్పటికీ, హైదరాబాద్‌సమస్య లెప్పుడూ భారతదేశసమస్యల్లోనే ముడిపడి ఉన్నాయి. భారతదేశస్థితికి భిన్నమైన హైదరాబాద్ ఆర్థిక సమస్య ఒక్కటి కూడా కనిపించదు. ప్రాంతాలవారీగా కొన్ని సమస్య లుండవచ్చును. కాని అవి అన్ని రాష్ట్రాలకూ, సంస్థానాలకూ ఉన్నవే. హైదరాబాద్ కూడా తన సమస్యలవల్ల భారతదేశస్థితికి ఎట్టి చలనం కలుగుతుందో యోచించుకోవలసిందే.

ఇతర సంస్థానాలవలెనే హైదరాబాద్ కూడా ఇదివరలో రాజకీయస్వపరిపాలనా హక్కు అనుభవించినదే. ఆ సంస్థానంలోని పురాతనభూమియాజమాన్యవ్యవస్థవల్ల ఒకవిధమైన ఆర్థిక విశిష్టత కూడా తెచ్చుకున్నది. అయితే ఈ రాజకీయవిశిష్టత హైదరాబాద్ వంటి పెద్ద సంస్థానానికి సహజమే. కాని ఈ ఆర్థిక రాజకీయ స్వయం పరిపాలనావ్యవస్థను పరిశీలించినట్లయితే, దానికి మూలం సంస్థానంలోని పురాతన జాగీర్దారీవ్యవస్థ అనీ, ఆనాటి బ్రిటిష్‌సామ్రాజ్యం కింద అనుభవించిన సామంతాధికారంవల్ల ననీ తేటపడుతుంది. బ్రిటిష్‌వారి సామ్రాజ్యాధిపత్యం ఈ సంస్థానాలపైన కూడా సర్వంసహాధిపత్యం. ఆయాసంస్థానాధిపతుల హెచ్చుతగ్గులను బట్టి వారి రాజరికాధికారాలలో హెచ్చు తగ్గులొచ్చాయి. విస్తీర్ణతలోనూ, జనాభా రెవిన్యూ ఆదాయాలలోనూ భారతదేశంలోకెల్ల ఆధిక్యం గల హైదరాబాద్‌లో సంస్థానాధిపతికి రాజరికాధికారాలు అధికంగా ఉండడం సహజమే.

ఆర్థిక ద్రవ్య స్వయం నిర్ణయాధికారాల లక్షణాల్ని పరిశీలించినట్లయితే పై ఉత్తరవాదం నిరూపిత మౌతుంది. హైదరాబాద్ విషయంలో ఈ లక్షణా లేవంటే; 1. ప్రత్యేక ద్రవ్య చలామణి, నాణేలు, నోట్లు 2. వస్తు రవానా సుంకాలు. 3. స్వతంత్ర తపాలా శాఖ. 4. ప్రత్యేకమైన రైల్వే రవాణాశాఖ 5. పన్ను వసూలు అధికారాలు 6. స్వతంత్రసైన్యం.

ఇదివరకే ప్రత్యేక ద్రవ్య విషయమై హైదరాబాదులో చాలాకల్లోలం సంభవించింది. భారతదేశ సంస్థానాల రాజ్యాంగసంస్కరణల సందర్భంలో ఈ విషయమై పోరాటాలు జరిగాయి. ఫెడరల్ (స్వయం నిర్ణయాధికార సమన్విత రాజ్యకూట రాజ్యాంగ) వ్యవస్థనుగురించి (1935 చట్టం) భారతదేశంలో వాదోపవాదాలు చెలరేగినప్పుడు హైదరాబాద్ ఈ పోరాటంలో ప్రధానపాత్ర వహించింది. కాని ఆర్థికశాస్త్రం తెలిసినవారికి హైదరాబాద్‌కెన్నడూ స్వతంత్ర ద్రవ్యచలామణి లేనే లేదని తెలిసిన విషయమే. ద్రవ్యప్రమాణాన్ని ఆర్థికపరిపాలనకు పరికరంగా ఉపయోగించడం హైదరాబాద్‌కు అసాధ్యం. ఆ అధికారం కూడా సంస్థానానికి లేదు. హైదరాబాద్ ద్రవ్యం రూపాయికి ముడిపెట్టబడింది. ఈ బంధంనుంచి తప్పించుకోలేదు. ఎన్నడూ హైదరాబాద్‌కు విదేశాలతో చెప్పుకోదగిన వ్యాపారం లేదు. విదేశీద్రవ్యాలతో మారకం అవసరం ఎన్నడూ కలగలేదు. ఏపాటి మారకం అవసర మున్నా అది భారతప్రభుత్వంచలామణిలో ఉన్న రూపాయిద్వారానే జరిగేది. హైదరాబాద్‌కున్న విడిరూపాయిలవల్ల వస్తూత్పత్తి ప్రమాణంపైనగాని వస్తువుల ధరలపైనగాని ఎట్టి మార్పూ కలగలేదు. ఎగుమతి దిగుమతులపై నిర్బంధాలు విధించడానికిగాని వ్యాపారాన్ని అదుపులో పెట్టుకోడానికిగాని సిక్కా రూపాయికి బలం లేకపోయింది. హైదరాబాద్ సిక్కా రూపాయిల్ని ఏఅన్యదేశంగాని ఏ ఇతరజాతి బాంకుగాని ఏప్రభుత్వంగాని గణన చెయ్యలేదు. ఇండియారిజర్వుబాంకులోగాని మరే దేశపు సెంట్రల్‌బాంకులోగాని హైదరాబాద్ పేరిట జనుల (డిపాజట్లు, బాలన్సులు) ఎన్నడూ లేవు. ఇప్పుడు హైదరాబాద్ ద్రవ్యవిశిష్టతను రద్దుపరిచినందువల్లనూ, భారతి ప్రభుత్వపు ద్రవ్యాన్ని ప్రవేశపెట్టినందువల్లనూ హైదరాబాద్‌లో ఆర్థికపరిపాలనావిధానంలో ఎలాంటి మార్పు రానక్కరలేదు. రాదు. అయితే ద్రవ్యాన్ని మార్చడంలో కొన్ని తతంగాలు అవసరం. వాని అంతర్యాన్ని వివరంగా జాగ్రత్తగా పరిశీలించవలసిన అవసరం ఉంది. ఈ మార్పువల్ల నోట్ల రిజర్వుపైనా, నాణేలపైనా హైదరాబాద్ ప్రభుత్వం పెట్టిన పెట్టుబడికి నష్టం వస్తుంది. ఈవివరాల్ని హైదరాబాద్ ప్రభుత్వం, భారత ప్రభుత్వం కూడా జాగ్రత్తగా పరిశీలించవలసిఉంటుంది. హైదరాబాదుఆర్థికసుభిక్షం పట్ల హైదరాబాద్ ప్రభుత్వానికెంత శ్రద్ధ ఉంటుందో భారతప్రభుత్వానికీ అంత శ్రద్ధ ఉంటుంది. ఇంక ఈవిషయాన్ని మరింత వివరంగా చర్చించడం అనవసరం. మార్పునిగురించి అంచనాలు వేసేవా రుంటారు కూడా.

రవానా సుంకం:

వస్తువుల ఎగుమతిదిగుమతులకు సుంకాలు విధించే అధికారం హైదరాబాద్‌కు పరిమితంగానే ఉంది. ప్రమాణగతినిబట్టి అది నూరింట 5 మాత్రమే. రవానా సుంకం విధించడంలో పెద్ద ఆర్థికపరిపాలనావిధాన మేమీ లేదు. రాబడి కోసం పన్ను విధించినట్లే సంస్థానంలోని పరిశ్రమల్ని పోటీనుంచి రక్షించడానికై 5% కంటె హెచ్చుపన్ను విధించడానికి అధికారం లేదు. కాని ఎగుమతిపన్ను విధించడంవల్ల ఆపరిశ్రమలకి కొంత నష్టమే కూడా. ఈపన్నుల పారిశ్రామికయజమానులకి, దిగుమతి వ్యాపారులకి లాభదాయకమే గాని వ్యవసాయదారుకీ, ఎగుమతివ్యాపారులకీ నష్టం కలిగిస్తోంది. ఈపన్ను రద్దుచేసినందువల్ల హైదరాబాదు ప్రభుత్వాదాయానికి లోపం కలుతుంది కాబట్టి ఈవిషయాన్ని జాగ్రత్తగా పరిశీలించవలసి ఉంటుంది. ఈ ఆదాయలోపాన్ని భర్తీచెయ్యడానికి వస్తువులన్నిటిపైనా అమ్మకపు పన్నుగాని మరొక పన్నుగాని విధించే విషయం ఆలోచించవలసి ఉంటుంది. ఈవిషయాన్ని ద్రవ్యసంస్కరణలతోనూ, భారతదేశఆర్థికవ్యవస్థలో హైదరాబాద్‌ను విలీనం చెయ్యడంలోనూ ఆలోచించాలి.

హైదరాబాద్ ప్రత్యేక తపాలా శాఖని సంస్కరించే విషయంలో ఇటువంటి వేమీ ఉండవు. ఆర్థికపాలనావిధానంలో మార్పు రానక్కరలేదు. దీనివల్ల వచ్చే నష్ట మేమీ లేదు. ఎందువల్లనంటే, ఈప్రత్యేకశాఖవల్ల వచ్చే ఆదాయమూ లేదు. మరే ప్రయోజనమూ లేదు. భారతప్రభుత్వతపాలాశాఖలో దీన్ని విలీనం చెయ్యడంలో కొన్ని ఉద్యోగవర్గసంస్కరణలు, సెబ్బుమదుపులు అవసరమౌతాయి. భారతప్రభుత్వంతో సంప్రదించి ఈమార్పులు సులువుగా తీసుకురావచ్చు.

రైల్వే

హైదరాబాద్ ప్రత్యేక రైల్వే శాఖను గురించి నేనంతగా చర్చించనక్కరలేదు. ఈ రైల్వేజనరల్ మేనేజరు జగ్‌తియానీ ఈ విషయాన్ని చర్చించడానికి అర్హులు. ఆర్థికంగా చూస్తే ఈ రైల్వే వల్ల హైదరాబాద్ ప్రభుత్వానికి చాలా రాబడి వస్తోంది. ఈ రాబడి లోపం రానివ్వకుండా ఏదో ఏర్పాటు చెయ్యవలసి ఉంటుంది.

హైదరాబాద్ ఆర్థికప్రత్యేకతంతా రాబడి పన్ను, ప్రత్యక్షసుంకాలు, పరోక్షసుంకాలపైన ఆధారపడి ఉంది. కాని ఈ అధికారం పూర్తిగా వినియోగపడలేదు. కొద్దికాలం క్రిందవరకూ సుంకాల పద్ధతి తప్పులతడకగా ఉండేది. ఈ రాబడిలో ముఖ్యమైనది భూమిశిస్తు, ఎక్సైజ్ పన్నులు, మొదలైనవానివల్ల వచ్చేది. అధికలాభాలపన్నులు యుద్ధకాలంలో వచ్చేవరకూ ప్రత్యక్షసుంకా లసలు లేనేలేవు. రాబడిపన్ను ప్రవేశపెట్టి రెండు సంవత్సరాలే అయింది. మున్ముందు హైదరాబాద్ ప్రభుత్వానికి రాబడిలో రాబడిపన్నే ప్రధానాంగమవుతుంది. ఇప్పటికి భారతఅధినివేశంలో రాబడిపన్నుతో పోలిస్తే హైదరాబాద్‌లో రాబడిపన్నురేట్లుచాలా తక్కువ. మొత్తం మీద చూస్తే తలకి 1 రూపాయి మాత్రమే పడుతుంది. (భారత అధినివేశంలో తలకి రు 8.) అయితే ఈ పోలిక తేవడం సమంజసం కాకపోవచ్చును. భారతదేశంలోని ఇతర ప్రాంతాలతో పోలిస్తే హైదరాబాద్‌లో ఆర్థికవ్యవస్థ పేదగా ఉందని చెప్పాలి. రాబడిపన్నుకింద ఇంకా చాలా వసూలుచెయ్యడానికి అవకాశం ఉంది. హైదరాబాద్‌సుంకాల్ని భారతదేశపు రెవిన్యూలో చేర్చినా, సంస్థానానికి నష్టం రాదు. యూనియన్ కేంద్రానికీ రాష్ట్రాలకీ మధ్య రాబడి పన్ను జనుల పంపకంవల్ల (సర్కార్ కమిటీనివేదికసూచనప్రకారం) జనాభానిష్పత్తినిబట్టి హైదరాబాద్‌కు వచ్చే వాటా చాలా ఉంటుంది. అందువల్ల ఇప్పుడు ముఖ్య సమస్య ఏమిటంటే ఈ పన్నువల్ల రాగలదానిని పూర్తిగా రాబట్టుకోవడం. అయితే ఇది క్రమంగా జరగాలి. అసలీ సుంకం ప్రవేశపెట్టడమే ఆలస్యం అయింది. ఈ సందర్భంలో హైదరాబాద్‌కి రెవిన్యూ తగ్గిపోతుందనే భయం అనవసరం. అధినివేశరాష్ట్రాలవలె కేంద్రంలో వాటాలు వేసుకున్నా, లేక రాబడి పన్నుని పూర్తిగా హైదరాబాద్‌కే విడిచిపెట్టినా హైదరాబాద్ రెవిన్యూకి లాభమే కాని నష్టం ఉండదు. ఇతర ఆర్థికవిషయాలలోవలెనే ఇందులోకూడా ఏ విధానం అవలంబించాలో సంస్థానఆర్థికవిలీనీకరణవిచారణసంఘం నివేదిక ననుసరించి భారతప్రభుత్వం నిర్ణయించవలసి ఉంటుంది.

పైనచెప్పినట్లు హైదరాబాద్‌లో సుంకాల విధింపు ఇదివరలో ప్రత్యేకత్వం సాధించాలనే ఆశయంతోనూ, పురాతన భూస్వామ్యవిధానాన్ననుసరించీ నిర్ణయింపబడింది. ఉన్న రెవిన్యూ చాలావరకూ అటువంటి సుంకాలపైనే వస్తోంది. అంటే నాణేలముద్రింపువల్ల వచ్చేలాభం, నోట్లముద్రణవల్ల వచ్చేలాభం, రవానాసుం

(24 వ పేజీ చూడుడు)

"తారా" కుంకుమపువ్వు మాత్రలు.

"తారా" కుంకుమపువ్వుమాత్రలలో ముఖ్యమైన పదార్థము కుంకుమపువ్వు కస్తూరి మరియు తృణమణియను పదార్థములో కుంకుమపువ్వును కలిపి ప్రాచీనకాలపు ఆయుర్వేదశాస్త్రములో నివేదించినవిధముగా ఈ మాత్రలు తయారుచేయబడినవి. ఈ మాత్రలు ఎప్పుడు పాడవకుండ యుండేటట్టుగా వాటిలోని పదార్థములు కలుపబడియున్నవి.

విశేషత రోగమురాకుండ చేసేటందుకు మరియు రోగమువచ్చిన సమయములో అది మగవారికి మంచిది. మరియు పిల్లలకు, ఆడవారికి ఇంక మంచిదికూడ.

విశేషము దానిని ఉపయోగించే విధము చాల సులభము. మరియు లంకణము చేయనక్కరలేదు.

ఇచ్చేవిధము ఆవు లేక గేదెయొక్క అప్పుడే పితికిన పాలతోనో లేక వెచ్చటి, శుభ్రమైన పాలతోనో తీసుకొనవలెను ఇటువంటి పాలు అన్నిచోట్ల దొరకును.

ప్రయోజనములు మూత్రాశయము బలహీనముగా నుండుటవలన మరియు చెడ్డ మూత్రపిండమువలన కలుగు అన్ని బాధలకు ఇది అమోఘమైన ఔషధము. "తారా" కుంకుమపువ్వుమాత్రలను వాడినచో ఈ క్రింద చెప్పబడిన రోగములు కుదుర్చబడును లేక అవి రాకుండ చేయబడును వాతరోగము, పక్షవాయువు, పక్షవాతము, పార్శ్వవాయువు మొదలైన అన్నివిధములైన వాయురోగములు, స్వప్నదోషములు, గ్లీట్, అతిమూత్రము, మలబద్ధకము, దగ్గు, నడుమునొప్పి, మోకాలులోనో లేక శరీరములో ఏ యితర భాగములోనో నొప్పి ముసలితనములో వచ్చు బాధలను అతి దూరములో వుంచును. "తారా" కుంకుమపువ్వుమాత్రలు ముసలితనము రాకుండచేయునని చెప్పినా తప్పులేదు దీనిని బహుకొద్దిగా వాడినచో పళ్లు వచ్చు సమయమున గలుగు బాధలనుండి పిల్లలను రక్షించును స్త్రీలు గర్భముతో నున్నప్పుడు తరచు అనేక విధముల రోగములనుండి బాధపడుదురు. మరియు చాలామందికి మిగిలి యున్న జీవితమంతకూడ పాడైపోవును "తారా" కుంకుమపువ్వుమాత్రలను యుక్తమైన కాలములో వాడినచో గర్భకాలములో నేర్పడు రోగములను అవి రాకుండ చేయును ముట్టుకు ముందర ముట్టురోజులలో లేక ముట్టుతర్వాత మిక్కిలి కష్టపడు ఆడువారు "తారా" కుంకుమపువ్వుమాత్రలను వాడినచో మంచిది బలహీనతవలన కలుగు ఉబ్బసరోగముతో. బాధపడి నివసించుటకంటె చావే మేలనుకొను ముసలివారి జీవితము "తారా" కుంకుమపువ్వుమాత్రలు కాపాడును ముసలివారికంటె ఇంక పాడుగానుండు చిన్నవాండ్రకు మంటను నూనెలు ఎట్లు వెలిగించునో అట్లు ఇవి పనిచేయును "తారా" కుంకుమపువ్వుమాత్రలను విడువకుండ కొద్ది రోజులు వాడినచో అవి మగవారికి, ఆడవారికి మరియు పిల్లలకు కడుపుబ్బుటయును (గర్భమువలన స్త్రీల కేర్పడు కడుపుబ్బటము గాదు) మరియు బుడ్డను తగ్గించుటకు సహాయపడును పిల్లలను రక్షించుటకు చిన్నవాండ్రకు మరియు ముసలివాండ్రకు సహాయపడుటకు ఆడవారి సౌందర్యమును వృద్ధిపరచుటకు ఇవి అన్నివిధాలుగా ఉపయోగపడును రక్తస్రావము మరియు మూర్ఛకు ఇవి చాలామంచివి.

రోగము రానీయకుండ జేయుటకు. రాత్రి పడుకునేటప్పుడు ఆవు లేక గేదెయొక్క అప్పుడే పితికిన పాలుతోనో లేక వెచ్చటి శుభ్రమైన పాలుతోనో రెండు మాత్రలను తీసుకొనండి ఒక సంవత్సరమునకు నూరు మాత్రలు తీసుకొన్నచో చాలు.

రోగము వచ్చినప్పుడు. అప్పుడే పితికిన పాలుతోనో లేక వెచ్చటి, శుభ్రమైన పాలుతోనో ప్రొద్దున్న రెండు మాత్రలు మరియు రాత్రి పడుకునేటప్పుడు రెండు మాత్రలు.

పిల్లలకు. ఒక సంవత్సరపు వయస్సు గలవారికి ఒక మాత్రలో నాలుగవ భాగము ఒకటినుండి రెండేండ్లవారికి మాత్రలో 1/3 వంతు భాగము రెండునుండి ఆరేండ్లవారికి సగము మాత్ర ఆరునుండి పన్నెండేండ్లవారికి ఒకమాత్ర. గంధపుచెక్కను చేసేటట్లే దీనిని పాలుతో అరగదీయండి. తరువాత తల్లియొక్క పాలునో లేక వేడి పాలునో ఇవ్వండి.

గర్భస్త్రీలకు. పడుకొనేటప్పుడు వేడిపాలుతో ప్రొద్దున ఒకమాత్ర మరియు సాయంత్రము ఒకమాత్ర.

సరికాని ముట్టుకు. ఒకరోజుకు, ఒక్కసారి పడుకొనేటప్పుడు వేడిపాలుతో రెండుమాత్రలు తగినంత చల్లని నీటిని బంకమట్టితో కలిపి అర అంగుళము దళసరియుండేటట్టు దానిని కడుపుమీద బొడ్డుక్రింద వేసినచో ఈ రోగము త్వరగా స్వస్థత చెందును. ఈ బంకమట్టిని వేయుటకు ముందు రెండుగంటల ముందు ఆహారమును తీసుకొనేటట్లు జాగ్రతపడవలెను. ఇది ఆరిపోయే సమయములో దీనిని తీసివేయండి ఇట్లు తీసి వేసిన తర్వాత మరియొక రెండు గంటలదాకా ఆహారమును తీసుకొనకండి. అంటే 4 గంటలు ఆహారమును తీసుకొనగూడదు మీకు ఎప్పుడు వీలున్నదో అప్పుడు బంకమట్టిని వేయండి

ముందు జాగ్రత "తారా" కుంకుమపువ్వుమాత్రలను తీసుకొనినతర్వాత పాలును తీసుకొనవలెను పాలు దొరకనిచో ఈ మందును వాడకండి

హెచ్చరిక అనేకమంది "తారా" కుంకుమపువ్వుమాత్రలవలెనుండు పేర్లను పెట్టి జనులను మోసగిస్తారు మీరు మోసపోకండి. మా అఖిలఇండియా రిజిష్టర్డ్ నంబరు. యున్నదా చూడండి

"తారా" (కుంకుమపువ్వుమాత్రలు) కొంచెముకూడ హానికరమైనది కాదు మరియు అందులో నున్న పదార్థములు ఏ మతము లేక జాతికి అయిష్టమును ఏర్పరచదు

ధరలు —	40	మాత్రలున్న	సేంపిల్ బుడ్డి	రూ 1-4-0
	100	,,	బుడ్డి	రూ 3-0-0
	250	,,	,,	రూ 7-0-0
	1000	,,	,,	రూ 25-0-0

తయారుచేయువారు:

అగర్వాల రసాయనశాల,

ప్రొప్రయిటర్: కల్లుమల్ తారాచంద్ అగర్వాల.

బేగంబజార్, హైదరాబాద్-దక్కన్.

రచనా స్వాతంత్ర్యానికై అసువులర్పించిన అమరజీవి

షోయాబుల్లా ఖాన్

శ్రీ పులిగడ్డ సుబ్బారాయుడు



రజాకార్లచే హత్యకావింపబడ్డ షోయాబుల్లాఖాన్

తమహృదయాలకు సన్నిహితమైన కొన్ని ఆదర్శాలను కల్గి వాటిపై గాఢమైన విశ్వాసంతో ఆత్మ త్యాగం కూడా చేసిన మహనీయులు మన దేశచరిత్రలో అనాదిగా వుంటూనే వున్నారు. ఆధునిక నాగరిక యుగంలో రచనాస్వాతంత్ర్యంకోసం తన జీవితాన్ని అర్పించి చరిత్రలో అమరస్థానాన్ని పొందాడు పత్రికా రచయిత షోయాబుల్లాఖాను.

షోయాబుజన్మస్థానము వరంగల్లుజిల్లా, మానుకోట తాలూకాలోని శుభ్రపీడుగ్రామం. ఇతనితండ్రి హబీబుల్లాఖాను ఆరోజుల్లో అక్కడ పోలీసు సబ్ ఇన్స్పెక్టర్‌గా వుండేవాడు. వారిపూర్వీకులు పఠానుల్లో భోకర్ తెగకు చెందినవారు. వారెప్పుడో సంయుక్తరాష్ట్రాల లోని ఫతేపూరుకు వలసవచ్చారు. అక్కడనుండి ఉద్యోగరీత్యాహబీబుల్లా నైజాం చేరుకున్నాడు.


షోయాబుల్లా విద్యార్థిగా తొలుత నాంపల్లి హైస్కూలులోను తరువాత ఉస్మానియా విశ్వవిద్యాలయంలోనూ విద్యనభ్యసించాడు. 944 లో పట్టభద్రుడయాడు. విద్యార్థిగా వుండగానే అతనికి పత్రికారచనలో అభిరుచి వుండేది. ఉస్మానియావిశ్వవిద్యాలయపు మేగజీనులో ఉర్దూభాగానికి ఇతడు సహాయ సంపాదకుడుగా వుండేవాడు.

కళాశాల వదలిన వెంటనే "తాజ్" అనే ఒక ఉర్దూవారపత్రికలో ఉపసంపాదకుడుగా వుంటూ వుండేవాడు. "సుబే దక్కన్" అనే ఉర్దూదినపత్రిక మొదటిపేజిలో పేరులేకుండా హైద్రాబాదు నిజాం ప్రతిరోజూ ఏదో తనకు తోచిన విషయం వ్రాస్తూవుండేవాడు. ఒక రోజున "తాజ్"లో దీన్ని విమర్శిస్తూ షోయాబుల్లా ఇలా వ్రాశాడు. "సుబేదక్కన్"లో వ్రాసే అనామకరచయిత ఎవరో బోధపడటం లేదు. ఈ రచయిత "నిజాం ప్రభువు" అని కొందరంటారు. అదే నిజమయితే ప్రభువు ఇలా రాయడం వాంఛనీయం కాదు" అని. ఆ మరునాడే "తాజ్" పై ఆంక్ష విధించబడింది.

అనంతరం షోయాబుల్లా శ్రీ మందుముల నరశింగరావుగారి "రయ్యత్"లో ఉపసంపాదకుడుగా చేరాడు. ఇక్కడనే శ్రీ నరసింగరావు గారి శిక్షణక్రింద అతడు ప్రథమశ్రేణి రచయితగానే కాకుండా, సంపూర్ణ జాతీయవాదిగా కూడా తయారయాడు.

రయ్యత్ రచనలు ప్రభుత్వానికే డొక్కలో పోట్లవలె వుడటంవల్ల 1947 అక్టోబరు 21 వ తేదీన ప్రభుత్వం "రయ్యత్" పత్రికపై ఆంక్ష విధించింది. ఇది ముందుగానే తెలిసివుండటం చేత షోయాబుల్లా "ఇమ్రోజ్" అనే పత్రికకు డిక్లరేషన్ పొందివున్నాడు.

రయ్యత్ నిల్చిపోగానే ఇతడు "ఇమ్రోజ్"ను వారపత్రికగా పచురించడం ప్రారంభించాడు. కార్యాలయానికి చోటుదొరక్క మొదట "రయ్యత్" ఆఫీసులోనే తినా ప్రారంభిద్దామని అనుకున్నాడు. కాని "ఇమ్రోజ్", "రయ్యత్"యొక్క మరొక స్వరూపమని తలచి ప్రభుత్వం వెంటనే నిషేధిస్తారనే భయంతో ఆపని చెయ్యలేదు. అందువల్ల ఆ రోజుల్లో శ్రీ బూర్గుల రామకృష్ణరావుగారు జెయిల్లో వుండటంవల్ల ఖాళీగావున్న వారి యింట్లో "ఇమ్రోజ్" కార్యాలయం స్థాపించాడు. "ఇమ్రోజ్" అంటే "ఈనాడు" అని అర్థం. "ఇమ్రోజ్"లో, రజాకార్లను గురించి షోయాబుల్లావిమర్శలు అంతకంతకు తీవ్రమయినాయి. ప్రభుత్వం నేరుగా ఏమీ అనలేదు గాని, రజాకార్లవద్దనుంచి ఇతనికి తరుచు హెచ్చరిక వస్తూనే వుండేదిట. రజాకారు దుశ్చర్యలు ఎక్కువైనకొద్దీ, ఇతని విమర్శ కూడా తీవ్రతరమయింది. ఇతనిపై రజాకార్ల ఆగ్రహం కూడా యెక్కువైంది. ఒక విషయంపై ఆగ్రహంతో మనంచేసే విమర్శకంటె పరిహాసంగా చేసే విమర్శ ఎక్కువ ఫలితాన్ని కల్గివుంటుంది. బీబీనగరం ప్రాంతంలో మకాంవేసిన రజాకార్ల గుంపుకు ఒకరాత్రి "బిర్యానీ" తినాలని అభిలాష కల్గింది. అక్కడ వేట యేమీ దొరక్కపోయింది. వెంటనే గూడెంలోకి వెళ్లి అక్కడ చాకలివాని గాడిదలుంటే వాటిని తోలుకువచ్చి "బిర్యానీ" చేసి ఆరాత్రి విందారగించారట. ఇది షోయాబుల్లా ముస్లిం హృదయానికి చాలా హేయంగా కన్పించింది. మరునాడు "గధేకాబిర్యానీ—ధోబీకాపరేషానీ" అని వ్యంగ్యంగా ఒక వ్యాసం రాశాడు, షోయాబుల్లా. ఈ వ్యాసంతో రజాకర్ల ఆగ్రహం పొంగిపొరలిపోయింది. అంటే షోయాబుల్లా రోజులుదగ్గరకు వచ్చాయన్న మాట.



షోయాబుల్లాఖాన్ బావ ఇస్మాయిల్ ఖాను రజాకార్ల దుండగానికి పాల్పడ్డవాడు.

ఒకనాటిరాత్రి—ఆ వారపు "ఇమ్రోజు" కు ఇచ్చే "మేటరు" పూర్తి కాకపోవడంవల్ల షోయాబుల్లాయున్నూ, అతని బావమరిది ఇస్మైల్ ఖానున్నూ కార్యాలయంలో చాలా పొద్దుపోయేవరకూ వున్నారు. ఆనాడు షోయాబుల్లా ఒక ఉద్రేకతరంగంలో తేలియాడుతున్నాడు. ఒక గేయం వ్రాశాడు. అందులో ముఖ్యవిషయం ఇది.

"సాకీ! ఈ ప్రపంచయాత్రలో ఇది నా కడపటిరాత్రి. ఏదీ ఆ మధుపాత్ర ఇటు తెచ్చి మరోసారి నింపు నా గ్లాసు."

మధుసేవనలో అందరు కూర్చుండగా మధుపాత్ర చేత ధరించి అందరికీ వడ్డించేవానిని "సాకీ" అంటారు.

అదేరాత్రి కార్యాలయం మూసి ఇంటికి పోతుండగా షోయాబుల్లా హత్య చేయబడ్డాడు.

హైదరాబాద్‌పై భారత ప్రభుత్వ పోలీసు చర్య



హైదరాబాద్ పోలీసుచర్యలో సర్వసేనాధిపతి లెఫ్టినెంట్ జనరల్ రాజేంద్రసింహాజీ

1948 సెప్టెంబర్ 18-వ తేదీ భారతదేశ చరిత్రలో చిరస్మరణీయమైన రోజు.

భారతసేనాపతుల వ్యూహరచనాచాతుర్యానికీ, సేనల సాహసపరాక్రమాలకూ చిర ప్రతిష్ఠ చేకూర్చిన రోజు.

కోటిన్నర ప్రజల చిరవాంఛలు ఫలోన్ముఖమైన రోజు.

హైదరాబాద్‌పై భారతప్రభుత్వపోలీసు చర్య విజయవంతంగా ముగిసిన రోజు అది!

సెప్టెంబర్ 13-వ తేదీ తెల్లవారుజామున 4 గంటలకు భారతసేనలు సంస్థానంనలువైపుల నుంచీ 'చెలో సికందరాబాద్' అని ముందడుగు వేశాయి.

సెప్టెంబర్ 13 అనడంతోనే వెనుకటి చరిత్ర జ్ఞాపకం రాకతప్పదు. 1727 సెప్టెంబర్ 18 న ఇట్టి సంఘటనే జరిగింది. అదీ నిజాం నవాబు గర్వభంగానికి సంబంధించినదే. మహారాష్ట్ర వీరుడు పీష్వా బాలాజీబాజీరావు, ఇట్లాగే అప్పటి నిజాం నవాబు అధికార దురహంకారాన్ని అణచివేయటానికి ఆరోజున హైదరాబాదుసంస్థానంపైకి దండయాత్ర ప్రారంభించాడు. ఆ నిజాం దాసోహం అని దాసుని తప్పు దండంతో సరి అని ఒక దణ్ణంపెట్టి ప్రాణాలు కాపాడుకొన్నాడు.

ఇది ఈనాడు మన సేనలకు శుభోదర్కమైనది. 18-వ తేదీ ముస్లిములకు అచ్చిరాని దవడం ఇందులో ఇంకో విశేషం.

దక్షిణప్రాంతసర్వసేనాని లెఫ్టినెంట్ జనరల్ మహారాజా శ్రీ రాజేంద్రసింహాజీ మంచి చాతుర్యంతో, పటిమగల వ్యూహం వేశారు.

సికందరాబాద్ చేరవలసిన ప్రధానసేనావాహిని, మేజర్ జనరల్ జయంత్‌నాథ్ చౌదరి నాయకత్వాన షోలాపూరువద్ద బయలుదేరింది. షోలాపూరునుంచి సికందరాబాదుకు సరాసరి రస్తా వుంది.

ఈ సేనలో ఒక దళం నల్‌దుర్గ్‌నుంచి ఉత్తరంగా జాల్నామీదికి సాగింది. మిగతా సేన సికందరాబాదుమీద చూపెట్టుకుని నడిచింది.

ఈ రంగానికి దక్షిణాన హూస్‌పేటవద్ద మైసూరుసేనకు సంబంధించిన బ్రిగేడియర్ శాల్, మధ్య ప్రాంత డి. ఐ. జి. పార్థసారధి అయ్యంగార్ నాయకత్వాన మైసూరు సేన కొంతా, మద్రాస్ ప్రత్యేకపోలీసు దళం కొంతా మునీరాబాదువద్ద తుంగభద్రపై గల వంతెనను స్వాధీనం చేసుకొని ముందుకు సాగాయి.

ఇక్కడికి కొంచెం తూర్పుగా కర్నూలువద్ద మైసూరుఅశ్వికదళ మొకటీ, మన పోలీసు బలగమూ తుంగభద్రపైన గల రైలువంతెనను సురక్షితంగా స్వాధీనం చేసుకొని, గద్వాల్ వైపుగా, ముందుకు సాగినవి.

మనప్రాంతంలో విజయవాడ వద్దనుంచి, బ్రిగేడియర్ మదన్‌సింగ్ అధ్వర్యాన ఒక సేనాదళం, ఉత్తరప్రాంత డి. ఐ. జి. వి. సుబ్బరాయన్. నాయకత్వాన కొంతపోలీసుబలగమూ బయలుదేరినవి. సేనాదళం రెండు భాగాలుగా అయి ఒకటి రైలుమార్గంవెంబడే ఖమ్మంమెట్టు మీదుగా వరంగల్లూ, రెండవది రాస్తావెంబడే సూర్యాపేట మీదుగా సికందరాబాదూ లక్ష్యాలుగా పురోగమనం సాగించాయి.

ఉత్తరాన సి. పి. నుంచి కొంతసేనా, కొంత పోలీసుబలగమూ బల్హార్షామీదికి నడచి ఆపట్నం ఆక్రమించాయి. ఆసమీపంలో గోదావరిపై గల రైలువంతెనకు ప్రమాదంలేకుండా చేశాయి. ఈరంగానికి పడమరగా సి. పి. లోని కాన్గ్రాం వద్దనుంచి కొంత పోలీసుబలగం హింగోలీ దిశగా బయలుదేరింది. ఈరంగానికి కొంచెం వాయవ్యంగా తల్వాడ్‌నుంచి ఒక సైనికదళం ఔరంగాబాదుమీదికి పోసాగింది.

షోలాపూర్, విజయవాడ, తల్వాడ్‌లనుంచి బయలుదేరినవే ప్రధానసేనాదళాలు. మిగతావి, ఏదైనా ప్రతిఘటనవుంటే అది కేంద్రీకృతం కాకుండా చేయడానికీ, స్వాధీనమయిన ప్రాంతాలలో ఎప్పటికప్పుడు సంఘవిద్రోహశక్తులను మట్టుపెట్టడానికీ ఉద్దేశింపబడినవి.

హూస్‌పేట, కర్నూలు, విజయవాడలవద్ద బయలుదేరినబలగాలు మద్రాస్ ప్రాంతసేనాని మేజర్ జనరల్ రుద్రా పర్యవేక్షణక్రింద పని చేసినవి.

ఈ 'దండయాత్ర'లో గూర్ఖాలు, సిక్కులు, మద్రాస్. సి. పి. బొంబాయిపోలీసులు పాల్గొన్నారు. సేనాపతులలో ఇద్దరు ఆంగ్లోఇండియన్లు ఉన్నారు.

13 వ తేదీ సూర్యోదయంతోపాటు భారత విమానదళవిమానాలు, విజయవాడప్రాంతం నుండి ఎయిర్‌వైస్ మార్షల్ ముఖర్జీనాయకత్వాన, సంస్థానంలోని వరంగల్, బీదర్, ఔరంగాబాదు విమానాశ్రయాల మీదికి పోయి వాటి ఆనమాలయినా లేకుండా చేశాయి.

హైదరాబాదుకు అపారఆయుధబలం ఉన్నది. దుర్నిరీక్ష్యమైన షెర్మన్ టాంకు దళం ఉన్నది. ఎన్నో విమానాలున్నాయి. ఈమాదిరి ప్రచారం అంతకు ముందు చాలా జరగటంచేత, సిడ్నీ కాటన్ ఉదంతం మొదలైనవాటివల్ల చాటుగా ఆయుధాల దిగుమతి చాలా జరిగివుండవచ్చుననే ఉద్దేశంతోనూ మన సేనలకు ఎటువంటి ప్రతిఘటన వస్తుందో నని మనవాళ్ళూ టాంకులూ, విమానాలూ సిద్ధంచేసుకొన్నారు. బెదురుగా తప్ప వీటిని ఉపయోగింపవలసిన ఆవశ్యకత కలుగనేలేదు.

భారతసేనలు సంస్థానంలోకి తరలినవన్న వార్త 13-వ తేదీ ఉదయం 11 గంటలకు కాని లోకానికి తెలియనేలేదు. భారతప్రభుత్వం ఢిల్లీలో ఆ వార్తను వెల్లడిచేసింది. ఈవార్త హైదరాబాదులో, దీనికంతటికీ కారకులయిన వారికి పిడుగుపాటు అయినదనడం అతిశయోక్తి కాదు.

ఎందుచేతనంటే: ఆవార్తతోనే, అప్పటికప్పుడే భారతసేనలు నల్‌దుర్గ్, బొమ్మకల్, బల్హార్షాలను ఆక్రమించుకొన్నట్లు కూడా వారికి తెలిసి వుండాలి. దానితో వారు వెఱ్ఱెత్తినట్లు తమ సేనలనూ, రజాకార్లనూ చిత్తమొచ్చినట్లు అన్ని వైపులకూ ఉరికించారు. కాని, భారత సేనలు చర్యలు ప్రారంభించిన ప్రదేశాలలోగల రజాకార్లూ, నిజాంసేనలూ అప్పటికే మన సేనలదెబ్బ, రుచిచూసి, పలాయనం చిత్తగించడం ప్రారంభించారు. సికందరాబాదునుంచి బయలుదేరిన బలగాలకు, తమతోటి బలగాలే ఎటురై అందరూ కలసి పరారుకాజొచ్చారు. ఇంతకాలం ఈ దుండగీండ్ల దుర్నయాలవల్ల దుర్భరయాతనలు పడుతున్నప్రజానీకం తమ విమోచనదినం దగ్గరపడిం దన్న ఉత్సాహంతో, చేతి కందిన ఆయుధాలతోనే వీరిని ఎదిరించి, వీ లయినంతమందిని పట్టుకొని, మనసేనలకూ, పోలీసులకూ అప్పగించడం ప్రారంభించారు. దానితో అంతవరకూ ధీరాలాపాలు చేస్తున్నవారు బ్రతుకుజీవుడా అని ప్రాణాలు దక్కించుకోటానికి తంటాలుపడ మొదలుపెట్టారు.


భారతసేనలు విద్యుద్వేగంతో అన్నివైపుల నుంచీ సికందరాబాదువైపు పురోగమిస్తున్నవి. హైదరాబాదుదకు బలగాలకు కాలూదుకొని నిలిచే సావధానమన్నా లేకపోయింది. మొదటిరోజు చర్య ఈవిధంగా పూర్తి అయింది.

14-వ తేదీన మధిర, అలంపూరు, 15 న వనపర్తి, దౌలతాబాదు, సూర్యాపేట, ఖమ్మంమెట్టు, హూమ్నాబాదు, ఔరంగాబాదు, మన సేనల వశమైనాయి. హూమ్నాబాదు, ఔరంగాబాదుల పతనం చాలా ముఖ్యమైనది. హూమ్నాబాదు పతనంతో మన సేనలు సికందరాబాదుకు 10 మైళ్ళలోకి వచ్చాయి. అక్కణ్ణించి హుటాహుటిగా 10 మైళ్లు ముందుకు పోయి రాత్రికి జహీరాబాదు చేరాయి. ఔరంగాబాదు పతనం, ఆజిల్లాకలెక్టరు తెల్లజండా చూపి మన దళాధిపతికి 'దాసోహ' అన్నాడు.

15 న నిజాంనవాబుకు దిక్కు తెలియలేదు. పెట్టుకొన్న ఆశలన్నీ పటాపంచలయ్యాయి. ఏమీ తోచక జార్జిరాజుకు, ట్రూమన్‌కు విజ్ఞప్తులు పంపుకొన్నాడు. ఎవ్వరూ ఆలకించనైనా లేదు.

16-వ తేదీన వరంగల్, బీదర్, జాల్నా, సిర్పూరు, నాగేటుపల్లి, సదాశివపేట మన సేనల వశమైనాయి. ఈరోజున అటు షోలాపూరునుంచి సరాసరి సికందరాబాదు పోతున్న దళము, ఇటు విజయవాడనుంచి సూర్యాపేట సికందరాబాదు రస్తామీద సికందరాబాదు పోతున్న దళమూ నువ్వు ముందా నేను ముందా అన్నట్లు పురోగమనం సాగించాయి.

17-వ తేదీన హింగోలీ మన సేనల వశమయింది. మన ప్రధాన దళాలు రెండూ అత్రాఫ్‌బల్దా జిల్లా చేరాయి. అంటే హైదరాబాదు సికందరాబాదు నగరాల శివార్లకు చే[రాయ]న్నమాట. దక్షిణప్రాంత సర్వసేనా[ని] రాజేంద్రసింహాజీ నిజాము నుద్దేశించి '[...] లాభం లేదు, లొంగిపోయి, అనవసర ప్రా[ణ]నష్టం లేకుండా చేసుకోండి' అని హిత[ం] చెప్పారు.



వైమానికదళాలు నడిపిన ఎయిర్‌వైస్ మార్షల్ యస్. ముఖ[ర్జీ]

పాపం, నిజాము నవాబుకూ, ఆతని సల[హా]దారులకూ తల తిరగ జొచ్చింది. గత్యంతర[ం] లేదని గ్రహించి ఆ సాయంత్రమే, నిజా[ం] 'దాసోహం' అన్నాడు. తన సేనలను మనసే[న]లకు లొంగిపోమన్నాడు.

దేవతలు సంతసించారు గాబోలు దడదడ[ా] వాన కురవడం ప్రారంభించింది.

18 వ తేదీ సాయంత్రానికి తెరపిచ్చిం[ది.] భూమాత తృప్తిపడింది. నిజాంసేనాపతి మ[న] సేనాదళాధిపతికి శరణాగతి సమర్పించుకొనగ[ా] పూలజల్లువలె తుంపరలు పడుతూండగా భార[త] సేనలు సికందరాబాదులో ప్రవేశించిన వి[...] దాస్యవిముక్తినందిన ప్రజానీకం మనసేనల[పై] నిజంగా పూవులే చల్లింది.

హైదరాబాద్‌లో భారతసైన్యం జరిపిన పోలీసుచర్య

1948 సెప్టెంబరు 13-వ తేదీ ఉదయం 4 గంటలకు భారతసైన్యదళాలు హైదరాబాద్ సంస్థానంలోకి నాలుగుదిశలనుంచి ప్రవేశించాయి. ఈచర్యకు లెఫ్టినెంట్ జనరల్ మహారాజశ్రీ రాజేంద్రసింహాజీ ఆధిపత్యం వహించారు. సైనికదళాలకు తోడ్పడిన విమానదళాలకు వైస్‌మార్షల్ యస్ ముఖర్జీ ఆధిపత్యం వహించారు. షోలాపూర్ నుంచి మేజర్ జనరల్ చౌదరి ఆధిపత్యంకింద నడచినదళాలు 18-వతేదీని హైదరాబాదులో ప్రవేశించాయి.




భారతసైన్యాలు మార్గంపొడుగునా రజాకార్ల దుండగాలనుంచి పౌరులను కాపాడుకొంటూ వస్తున్నాయి. సైనికులనూ టాంకుదళాలనూ ప్రజలు ఆనందోత్సాహాలతో ఆహ్వానించారు. సైనికుల ప్రజల మధ్య ఇంతటి స్నేహాదరాలు అపూర్వమని సైన్యాధిపతు లన్నారు.




మేజర్ జనరల్ చౌదరి ఆధిపత్యంకింద సేనావాహిని షోలాపూర్, హైదరాబాద్ సరిహద్దుదాటి ప్రవేశించింది. గ్రామసీమల్ని కల్లోలపరిచిన రజాకార్ దుండగులకోసం సైనికులు కాపలాకాసి ప్రజలకు బాధానివృత్తి చేశారు.



18-వతేదీని హైదరాబాద్ నగరంలో ప్రవేశించిన సైనికులు అన్నివీధుల్లోనూ కాపలాఉండి ఏవిధమైన అరాచకమూ సంభవించకుండా కాపాడారు.




పోలీసుచర్య త్వరితంగా ముగించడానికి హైదరాబాద్ సంస్థానంలోని విమానాశ్రయాలను ముందు ఆక్రమించుకోడం సైన్యాలకు అవసరమయింది. ఔరంగాబాద్ విమానాశ్రయం ఆక్రమించుకున్న మేజర్ జనరల్ బ్రార్ ఆపైన అవలంబించవలసిన సైనికచర్యనుగురించి సమాలోచిస్తున్నారు.






భారత సైనికులు త్రోవపొడుగునా రజాకార్లను నిరాయుధులనుచేసి, బందీలు చేశారు. బెజవాడరంగం నుంచి బయలుదేరి వెళ్లిన సైనికదళాలు పట్టుకొన్న రజాకార్ల మతాలను పోలీసుకాపలాతో తీసుకొని పోతున్నారు.


★ హైదరాబాద్ సంస్థాన, రాజధానులలోని




హైదరాబాద్‌లోని మక్కా మసీదు




ఔరంగాబాద్ సుబాలోని "బీబీకా మఖ్‌బారా," పాదుషా ఔరంగజీబు భార్య మసీదు




నలదుర్గ్ కోట



గోల్కొండ కోట బురుజుపై ఫిరంగి




నిజాంసాగర్ డామ్




గోల్కొండ కోట


కొన్ని, పురాతన, నవీన, సుందర దృశ్యాలు ★




చార్ మినార్




మోఅజ్జం జాహిమార్కెటు-హైదరాబాద్




సిల్వర్ జూబిలీ టౌన్‌హాలు-హైదరాబాద్



జనరల్ ఆస్పత్రి-హైదరాబాద్




జేమ్సు స్ట్రీటు-సికింద్రాబాద్




సికింద్రాబాద్-రైల్వేస్టేషను

విముక్త హై


భారతప్రధాని, ఉపప్ర




1948 డిసెంబరు 24 వ తేదీని ప్రధానమంత్రి పండిట్ నెహ్రూ సోదరి విజయలక్ష్మితోసహా హైదరాబాద్ సందర్శించారు.



హకీంపేట విమానాశ్రయంవద్ద స్వాగతమిచ్చిన మిలిటరీ గవర్నర్ మే॥ జ॥ చౌదరి పండిట్ నెహ్రూకు ఉద్యోగులను పరిచయపరిచారు.




సంస్థాన కాంగ్రెస్ అధ్యక్షులు స్వామి రామానందతీర్థ, సర్దార్ కేశవగార్లతో పండిట్ నెహ్రూ.



ఉస్మానియా విశ్వవిద్యాలయ డాక్టరేట్ పట్టా స్వీకరించిన పండిట్ నెహ్రూ, విశ్వవిద్యాలయాధ్యక్షులు మే॥ జ॥ చౌదరి.

ఫతే మైదాన్ బహిరంగసభలో పండిట్ నెహ్రూ ఉపన్యసించారు. త్వరలో ప్రజాప్రాతినిధ్యప్రభుత్వం నెలకొల్పగలరని ప్రజలకు వాగ్దానం చేశారు.




సంస్థానకాంగ్రెస్




దరాబాద్:

ధానుల సందర్శనం



ర్చి 5 వ తేదీ సర్దార్ పటేల్ మద్రాసునుండి విమానంలో బయలుదేరి హైదరాబాద్ వెళ్లారు.




సర్దార్ పటేల్‌కు నైజాంనవాబు స్వాగతమిచ్చారు.



హకీంపేట విమానాశ్రయంవద్ద. పటేల్ ఆగమనానికి నిరీక్షించి నిలిచిన మిలిటరీ గవర్నరు పతి అరుణచౌదరి, నిజాంనవాబు.


కింగ్ కొఠీభవనంలో మేజ॥ జ॥ చౌదరి, సర్దార్ పటేల్, నైజాం నవాబు, పటేల్ కార్యదర్శి శంకర్ గార్లు.



లో వైరాలను సమయింప యత్నించు ఘనులైన సర్దార్ పటేల్, స్వామి రామానంద తీర్థగారితో.



పటేల్‌తో, స్వామిజీకి సంస్థాన కాంగ్రెస్ సేవికాదళం వారు గౌరవాభివాదమిచ్చారు.



హైదరాబాదు—తెలుగు

శ్రీ కాళోజీ నారాయణరావు

గడిచినవి దుర్దినాలు. గడుస్తున్న వేమో ఇప్పుడు చెప్ప వీల్లేదు. భవిష్యత్తులో సాహిత్యచరిత్ర కారు లీనాటి స్థితిగతుల్ని చర్చించక మానరు కదా.

పోతననాడు ఆంధ్ర దేశమంతా ఒకే రాజ్యంగా లేదు. అప్పటి ఆంధ్రదేశం అనేక రాజ్యాలు. ఒకప్పుడు ఆంధ్రప్రాంతం అంతా ఒకే ఛత్రచ్ఛాయక్రింద ఉన్నా, ఆనాటి ప్రజానీకం తమ మాతృభాషను ఎంతవరకు అభివృద్ధిచేసుకున్నారో తెలియదు. ఆనాటి ఆంధ్ర ప్రాంతాలకు పరస్పరసంబంధా లెట్టివో! నేడా ప్రాంతాల ఎల్లలు మారాయి. క్రొత్త ప్రాంతాలు ఏర్పడ్డాయి. పూర్వకవులు, పూర్వం ఏ ప్రాంతంవా రైనా, నేడుమాత్రం, వారిపై - ఏ ప్రాంతంలో ఉన్న సారస్వతసాధకునిపై .ఆ ప్రాంతంవారు - స్థానికసంబంధమైన ఒక హక్కును స్థాపించుకుంటున్నారు.

మాండలికపదాలు - ఉచ్చారణభేదాలు (యాసలు) ఆనాడూ ఉండిఉంటాయి. సహజం. అయితే పోతన్న, గౌరన్న, అక్కన్న, మాదన్న ఎట్లాంటి భాష మాట్లాడిఉంటారు? ఎవ్వరూ వ్రాసి ఉంచలేదు. ఏమైనా, పోతన (నైజాం వాడు) తురకపదాల నుపయోగించి ఉండడు. ఆయనవియ్యంకుడు శ్రీనాథుడు (సర్కారు వాడు) ఇంగ్లీషుపదాలు ఉపయోగించిఉండడు. అయితే ఎవరి జిల్లాసంగీతం (యాస) వారు తమ తమ సంభాషణల్లో - ఎవరి సంగీతం వారికే తెలియకుండా - ప్రదర్శించిఉంటారు. మరి ఒకర్ని ఒకరు ఆక్షేపించుకున్నారేమో తెలియదు. శ్రీనాథుడు గడుసువాడుకాబట్టి పోతనను వెక్కిరించిఉంటాడు. అయినా అది బావమరుదుల సరసం. రాజకీయవిరసం కాదు.


మహమ్మదీయులు తెలంగాణాప్రాంతంపై ఎక్కువకాలం రాజ్యం చేశారు. పరిపాలనా భాష ఉర్దూ. ప్రతి రాజ్యంలో, ప్రభుత్వమే అన్నింటికంటె శక్తివంతమైన సంస్థ. ప్రభుత్వం తల్చుకుంది కాబట్టి, ఉర్దూవ్యాప్తి జరిగింది. తెలుగువ్యాప్తి తగ్గింది. ఉర్దూ వ్యాప్తి అయినా, కోస్తాజిల్లాల్లో ఇంగ్లీషు వ్యాప్తి అయినంత జోరుగా కాలేదు. కాబట్టి, ఉర్దూ కూడా చాలా తక్కువమందికే అబ్బింది. అయినా నేటికీ తెలుగుసారస్వతోపాసకుల సేకులు మిగిలారంటే, పోతనక్షేత్రంలో పెరుగుతున్న సారస్వతవృక్షం, ఉయ్యాలలో మోడైనా, మాడిపోలేదని విదితమవుతోంది.

కోస్తారాయలసీమజిల్లాల్లో ప్రతి వ్యక్తి ఆంధ్రుడే. కాని తెలంగాణంలో ఆంధ్రుడంటే రాజకీయాల్లో పాల్గొనే తెలుగువాడు అని ప్రభుత్వం భావించింది. తెలుగు చదువుకున్న వాడు ఆంధ్రుడైపోతాడనే భయంతో, ప్రభుత్వం అట్టి ప్రమాదానికి గల అవకాశాల్ని వీలైనంతవరకు తొలగించింది. పల్లెల్లో రాజభాషా జ్ఞానం లేనివారు తెలుగు మాట్లాడుతారు. నీరు తాగే పాత్రను 'గ్లాసు' అనిమే మనం - 'జాంబు' అంటాం. కాని ఆంగ్లమానసపుత్రులకు గ్లాసే బాగుంటుంది. రెవెన్యూఇన్‌స్పెక్టరును గిర్దావరంటాం. రెండు పేర్లూ తెలుగువి కావు! అయినా ఉస్మానియామానసపుత్రులకు గిర్దావరే. మంచివాడు! ఇవన్నీ ప్రస్తుతం మాండలిక భేదాలే అయినా - ప్రభుత్వాలు తెచ్చిపెట్టిన భేదాలు. ఆ ప్రభుత్వాలు మనకు వద్దు అని మనం అంతా వాంఛించాం.

భారతదేశానికి ఒకే స్వాతంత్ర్యదినం. తెలంగాణానికి రెండు. తెలంగాణావారు అనుభూతిలోభులు కారు. ఒకచోట ఒక్క తెలుగు పాఠశాల పెట్టటానికి భగీరథప్రయత్నం చేయాల్సివచ్చేది. తీరా స్కూలును స్థాపించినాక అదొక చిన్న పుణ్యక్షేత్రంఅంత ముఖ్యస్థానం మాభావాల్లో మెసల్తూ ఉంటుంది. ...సూరవమో - మహాగడ్డుదినాల్లోనే స్థాపించి- తెలుగుభాషకు ...లు. ఆంధ్రమహాసభ అని ప్రారంభించి ఉర్దూప్రభావాన్ని కొంతవరకు అరికట్టారు. చేతనైనంతలో సాహసించి అక్కడా అక్కడా తెలుగుపాఠశాలల్ని స్థాపించారు. వారీ పనన్నీ చేయకుంటే, తెలుగు సాంతం చచ్చిపోయేదే నని అనను. కాని మరీ చెడిపోయేది.

ఈ సంవత్సరప్రారంభంలో, తూప్రాన్ గ్రామంలో ఆంధ్రసారస్వతపరిషత్తు, మహాసభ జరిపింది - నిర్భయంగా జరిపింది. కళాప్రియులు, సారస్వతప్రియులు ఒకచోట చేరి, సంభాషించుకొని, భాషోద్ధరణకు కంకణం కట్టుకున్నారు. మహాసభ మొత్తంమీద అధ్యక్షులు శ్రీఇల్లెందుల రామచంద్రరావు చేసిన ఒక సూచన చాలా ముఖ్యమయినది. యావదాంధ్రములోని వివిధమండలములందు వాడుకలో నున్న శబ్దజాలమును సంపాదించి ఒక సమగ్రశబ్దకోశమును సిద్ధపరచుట అవసరము. సారస్వతపరిషత్తువారు, ముందుగా, యావదాంధ్రంనుంచి సాహితీపరులను ఒకసారి ఆహ్వానించి ఈ పని త్వరలో అయ్యేటట్లు చూడగలరా?

పరిషత్తువారు తెలుగులో పరీక్షలు పెట్టారు. దాదాపు 2500మంది పరీక్షల్లో పాల్గొన్నారు. ఇల్లాంటి పరీక్షల్ని, ఉర్దూలో, ప్రభుత్వమే



న్యూఢిల్లీ నెహ్రూపార్కులో "వందనసమర్పణదినోత్సవ" సందర్భంలో స్వామీ రామానందతీర్థ ఉపన్యసిస్తున్న దృశ్యము.

నడుపుతోంది - తెలుగులో అట్టి ప్రయత్నం లేదు. ప్రస్తుతం, ప్రభుత్వం తెలుగులోకూడా పరీక్షలు పెట్టాలని నిశ్చయించింది. ఇతరప్రాంతాల్లోని విశ్వవిద్యాలయాలు, ప్రభుత్వాలు స్థానికభాషల్లో పరీక్షలు జరుపుతున్నారు.

అసలిక్కడ విశ్వవిద్యాలయంలో తెలుగు దాదాపు లేదనవచ్చు. సారస్వతపరిషత్తువారు, విద్యాశాఖవారిని అనేకపర్యాయాలు దర్శించి విశ్వవిద్యాలయంలో ప్రాంతీయ భాషలకు సముచితస్థానాన్ని కల్గింపమని కోరారు. ప్రాంతీయభాషలకు - ఉస్మానియా విశ్వవిద్యాలయంలో గల స్థానాన్ని వ్యక్తపరచటానికి స్థానికోదాహరణ ఒకటి ఉంది. నైజాంకాలేజీ, చాలా సంవత్సరాలు మద్రాసు విశ్వవిద్యాలయంక్రింద ఉంది. ప్రతి క్లాసులోనూ ఇరవై లేక ముప్పదిమంది తెలుగు చదువుకునేవారు - ఇంకా అనేకులు మరాటీకన్నడాలు చదివే విద్యార్థులు, ప్రతిసంవత్సరం ఉండేవారు. కాని, నైజాంకాలేజీని ఈ మధ్య ఉస్మానియావిశ్వవిద్యాలయంకిందకు లాగారు. ఆనాటినుంచి, ప్రాంతీయభాషల అధ్యాపకులకు - ఉస్మానియా సాంప్రదాయానుగుణ్యంగా - పిల్లలు లేని సంసారాలను పోలిన క్లాసులు ప్రాప్తించాయి. ఇంక, 'సైకతంబుగ సైకతస్థలిన్' అన్నట్లు ఈ అధ్యాపకులు క్లాసుల్లో కుర్చీల నధిష్ఠించే కాలంకూడా వచ్చేసింది. అదీ మిగతా విశ్వవిద్యాలయాలకు, ఉస్మానియావిద్యాపీఠానికి భేదం!

కానీ - గుడ్డిలో మెల్ల. సాహిత్యపరిషత్తు వారి రాయబారఫలితంగా, విశ్వవిద్యాలయం వారు ప్రాంతీయభాషలకు, బోధనా కార్యక్రమాల్లో లాంఛనప్రవేశాన్ని కల్గించారు. ఈ సంవత్సరంనుంచి ప్రాంతీయభాషల్లో 'కూడా' ఒక పరీక్షాపత్రం ఉంటుంది. అల్ప సంతోషిత్వం ప్రస్తుతంలో ధీరలక్షణంకదా - ఈ పాక్షికమన్ననకు, ప్రభుత్వానికి మా కృతజ్ఞత.

సోదరులు అనేకులు యథాశక్తిని సారస్వతోపాసన చేస్తున్నారు - సారస్వతసేవకులకు చేతనైన ప్రోత్సాహం ఇస్తున్నారు. ప్రజాసామాన్యానికి, ఇతోధికంగా - విజ్ఞానవికసిత సంఘానికి సాధ్యమైనంతగా - సాహిత్యాభిరుచి కలగటానికి, అనుకూలమైన వాతావరణం ఏర్పడేదాకా, సాహిత్యోపాసకులు కృషి చేస్తూనే ఉండాలి.

ఆంధ్రసాహిత్యపరిషత్తువారు శ్రీ సురవరం ప్రతాపరెడ్డి రచించిన "ఆంధ్రుల సాంఘిక చరిత్ర" అనే పరిశోధన గ్రంథాన్ని ప్రచురిస్తున్నారు. మాండలికశబ్దకోశాన్ని తయారు చేయటానికి కొక ఉపసంఘాన్ని నియమించారు. శ్రీ మాడపాటి హనుమంతరావు, తమ షష్టిపూర్తినాడు ప్రజానీకం సమర్పించిన నిధితో, భాషాసేవకు పూనుకున్నారు. వారియెడ ఈ క్రింది గీతాసూక్తి సంపూర్ణంగా వర్తిస్తుంది.

"యద్యదాచరతి శ్రేష్ఠః
తత్తదేవేతరో జనః
స యత్ ప్రమాణం కురుతే
లోకస్తదనువర్తతే."

వారు పెట్టిన ఒరవడి, ఎల్లరకు అనుసరణీయం. శ్రీ లక్ష్మణరాయపరిశోధనమండలివారు అనేక శాసనాల్ని సేకరించారు. కాని వారి పరిశోధన ఇంకా తెరమరుగునే ఉంది. వివేకవర్ధని పునాదుల్లో ఆంధ్రుల సొమ్ము ఉన్నా, నేడా సంస్థ కేవలము మహారాష్ట్రులదే. ఏమైనా, మహారాష్ట్ర సోదరుల ఈ కృషి, మనవారి కళ్లు తెరవాలి.

మనం మేల్కొని ఒక కాలేజీని స్థాపించుకోవాలి. సేవానురక్తితో స్థాపిస్తే, ఈ మహపవిత్రసేవకు పూనుకునే విద్యావంతులు అనేకులు మనకు తోడ్పడతారు. నారాయణగూడ ఆంధ్రబాలికాపాఠశాలను కళాశాల చేయటానికి పెద్దలు పూనుకున్నారని - ప్రయత్నాలు ఫలోన్ముఖమైనాయని తెలుస్తోంది. ఇది సంతోషింపదగిన సంగతి. సాహిత్యపరిషత్తువారు - విద్యావ్యాప్తినీ, తెలుగు భాషోద్ధరణనూ, ఒక ధర్మోద్యమంగా పాటించి, ప్రతిఊరా పాఠశాలను నెలకొల్పటానికి పూనుకోవాలని నా విజ్ఞప్తి.

హైదరాబాదురేడియో, కొనరాకుండా పరివర్తనం చెందుతోంది. తెలుగుకార్యక్రమాలు రోజురోజుకు మెరుగెక్కుతున్నాయి. తెలుగుశాఖవారు, అవకాశాల్ని ఇంకా బాగా వినియోగించుకొని, భాషాసేవ చేస్తూ ఉంటారనటంలో సందేహం లేదు.

పేరుపేరునా సారస్వతసేవకులను పేర్కొనటం అనవసరం. శ్రీ వానమామలై వరదాచార్యులు, శ్రీ దాశరథి, శ్రీ వెంకటరమణాచార్యులు, శ్రీ గడియారం రామకృష్ణశర్మ, శ్రీ కొమర్రాజు భూపాలరావు, శ్రీ రామానుజరావు, శ్రీ పలిజాల హనుమంతరావు, శ్రీ భాస్కరభట్ల కృష్ణారావు, శ్రీ పెద్దుర్తి మాణిక్యరావు, శ్రీ భాగి నారాయణమూర్తి, శ్రీ ధవళా శ్రీనివాసరావు, శ్రీ మాట్లపల్లి రామారావు, శ్రీ రాఘవరెడ్డి, శ్రీ దుర్గేశ్వరశర్మ, శ్రీమతి నందగిరి ఇందిరాదేవి, శ్రీమతి సరస్వతీదేవి, శ్రీమతి రత్నాకరాంబ - ఇంకా అనేకులు మిత్రులు సాహితీరంగంలో శ్రద్ధగా పని చేస్తున్నారు - అనేకులు ప్రయత్నిస్తున్నారు. వారందరికీ నా శుభాకాంక్షలు.

వారికి నాదో మనవి - మన హృదయాలు సముద్రమంతంతవి. అందులో రేగే బడబానలానికి ఆకాశాన్ని మూతపెడ్తే ఖగోళం కరిగిపడుతుంది. రేన్నో కప్పిపుచ్చుతున్నట్లు, ఏదో మీద దూకుతున్న ప్రమాదాన్ని దూరం చేసుకోలేక దూరంగా పారిపోతున్నట్లు ఉంది మన స్థితి. ఒకర్ని ఒకరు అర్థంచేసుకోటానికి వాఙ్మయం ఏర్పడింది - అదేమోగాని అదే పరస్పర అపార్థాలకు దారితీస్తోంది. దినదినాభివృద్ధి చెందుతున్న ఈ అపార్థప్రమాదాన్ని తొలగించటానికి ఒకే క్రమపద్ధతి. అక్షరాస్యత-విద్య-విజ్ఞానం. ఈ మూడే మన నిర్మాణకార్యక్రమాంశాలు. సాధించిన సత్ఫలితాల పరిమాణం సాధించాల్సిన గురుతరాదర్శాలకు పోల్చి చూస్తే చాలా స్వల్పం. ఈ కఠినసత్యం ఇతోధికకృషికి ప్రేరణశక్తి అగుగాక.

— —





ఫణిగిరలో దొరికిన విగ్రహ శకలం

ఫణిగిరి-
బౌద్ధఆరామ శిథిలాలు

ఖ్వాజామహమ్మద్ అహమ్మద్ యం. ఎ. యల్. యల్. బి.
(హైదరాబాద్ ప్రభుత్వ ఆర్కియాలజీ శాఖ డైరెక్టరు)

[హైదరాబాద్ సంస్థానం పూర్వ ఆంధ్రసామ్రాజ్య శిథిలాలకు పట్టుకొమ్మ. పూర్వ ఆంధ్రసాహిత్య, శిల్ప, లలితకళాది సంపదలు అస్థిస్వరూపంలో, ఈ దేశపుగడ్డను శిథిలాలలో దొరుకుతాయి. ఫణిగిరి అట్టి పూర్వ శిథిలాలలో ప్రసిద్ధమయినది. అహమ్మద్‌గారు, ఇచటి పూర్వ సంస్కృతులను తవ్వి వెలిదీయటంలో చాలానాళ్లుగా కృషిచేయుచు పూర్వ ఆంధ్ర చరిత్రమున కెంతో పుష్టిని చేకూరుస్తున్నారు. ఫణిగిరి శిథిలాలలో దొరకిన వస్తువుల ప్రాచీనతను ప్రశస్తిని సచిత్రంగా ఈ వ్యాసంలో వెల్లడిస్తున్నాము. సం.]

నల్లొండజిల్లాలో, గత పదిఏండ్లలో నే నొనర్చిన, పురావస్తు పరిశోధనల్కు ఆలవాలమైన పురాతన క్షేత్రాలలో ఫణిగిరిశిథిలారామము, బహు ముఖ్యమైనది. ఈ విహారము ఒక చక్కని కొండ గుట్టమీద నిర్మితమయి ఉన్నది. ఈగుట్టలో క్రీ. పూ. 1 శతాబ్దమునుండి శతాబ్దులతరబడి కాల గర్భమున లీనమైపోయిన భారత సంస్కృతి, పురావస్తురూపమున అంతర్గర్భితమై శిథిలస్థితిలో నిలచి ఉన్నది. పరిశోధకులకు ప్రాచీనభారత సంస్కృతిని బాహిరపరచుటకు అనంతమైన సంపద ఈ ఆరామశిథిలాలలో లభించగలదు.

ఫణిగిరికి పోవలెనన్న 'జనగాం' రైల్వే స్టేషనులో దిగి సూర్యాపేట రోడ్డుమీదుగా 80 మైళ్లు పోవలెను. శాస్త్రీయ పరిశోధనలవలన ఫణిగిరి శిథిలాలు, బౌద్ధయుగమునాటివని బయల్పడినది.

ఇక్కడ దాదాపు ముప్పదిస్తూపముల శిథిలములు బయలుపడినవి. ఇవన్నీ గుండ్రని కట్టడములు. ఎక్కువగా రాతితో కట్టినవే. అడుగున ఎత్తుగా రాతితో నలుచదరపు పీఠము కట్టినట్లుండి పైన స్తూపములు కట్టబడియున్నవి. ఈ చదరపు ఫలకములపై మరేమైన కట్టడముకూడ యుండెడిదో లేదో, ఇదంతెయు ఎప్పుడైన గిలాబా చేయబడియుండెడిదో లేదో ఊహించుట కష్టము. ఈ స్తూపములలో చాలాభాగము, ముఖ్య ఆరామమునకు పశ్చిమభాగముననే కొండవాలున, వివిధ అంతస్తులుగా నిర్మింపబడియున్నవి.

ఆరామమధ్యమున, నలుచదరపు వ్యూహముగా, ఇటుకకట్టడముల నాపుదులున్నవి. ఈ పునాదులలో కూడ గదులు గదులుగా కట్టబడ్డ నిర్మాణముల శిథిలములే ఎక్కువ బయలుపడుచున్నవి. ఈ గదులు విడివిడి బౌద్ధసన్యాసుల నివాసగృహములో (*Cells*) లేక మరే ఇతర ప్రయోజనార్థమై కట్టబడినవో సరిగా ఊహించుట కష్టము.

ఈచైత్యము కొండపైన కట్టబడినదగుటచేత కాబోలు, కట్టడాలు వానకు వరదకు కొట్టుకొనిపోకుండను, నీరు ఇనికి కూలిపోకుండను, నిర్మాతలు చాలా జాగ్రత్తవహించినట్లు కనబడుచున్నది. దాక్షిణాత్యశిల్పములో తదితరస్థానములందు కనరాని, పెట్టెకట్టుడువిధానములో (*Boxed buttresses*) మందిరము గోడలకు ఈ రక్షణను అవలంబించారు.

ఈ శిథిలాలలో దొరికిన వాసపు పెంకులవంటివి, పూర్వఆంధ్రశిథిలాలలో మాత్రమే లభించినవాటివంటివగుటచేత, ఈచైత్యములోని ఇంట్ల కప్పులకుకూడ కొన్నిటికి పెంకులే వాడి ఉండిరేమో అని ఊహించవచ్చును. దీనినిబట్టి ఈ చైత్యగృహముల ఉపరిభాగములు గట్టి వస్తువులతో కాక, త్వరితముగా శిథిలమైపోవు వస్తువులతోనే నిర్మించినట్లు భావించ నాస్పదము కలుగుచున్నది. కట్టడములకు వాడిన ఇటుకలు రెండడుగులు పొడవు అడుగు వెడల్పు, $3\frac{1}{2}$ అంగుళములు మందమూ కలిగి ఉన్నవి. ఫణిగిరి కట్టడముల లో వాడిన ఇటుకల నిర్మాణము, కొండాపురం కట్టడములలోని ఇటుకల నిర్మాణవిధానములోనే జరిగినది. మట్టితో ఎండుగడ్డి, ఊక మొదలైనవి కలిపియే ఈఇటుకలుతయారు చేసినట్లున్నది. ఈ ఇటుకలలో, గడ్డి, ఊక మొదలైనవి కాలినప్పటి గతుకులు చెక్కు చెదరకుండ అట్లే కన్పించుచున్నవి.

ఇక్కడ దొరకినవానిలో తెల్ల సున్నపురాతి చెక్కడములు కొన్ని బహు అందమైనవిదొరికినవి. బౌద్ధుల మత విగ్రహములు తదితర లాంఛన శిల్పములు గల చెక్కడములు, తరువాత కాలములలో ఈ ఆరామములను నాశనమొనర్చినప్పుడు, ముక్కలు ముక్కలుగా విరగగొట్టబడి, చిందరవందర చేయబడినవి.

ఫణిగిరిలో దొరకినని శిల్పసముదాయము బహు స్వల్పము. కాని వానిలో శిల్పకళ అత్యున్నత శిల్పసాంప్రదాయములను వెలువర్చు చున్నది. శిల్పములలో, జీవశక్తి భావుకత్వము, రూపసౌందర్యము, విస్తృతముగ కొట్టవచ్చినటు కనిపించును.

ఈ దొరికిన విగ్రహములలో, ఒక విగ్రహ ఊర్ధ్వభాగము మాత్రము దొరకినది. ఆ విగ్రహములోని కండరముల సొంపు, మొగమున భావశబలత, బహురమణీయముగ భావస్ఫోరకముగనుండి, చిత్తవృత్తుల నద్దములో ప్రతిబింబించినట్లు మొగమురేఖలలో బింబించుచున్నవి. చెవుల వ్రేలాడుచున్న తాటంకముల బరువుతో చెవి సాగిపోయినట్లు, తాటంకముల బరువును తెలుపుతూ శిల్పి యథార్థముగ శిల్పమును నిర్మించినాడు. తలపై విజయలాంఛనముగ చుట్టబడిన ఆకుకొమ్మ, విగ్రహమునకు గ్రీకుస్వరూపమును కల్పించి, ఆనాటి శిల్పముపై గ్రీకుశిల్ప ప్రభావ మెంత గలదో చాటుచున్నది. దక్షిణ భారతభూమిలోనికి ఈ గ్రీకుశిల్పప్రభావము అటు ఉత్తరమునుండియూ, ఇటు తూర్పు పడమర సముద్రతీరములనుండియూకూడచొచ్చుకొని ప్రవేశించినది.

ఇచ్చట దొరకినవస్తువులలో మరొకటి కుడ్య భాగమైన నిడుపాటి పలకల దిమ్మ. దీనిలో దొరకిన భాగము చిన్నదే యైనను, ఈ ముక్క మీదనే, మూడుప్రక్కలు శిల్పములు చెక్కబడియున్నవి. ముఖభాగమున, సంపూర్ణముగా రేకులు విచ్చిన పద్మము అందముగా చెక్కబడియున్నది. ఈ పత్రముల రచన బహు ఆకర్షణీయముగ నున్నది. ఈ పద్మమునకు దిగువ, ఒక వృషభము, మానవుడు, గజము, విగ్రహములు చెక్కబడియున్నవి. ఈ వృషభరూపము, మూపురము ఎత్తుగా ఉండుట, సుమేరియన్, మొహెంజోదారో శిల్పాలలోని వృషభాలను జ్ఞప్తికి తెచ్చుచున్నవి. అజంతా శిల్పములలో వృషభసమరముల చిత్రములకూడ జ్ఞప్తికి తెచ్చుచున్నదిగాని, ఇచట వృషభస్వభావము సమముఖముగా లేదు. ఈవృషభమును ఏను[illegible] తరుముచున్నది. ఏనుగుకాయము మహాస్థూలముగనూ, ఏనుగుదంతములు దీర్ఘములుగాను రచించబడినవి. ఈ తరుముకొనివచ్చుచున్న ఏనుగును, అల్పకాయుడైనను, మహాధైర్యముతో ఎదుర్చుచు వృషభమునకు గజమునకు మధ్య నరు[illegible] నిలచియున్నాడు, మానవుని రూపములో విజ[illegible] మందుకొను చిహ్నలే గాన్పించుచున్నవి.

పలక ఎడమవైపుముఖమున, మరల పద్మ[illegible] పత్రఖండమే లిఖించబడియున్నది. దానికి ది[illegible]


(24 వ-పేజీ చూడుడు)



కుడ్య శిల్పము





కుబేరుడు



నైజాం పరాజయం అంగీకరించిన పిదప భారత సైన్యాలు హైదరాబాద్ నగరంలో ప్రవేశించే ముందు, సికింద్రాబాదు రోడ్డున 5 వ మైలు రాయి వద్ద హైదరాబాదు సేనాధిపతి మేజర్ జనరల్ ఎల్ ఎడ్రూస్, మేజర్ జనరల్ చౌదరిని దర్శించి అధికార రీత్యా లొంగుబాటును ధృవపరచారు.

మేజర్ జనరల్ చౌదరికి నిజాం నవాబు పరిపాలనాధికారాన్ని స్వాధీన పరిచారు. ఈ సందర్భంలోనే హైదరాబాద్‌లో రాద్ధాంతానికి తమ బాధ్యత లేదని నిజాం నవాబు ప్రకటన చేశారు.






చురుగ్గా హైదరాబాద్ నగర పరిసరాల్ని చేరగలిగిన మేజర్ జనరల్ చౌదరి సైన్యదళాలను లెఫ్టినెంట్ జనరల్ రాజేంద్రసింహజీ అభినందించారు. అభినందనకోసం ప్రత్యేకం బీదర్ విమానాశ్రయానికి వెళ్లారు.

విజయం

1948 సెప్టెంబర్ 18 వ తేదీని రాజేంద్ర సింహజీ హెచ్చరికచేసిన అనంతరం నిజాం నవాబు పరాజయాన్ని అంగీకరించారు. సాయంకాలం హైదరాబాద్‌నగరంలో విజయోత్సాహంతో మేజర్ జనరల్ చౌదరి తమ సేనాదళాలతో ప్రవేశించారు. పోలీసుచర్య మొత్తం 108 గంటల్లో ముగిసింది.



హైదరాబాద్ పరిస్థితి ప్రమాదకరంగా పరిణమించినప్పటికీ, అనారోగ్యాన్ని కూడా లక్ష్యపెట్టక తమ తావును వీడని భారతప్రభుత్వ ఏజంట్ జనరల్ కె. యం. మున్షీ గారితో, శాంతిస్థాపనసమయమున శ్రీ రామానందతీర్థ, మేజర్ జనరల్ చౌదరి, తదితర మిలిటరీసివిల్ ఉద్యోగులు.



హరిజనపురోహిత సంఘాధ్యక్షులు:

యం. రామానుజాచార్యులు
చంచలగూడ దేవస్థానము హై॥ ద॥


వీరు హరిజనుల వేలాది గృహములలో వివాహములు, శ్రీ పత్యవ్రతములు, యజ్ఞములు, శుభాశుభ కార్యములు 20 సం॥ నుండి సేవచేసి సత్ప్రవర్తన కలుగజేసినారు. మరియు, శ్రీరామానుజ ప్రెస్, అఫ్జల్‌గంజ్ రోడ్ హై॥ ద॥ తెరచి జాతిక్షేమము కొరకు ఎంతో కృషిచేసినారు.

యం. ఆర్. నారాయణస్వామి.

హైదరాబాద్ సంస్థాన కాంగ్రెస్ కార్యవర్గం

'ఆంధ్రపత్రిక' హైదరాబాద్ విమోచనోత్సవ సంచికకు

స్వామి రామానందతీర్థ సందేశం




సెప్టెంబరు 18వ తేదీ హైదరాబాదు ప్రజలకు చరిత్రాత్మకమైన ఘట్టము. అజేయమైన భారత సైన్యాల ధాటికీ, హైదరాబాద్ ప్రజల వీరోచితసంగ్రామానికీ నిలువలేక ప్రబల నిరంకుశ రాజరికం కూలిపోయింది. భారత దేశ స్వాతంత్ర్య సంగ్రామంలో తుదిరంగంలో సంపూర్ణవిజయం లభించింది. భారతదేశంలో ప్రజాపరిపాలనాసుస్థిరస్థాపనకు కడపటి నిరోధం తొలగిపోయింది. భారతదేశైక్యత సాధింపబడింది. ఇంక అది ఎన్నడూ చెక్కు చెదరదు. హైదరాబాద్ తన భవితవ్యాన్ని భారతదేశంతో పెనవేసింది. రాజ్యాంగన్యాయరీత్యా ఉభయుల వ్యవహారబాంధవ్యాలు ఇంకా నిర్ణయం కాలేదు. యావద్దేశహితాన్ని దృష్టిలో పెట్టుకుని హైదరాబాద్ ప్రజలు సక్రమమైన నిర్ణయానికి రాగలరని నా దృఢవిశ్వాసం.

• ఈ పవిత్రక్షణంలో హైదరాబాద్ ప్రజల తరఫున, వారిదాస్యవిమోచనకై అన్నివిధాలా తోడ్పడినవారందరికీ వారి కృతజ్ఞతను ప్రకటిస్తున్నాను. స్వాతంత్ర్యసిద్ధికోసం పోరాడి ప్రాణా లర్పించినవారందరికీ నా వినయపూర్వక ప్రణామాలు. వారి త్యాగాలకు మన మందరం అర్హుల మనిపించుకోడానికి అందరం కృషి చెయ్యాలి.

ఈ స్వాతంత్ర్యం ప్రజానీకానికి సుప్రసన్నం కావడానికి అందరం పాటుపడదాం. కష్టాలలోనూ సుఖాలలోనూ మనకోసం పాటుపడిన "ఆంధ్రపత్రిక"కు నేనెంతో ఋణపడి ఉన్నాను.

స్వామి రామానందతీర్థ,




జనార్దనరావు దేశాయి.




సర్దార్ జమలాపురం కేశవరావు.




డి. జి. బిన్దు



బూర్గుల రామకృష్ణారావు.



మర్రి చెన్నారెడ్డి



కొండా వెంకటరంగారెడ్డి




మానెక్‌చంద్ పహాడే



జి. డి. ష్రాఫ్.




పల్లెర్ల హనుమంతరావు



బి. సత్యనారయణ



డాక్టరు॥ జి. యస్. మాల్‌ఖోట్



యస్. కె. వైశంపాయన



ప్రాణేశాచారి



జనార్దనరావు చందార్కి

నిజాంనవాబు కుటుంబం



మీర్ ఉస్మాన్ ఆలీఖాన్
నిజాం VII



మీర్ ఆజం జా బహద్దర్
యువరాజు



దురేషవార్ రాకుమారి
నిజాం పెద్దకోడలు



నీలోఫర్ రాకుమారి
నిజాం రెండవ కోడలు



మీర్ మొ అజ్జంజా బహద్దర్
నిజాం రెండవ కుమారుడు

హైదరాబాద్‌లో ప్రస్తుత పరిస్థితి

(5-పేజీ తరువాయి)

నూచి కాంగ్రెస్‌బురఖా తగిలించుకున్నారు. కాంగ్రెస్‌లో ఇట్టి వైరాలతో సుస్థిరమైన ప్రభుత్వం స్థాపించడం కష్టం. కాంగ్రెస్ ఏకసంస్థగా నిర్వహించగలగాలి.

సంస్థానకాంగ్రెస్‌కి మరొక చిక్కు వచ్చిపడుతోంది. జాగీర్లు సర్ఫ్ఖాస్‌ల రద్దు, భూమిశిస్తుసంస్కరణలు సంరక్షకప్రభుత్వంచేతనే అమలుజరపబడుతున్నాయి. ఇంక కాంగ్రెస్ ఈ నినాదాల్ని విడిచిపెట్టవలసి వస్తోంది. సంస్థానాన్ని విడగొట్టాలనే నినాదానికి దిగింది.

గత రెండుసంవత్సరాల కల్లోలంవల్లనూ సంస్థానంలో ఆర్థికవ్యవస్థ భగ్నమయింది. ఆస్తిధ్వంసం అపారం. జాగీర్దారీల రద్దు మొదలైన కొన్ని ప్రజాహితసంస్కరణలే. వెంటనే అవసరమైనవే. కాని నిరుద్యోగం దినదినాభివృద్ధిచెందుతోంది. ముఖ్యంగా మధ్యతరగతిలో పేదవర్గం పడుతున్న బాధలు అత్యధికంగా ఉన్నాయి. ఇదంతా కమ్యూనిస్టుపార్టీ బలపడానికి దారితియ్యవచ్చును. కాని నేరాలు వృద్ధికావడం సంభవం. వ్యాపారం మందగించింది. ఆహారం కొరవౌతోంది. వెంటనే పరిష్కరించవలసిన సమస్యలనేకం వచ్చిపడ్డాయి.

హైదరాబాద్‌కు భవిష్యత్తు ఉజ్వలంగా ఉందని చెప్పవచ్చును. ప్రజల చిరకాలవాంఛితమైన ప్రజాప్రాతినిధ్యపరిపాలన త్వరలో ఏర్పడవచ్చును. తుంగభద్ర మొదలైన కార్యక్రమాలతో ఆర్థికస్థితి చక్కబడగలదు. వ్యాపారం వృద్ధిచెందగలదు. గ్రామసీమలు తిరిగి కళకళలాడగలవు. కాని అదంతా భవిష్యత్తు. కాని ఈలోగా ప్రజలకు వాంఛ తీరలేదని అసంతృప్తి కలుగుతోంది. వారి ఎన్నికతో నిమిత్తంలేని ప్రభుత్వం నిర్వహిస్తోంది. భారతరాజ్యాంగపరిషత్సభలో కూడా వారికి స్థానం లేదు. ఇంక జాప్యం జరగడం భావ్యం కాదు. ప్రస్తుత పరిపాలన మరికొంతకాలం కొనసాగాలని వాదించడానికి ఆధారమున్నప్పటికీ ప్రజల ఆశయ వాంఛల్ని తీర్చకుండా జాప్యం చెయ్యరాదు. ఈ పరిస్థితి త్వరలో మారిపోగలదనీ, హైదరాబాద్ పరిపాలనలోనూ, భారతదేశభవిష్యన్నిర్మాణంలోనూ హైదరాబాదువాసుల వాంఛలు మన్నింపబడక తప్పదనీ అందరికీ తెలిసినదే.

భగవత్స్వరూపులైన శ్రీశ్రీశ్రీశ్రీశ్రీ

శ్రీ బాబా ఖాదర్‌షా ఖాదర్ అవులియా; బాబా ఫరీద్ మస్తాన్ అవులియా వారల

దివ్య లీలలు

సాధుపుంగవులయూ ఋషిసత్తములయూ కాలం ఇంకా అంతరించలేదనిపిస్తుంది— శ్రీ బాబా ఖాదర్ అవులియావారి నెవరైనా దర్శించినట్లయితే. శ్రీకృష్ణభగవానుడు గీతలో చెప్పినట్లు, భగవంతుడు యుగయుగమునా వివిధ నామరూపాలతో భూతలమున అవతరిస్తూ వుంటాడు. అతిమానుషమైన శక్తినీ ప్రేమనూ ప్రకటించే ప్రతివ్యక్తిద్వారా సహజంగా భగవన్మహిమయే వెల్లడిఅవుతూ వుంటుంది.

ఈ శ్రీ ఖాదరుబాబా పుట్టినది తిరుచునాపల్లి లోని సుప్రసిద్ధమైన నవాబుల వంశమున. వీరి పూర్వీకు లెల్లరూ మంచి భక్తిపరులు, సత్వగుణ సంపన్నులు. వికారినామ సంవత్సర చైత్రశుద్ధ చతుర్థినాడు విజయనగరంలో జన్మించారు శ్రీ ఖాదరుబాబా. చదువు తనకు ఎంత అవలీలగా అబ్బుతున్నప్పటికీ, బడిలో చెప్పే ఆ చదువు వల్ల ఆయన కొంతమాత్రమూ తృప్తి కలుగలేదు. ఇవన్నీ భుక్తినిచ్చేవేకాని ముక్తినిచ్చేవి కావని ఆయనకు చక్కగా అవగతమైంది.

ఉపదేశం

ఒక పెద్ద తుపానుమధ్య చిక్కుకొన్నట్లుగా అల్లాడిపోయింది బాబా హృదయం. తల్లిని విడిచిన దూడలాగా అంగలారుస్తూ, తనకు సత్యపథం యెవరు చూపిస్తారా అని వెదుకసాగింది. కపటజ్ఞానులకు ఆయన సుస్థానం ఇవ్వలేకపోయారు. మరి సద్గురువు లభించడం ఎలా?– భవిష్యత్తు అంధకారబంధురంగా తోచింది. ఎవరూ ధైర్యం చెప్పేవారు లేకపోయారు.

ఈ సమయంలో, నాగపూరు వాస్తవ్యులైన శ్రీ తాజుద్దీన్‌గారి ప్రియశిష్యు లొకరు విజయనగరం రావడం సంభవించింది. ఆయన రాకను పురస్కరించుకొని, శ్రీ తాజుద్దీన్‌గారిపై భక్తి ఆ ప్రాంతంలో ఒక వెల్లువయై పొంగులాడింది. బాలుడైన ఖాదరు బాబాకు ఆందోళన యెక్కువై, తల్లిదండ్రులను వీడి శ్రీ తాజుద్దీను బాబాను ఆశ్రయించాలనే ఇచ్ఛకలిగింది. అనుమతింపవలసిందని తల్లిని ప్రాధేయపడి, ఆమె అనుమతినీ ఆశీస్సునూ పొంది, అచిరకాలంలో శ్రీ తాజుద్దీన్‌బాబా శిష్యగణంలో అగ్రగణ్యులయ్యారు. అతి అగాధమైన హృదయం వారిది.

శ్రీ బాబా తాజుద్దీన్ అవులియావార ఆశీస్సు ఫలితంగానే శ్రీ గాంధిమహాత్ముడు భారత స్వాతంత్ర్యం సాధింపగలిగినట్లు ప్రతీతి. వారటీవల నాగపూరువద్ద సమాధి అయినారు.

తపస్సు

కొంతకాలం గురుశుశ్రూష చేసిన తర్వాత, ఖాదర్ బాబా గుర్వనుజ్ఞ పొంది విజయనగరం తిరిగివచ్చారు. నల్లచెరువు దగ్గర వున్న కొండలలో స్థావరం కల్పించుకొని, తపస్సు ప్రారంభించారు. కుమిలీఘట్ట సామీప్యానగల ఆ అరణ్యప్రాంతమంతా అప్పుడు క్రూరమృగాలకు నిలయమై, నిర్జనసీమగా ఉండేది.

క్రమంగా కొంతకాలానికి, అనేక దీర్ఘవ్యాధులచే బాధపడుతూ, ఎక్కడకుబోయినా కుదరక ఆక్రోశిస్తున్న జనం, ఆరోగ్యంకోసం ఆయన నాశ్రయించడానికి రావడం మొదలుపెట్టింది. వారి జబ్బులనాయన తనమీదకి తీసుకొని, వారిని అనుగ్రహిస్తూ వుండేవారు. ఇలా శరీరబాధలేకాక, మానసికవ్యాధులు కలిగినవారు కూడా వారిని ఆశ్రయిస్తూ వారి దీవనవల్ల వాంఛాసిద్ధిని పొందుతూ వచ్చారు. 'అదివరకే జ్ఞానవంతులై సత్యశీలురైనవారికి జ్ఞానం బోధించడంలో ప్రత్యేకత ఏమీలేదు. అపవిత్రులైన పాపులయెడ కనికరించి, వారిని పవిత్రులుగా జేయడంలోనే ఘనతవుంది'—అని బాబా తరుచు అంటూ వుంటారు.

శక్తులు!

శ్రీబాబా వాక్శుద్ధి అత్యద్భుతం. ఆయననోట ఏది పలికితే అది అయితీరవలసినదే. అసాధ్యమును, సుసాధ్యం, సుసాధ్యమును అసాధ్యం చేయగల శక్తి ఆయనలో వుంది. శ్రీకృష్ణుడు, ఏసుక్రీస్తు మున్నగు మహనీయుల జీవితగాథలలో విననయ్యే వింతసంఘటనలలాంటి వెన్నో నేడు శ్రీ బాబా గారి సమక్షంలో ప్రత్యక్షమవుతూ వుంటాయి. ఆయనదర్శనంకోసం రోజూ, పంజాబు, పెషావరు, బొంబాయి, బెంగుళూరు, కలకత్తా, నాగపూరు తిరుచినాపల్లి మొదలైన దూరదేశాలనుంచి కూడ వందలకొలది జనం వస్తూ వుంటారు.

సర్వభూతదయ!

శ్రీ ఖాదర్ బాబా దయామయులు. ఆయనకెన్నడూ కోపంరాదు. కుల, మత విచక్షలు వారికి లేవు.

ఆయన ముస్లిం సాధువైనా, హిందువులు చాలామంది ఆయనకు శిష్యులుగా వున్నారు. విగ్రహారాధననూ గోపూజనూ ఆయన నిరసించరు. మతప్రభేదముల కాయన అతీతుడు. పిచ్చి వగైరా మెదడు జబ్బులు పోగొట్టడంలో ఆయన శక్తి అత్యద్భుతం. ఆయన దృష్టి ప్రసారమే చాలు మతిచాంచల్యం పోగొట్టడానికి. "ఖాదరు చెప్పినదెల్లా భగవంతుడు చేస్తాడు - భగవంతునియందు విశ్వాసముంచండి, ఆయనకు అసాధ్యమనేది లేదు" - అంటూ వుంటారాయన.

ఆయన ఉపదేశ పద్ధతి కూడ అతివిచిత్రం - ఆయన ఏ మంత్రాలూ చెప్పరు ఏ యోగాలూ బోధించరు. హృదయాలను పరిశుద్ధపరచడమే ఆయన చేసేది - క్రూరస్వభావులు ఆయన సముఖంలో తమ క్రూరత్వాన్ని మరచిపోతారు - ఐహికచింతాపరులను వారి సాంగత్యం పునీతులను జేస్తుంది - శిష్యుల యోగ్యతలనుబట్టి ఆయన వారికి ఆధ్యాత్మికోన్నతిని కలిగిస్తూవుంటారు.

ప్రతి సంవత్సరమూ శ్రీ బాబాగారి శిష్యులు ఆయన జన్మదినోత్సవాన్ని పరమభక్తితో జరుపుతూవుంటారు. వేలకొలది జనం ఆ వుత్సవాల్లో పాల్గొంటూవుంటారు విజయనగరంవద్ద కులిలీరోడ్డుపై పెక్కుమఱ్ఱిచెట్లు నీడలతో చల్లదనాన్నిచ్చే శ్రీ బాబాఆశ్రమం, లేక - దర్బారులో ఈ వుత్సవం జరుగుతుంది. బాబాగారి ఆశీస్సులవల్ల మేలు పొందిన వారందరూ కలిసి బీదలకు అన్నప్రదానం చేస్తారు.

ఈ మహాత్ముని సాన్నిధ్యమునుబొంది, ఇంకా అనేకమంది స్త్రీ పురుషులు అనుగ్రహింపబడుదురుగాక యని శిష్యగణం ఆశిస్తున్నది.


ఈ మహనీయునికి సాక్షాచ్ఛిష్యులే - శ్రీ శ్రీ శ్రీ శ్రీ శ్రీ బాబా ఫరీదుమస్తాన్ అవులియా వారు. అనేక సంవత్సరాలనుంచీ వీరు కృష్ణాజిల్లా మచిలీపట్టణమునకు సమీపమున వేంచేసియున్నారు. వీరి గురూజీస్థానంవలెనే, వీరి స్థానంకూడా, మొదట్లో నిర్మానుష్యమైన సముద్రతీరంగా వుంటూవచ్చినా, ఇప్పుడు వీరి మూలముగా బహుజనాన్ని ఆకర్షిస్తూ భగవత్ కృపవల్ల చక్కని ఆశ్రమంగా వెలసింది. చుట్టుప్రక్కల, దాపుల, దవ్వులనుంచీకూడా వందలకొలది జనులు శ్రీ స్వామివారి దర్బారుకువచ్చి ఆయన దర్శనం చేసుకొంటూ వుంటారు.

ఈ మహాత్ముని శక్తి గూడా అత్యద్భుతమైనదే. వీరి గురూజీకి ఎలాటి శక్తులున్నాయని పైన జెప్పామో అలాటి శక్తులే వీరికినీ వున్నాయి.

వీరున్న ప్రదేశాన్ని "బాబాదర్బార్, బాబా నగర్" అని పిలుస్తారు. మచిలీపట్టణాని కిది 3 మైళ్ళదూరంలో వుంటుంది.

ఇక్కడ కూడా అన్నివేళలా అనేకోత్సవాలు జరుగుతూవుంటాయి. శ్రీ బాబా దర్బారు వారి అజమాయిషీక్రింద బీదలకు అన్నప్రదానాలు జరుగుతూవుంటాయి. శ్రీ బాబావారి ఆశీస్సులను పొందుతూ, ప్రశాంతంగా జీవనం గడపడానికి ఆ ప్రదేశం ఎంతో అనువుగా వుంటుంది.

ఇంకా వేలకొలదిగా ప్రజలు ఈ మహాపురుషుని దర్శనలాభాన్ని పొందుతూ వారి ఆశీర్వచన ప్రభావంచే శాంతిసౌభాగ్యములను పొందుదురుగాక యని వారి శిష్యవర్గం ఆశిస్తున్నారు.





ప్రభూ!

అపారసాగర
తీరమునా
కృపాకరా నీ
వవతారము దాల్చితివా?
సంసారాంబుధి
లోబడి
దరిచేరగజాలని
దీనులపాలిటి
నావవు నీవై వెలసితివా.
అజ్ఞానంబను
అంధకారమున
తెన్నులు తెలియక
నిన్ననివతికే
పుణ్యమూర్తులకు
దిక్కువు నీవై
చుక్కానివి నీవై
దారిచూపగా ॥అపా॥
కలియుగవారధి
చెలియలికట్టల
పిలిచిన పలికెడు
ప్రభుడవు నీవై
జీవుల కభయము నీవై ॥అపా॥

Advt



తూపురాన్ సాహిత్యసభల్లో పాల్గొన్న హైదరాబాద్ మహిళామణులు.

హైదరాబాదులో స్త్రీ జనుల విద్యా పురోభివృద్ధి

శ్రీమతి రంగమ్మ ఓబులరెడ్డి

భారతదేశంలో స్త్రీ జనోద్ధరణావశ్యకత చాలా ఉందని పెద్దలు ఒప్పుకున్నారు. అసలు సామాన్యప్రజాజీవితమే చాలా అభివృద్ధి చెందాల్సిన అవశ్యకత ఉంది. అందులో స్త్రీల స్థితి మరీ అధ్వాన్నంగా ఉండటం స్వయంవిదితమే. ఇక హైదరాబాదు భారతదేశంలో బాగా వెనకపడిఉన్న ప్రాంతం కాబట్టి ఇక్కడి ప్రజాజీవనంకూడా మరీ వెనకపడి ఉండటంలో ఆశ్చర్యం లేదు.

— చరిత్రలోకి తొంగిచూస్తే, హైదరాబాదు ప్రాంతంలో చిరనివాసం చేసిన సంస్కృతి - నేటివరకు నిలచిపోయిన ఆ సంస్కృతి చిహ్నాలు - ఏవిధంగా ఇక్కడి ప్రజాజీవితాల్ని రూపొందించినాయో కన్పడుతుంది. ఆనాటి సంఘంలో స్త్రీ, ఏదో గొప్పస్వాతంత్ర్యాన్ని అనుభవించి ఉండకపోవచ్చు. కాని ఒక స్త్రీ పరిపాలనాభారం వహించటం - దేశక్షేమానికి బాధ్యత వహించి, స్త్రీ స్వభావానికి విరుద్ధమని పొరపాటున నిర్ణయించబడిన శక్తిసామర్థ్యాల్ని ప్రదర్శించటం, ఆనాటి ప్రజలలో తప్పక మానసికపరివర్తన కల్గించిఉంటుంది. ఆనాడు రుద్రమదేవిని ఆదర్శంగా చేసుకొన్న స్త్రీలు, అట్టి ఆదర్శసఫలతకై స్త్రీలు చేసిన కృషికి తోడ్పడిన పురుషులు ఉండిఉంటారు.

తర్వాత తర్వాత, హైదరాబాదు రూపం మారింది. సంస్థానం ఏర్పడటం ఒక ఐతిహాసిక వైపరీత్యమని, చారిత్రకదుస్సంఘటన అని ఒప్పుకున్నా, అది విశాలభారతంలో జరుగుతున్న సంఘటనలలో ఒకటి మాత్రమే. ముసల్మానులు, దండయాత్రలు సాగించారు. ప్రభుత్వాలు స్థాపించారు. స్థిరనివాసా లేర్పరుచుకొన్నారు. సాంఘికజీవితంపైన పాలకజాతి మర్యాదలు ప్రాబల్యం వహించటం చారిత్రక సత్యం. అట్లు జరగటం ఒత్తిడివల్ల కావచ్చు - ప్రోద్బలంవల్ల కావచ్చు - పాలకుల పట్ల గల మొహమాటంవల్ల కావచ్చు. రాను రాను పాలకజాతివారి ఆచార ప్రవర్తనలు నాగరిక జీవన విధానాలుగా పరిగణింపబడటంవల్ల కూడా కావచ్చు. దక్షిణాపథంలో స్త్రీకి ఘోషా లేదు. నేడిక్కడ ఉన్న ఘోషా ఎక్కడనుంచో దిగుమతి అయిన ఆచారమే. అసహజత్వపు చిహ్నమే. కాని ఏ ఆచారమూ తేలికగా, తొలగిపోదు. ఘోషా హిందూ స్త్రీల కెంత అసహజమో, వాస్తవానికి ముస్లిం స్త్రీలకుకూడా అంతే అసహజం. ఘోషా సుఖానుభూతికారకం కాదు!

పూర్వం సంఘంలో స్త్రీల కెట్టి విద్యాసౌకర్యా లుండేవో తెలియదు. వినికిడివల్ల అనేకమంది స్త్రీలకు పాండిత్యం అలవడి ఉండవచ్చు. వినికిడిద్వారా పాండిత్యసముపార్జన చేయటానికి, అంత పాండిత్యాన్ని వినిపించగల వాతావరణం ఏర్పడి ఉండాలి. తెలివితేటలు, సదసద్వివేకం వయోనుభవంతో లభించవచ్చు. కాని సక్రమంగా నడుస్తున్న సంఘంలో వ్యక్తిప్రవర్తనాభివృద్ధికి దోహదం చేసే విద్యాసౌకర్యాలుండి తీరాలి. అట్టి సౌకర్యాలు మన ప్రాచీన సంఘంలో పురుషులకు కొంతవరకు లభించి ఉంటాయి స్త్రీలకు లేవు. ముస్లిం దండయాత్రల కాలంనాటివరకూ పరిస్థితి అంతే.

నిత్యజీవనానికి అవసరమైన కృషిలో హిందూ స్త్రీపురుషులిద్దరూ బాహాటంగా పాల్గొంటారు. కలిగినవారు బయటికొచ్చి చాకిరీ చేయకపోవచ్చు. కాని బయటకు మాత్రం స్వేచ్ఛగా వస్తారు. ముస్లింపాలకుల రాకతో, చాలామంది కలిగినవారిస్త్రీలకు ఘోషా దాపురించింది. ఘోషా ఒక తప్పనిసరి ఫ్యాషన్ అయింది. స్త్రీలకు ఆర్థికస్వాతంత్ర్యం లేదు. విద్యాసౌకర్యాలు లేవు. దానికి తోడు ఘోషా. ఇట్లాగే దాదాపు 19 వ శతాబ్దాంతం వరకూ జరిగింది.

పందొమ్మిదవశతాబ్దాంతంలో, డాక్టర్ అఘోరనాథ ఛటోపాధ్యాయ (శ్రీమతి సరోజనీనాయుడు తండ్రి) హైదరాబాదులో మిసెస్ మానింగ్ బాలికాపాఠశాలను స్థాపించారు. అప్పటికే ఒకటి రెండు చిన్న బాలికాపాఠశాలలు ఉండి ఉండవచ్చు. కాని డా॥ అఘోరనాథ ఛటోపాధ్యాయ, ఒక ఆదర్శంతో, బాలికాపాఠశాలకు పునాదులు వేశారు. విద్యాప్రచారం పవిత్రనిర్మాణకార్యక్రమోద్యమం. అందులో మనదేశంలో స్త్రీలకు విద్యాసౌకర్యాలు చేయటం మహోత్కృష్టకార్యం. నేడు హైదరాబాదు మహిళోద్యమానికి మాతృసములైన శ్రీమతి మనోరంజితంపిళ్లై, శ్రీమతి వరలక్ష్మమ్మగారలు ఈమానింగ్ పాఠశాల విద్యార్థినులే. హైదరాబాదుస్త్రీలు డా॥ అఘోరనాథునికి సదా కృతజ్ఞలు.


మనలో సామాన్యులకు, లేనివారికి, విద్య ఒక విలాస కాలక్షేపం. అందులో స్త్రీవిద్య కేవలం నిరుపయోగాలంకారంగా భావింపబడేది. అయినా కొన్నికొన్ని బాలికాపాఠశాలలు క్రమక్రమంగా ప్రారంభ మవుతూ వచ్చాయి. కాని ఆదిలో ఈ స్కూళ్లలో ఎక్కువగా చేరింది పెద్దపెద్దవారి పిల్లలే. స్టేన్లీ బాలికోన్నత పాఠశాలలో మాత్రమే తెలుగుకూడా బోధింపబడేది. మహబూబియా బాలికోన్నత పాఠశాలలో ఉర్దూ ఇంగ్లీషులు మాత్రమే ఉండేవి. ఈ పాఠశాల అసలు భాగ్యవంతుల పిల్లలకే.

పందొమ్మిదివందల ఇరవైయోసంవత్సరంలో శ్రీమతి రుస్తుంజీ, అఖిలభారతమహిళాసభను ఆదర్శంగా చేసుకొని స్త్రీవిద్యా సాంఘికాభివృద్ధిసంఘాన్ని స్థాపించింది. వెంటనే ఔరంగాబాదు,పర్భని, వరంగల్లులలో ఆ సంఘానికి శాఖలు నెలకొల్పబడ్డాయి. ఔరంగాబాదు శాఖవారు స్త్రీ పారిశ్రామికుల కొక ఆరామ గృహాన్ని, శిశుపోషణాలయాన్ని, స్కూలును స్థాపించారు. [కాని ఇవి 1943 లో మూతపడిపోవాల్సి వచ్చింది.]

మహిళాసంఘంవారు నగరంలో 3 ప్రాథమిక పాఠశాలల్ని, ఒక హాస్టల్ ను నడుపుతున్నారు. స్కూళ్లలో తెలుగు, ఉర్దూ బోధింపబడుతోంది.

1920 లో శ్రీ మాడపాటి హనుమంతరావు ఆంధ్రోద్యమం ప్రారంభించారు. దానిలో అంతర్భాగంగా ఆంధ్రమహిళాసభ ప్రారంభమయినది. అదృష్టవశాత్తు ఆంధ్రమహాసభ విద్యాప్రచారానికి చాలా ప్రోత్సాహం ఇచ్చింది. బిడియంతో నాలుగుగోడల వెనకే ఉండిపోయే స్త్రీలకు ఆంధ్రమహాసభ ప్రోత్సాహం యిచ్చి ప్రజాహితోద్యమాల్లో ప్రవేశం కల్పించింది. రాజాబహదూర్ వెంకట్రామారెడ్డి, శ్రీ మాడపాటి హనుమంతరావు మొదలైన పెద్దలు తెలుగుబాలికలకు విద్యాసౌకర్యాలు కల్గించటానికి అతిశ్రద్ధతో పని చేశారు. వారి కృషిఫలితమే నేటి ఆంధ్ర బాలికాపాఠశాల (నారాయణగూడ). అనేకులు స్త్రీలు ఈ సంస్థఅభివృద్ధికి ప్రతిఫలవాంఛ లేకుండా పాటుపడ్డారు. వీరిలో స్వర్గీయ శ్రీమతి నడింపల్లి సుందరమ్మగారు నారీలోకానికి చిరస్మరణీయురాలు. సత్కార్యాచరణకు పూనుకున్నవారికి, వారికృషి విజయవంతం అవటానికి తోడ్పడ్డవారికి మా నమస్కారాలు. ఆంధ్రోద్యమఫలితంగా లభించిన ప్రోత్సాహఫలితంగానే శివగంజిలో సావిత్రీకన్యాపాఠశాల గద్వాల, వనపర్తి, జటప్రోలు, అలీయాబాదు పాఠశాలలు—ఇంకా అనేక పాఠశాలలు స్థాపింపబడ్డాయి. ప్రభుత్వానికి గూడా అక్కడక్కడా కొన్ని పాఠశాలలు పెట్టి, ప్రజాహిత కార్యాచరణలో వ్యక్తులు చూపే కృషిని చూసి నేర్చుకోక తప్పలేదు. కాని, ఇదంతా, మూలా

(22 వ పేజీ చూడుము)



గోల్కొండ కోట

తానీషా

అక్కన్న మాదన్నలు

గోల్కొండసామ్రాజ్య చరిత్రలో స్వర్ణయుగం

★



తానీషా

భద్రాచలరామదాసుకథ, హరికథల్లోనూ, నాటకాల్లోనూ, భజనగీతాలలోనూ, తెలుగు దేశమంతటా ప్రచారంలో ఉన్న కథ. తెలుగు దేశంలోమహమ్మదీయరాజ్యం, ప్రజాహితైకంగా జరిగిన రోజులకు నిదర్శనంగా తానీషారాజ్య కాలాన్ని తెలుగువారు జ్ఞప్తిలో ఉంచుకుంటారు. తానీషా అన్నాకూడా, తెలుగువారికి సహృదయతే ఉంది. గోపన్నను ముందు దండించినా, తర్వాత శ్రీరామలక్ష్మణుల దర్శనసౌభాగ్యం పొందిన పుణ్యుడనీ, రామదాసును గౌరవించాడనీ అతన్ని గౌరవంతో చూస్తారు. ఆ కథకు సంబంధించే అక్కన్న మాదన్నల కథకూడా తెలుగుమంత్రుల ప్రజ్ఞా పరిణత్వానికి తార్కాణంగా చెప్పకోటంకద్దు. అక్కన్నమాదన్నలు గోపన్న మేనమామలు. గోల్కొండతానీషామంత్రులు మాదన్నను మహామంత్రినిచేసి రాజ్యభారం అంతా అతనికి అప్పగించి, తానీషా వేదాంతకవిత్వాది గోష్ఠులలో రాజయోగిజీవితం గడపేవాడని ప్రతీతి.

అక్కన్నమాదన్నలగురించి చిన్న చిన్న కట్టుకథలుకూడా ఉన్నాయి. మాదన్నగారు మహామంత్రి. ఆయనఇంట్లో అతిథిసత్కారం ప్రతిదినమూ సాగుతూ ఉండేది. ఒకసారి ఒక బ్రాహ్మణుడు, ఇంట్లో అల్లాగే భోజనాలుచేస్తూ నిత్యం ఆతిథ్యం అందుకొంటూ నిలచిపోయాడు. భర్తవై పుబంధువులని భార్య, భార్యవై పుబంధువు అని భర్తా, ముభావంగా చాలాకాలం ఊరుకొన్నారు. చివరికి మాదన్నగారొకనాడు లౌక్యంగానే తమతమ బంధుత్వంప్రసక్తి తెచ్చారు. ఆ బ్రాహ్మడు అతిచాకచక్యంగా, "బాబూ మనం ఇద్దరం పినతల్లి పెదతల్లి బిడ్డలం. అన్నదమ్ములము. నువ్వు లక్ష్మీదేవిపుత్రుడవు, నేను జ్యేష్ఠాదేవి పుత్రుడను." అని మందహాసం చేశాడట. అప్పటినుంచీ వారన్నదమ్ములుగానే కలిసి మెలసిపోయారని కట్టుకథ.

కాని అక్కన్నమాదన్నలు యథార్థంగానే అన్నదమ్ములు. వీరిది ఓరుగల్లు. నియోగి బ్రాహ్మణులు. తండ్రి భానూజీ పంతులుగారు. తల్లి భాగ్యమ్మ. చిన్నానాడే విద్యలన్నీ నేర్చి, గోల్కొండకు ఉద్యోగార్థమై వచ్చేశారు. అక్కడ మీర్ జుమ్లా అనే దర్బారుఉద్యోగివద్ద నెలకు 19 గిల్డర్లుజీతం మీద గుమాస్తాలుగా ప్రవేశించారు. మాదన్న



సర్వసేనాని అక్కన్న

ఉపాయశాలి. అక్కన్న మంచిపండితుడేగాని కొంచెము తొందరపాటువాడు. వీరిద్దరూ గుమాస్తాలుగా ఉండగానే, వీరి తెలివితేటలు తానీషా అజలోనికివచ్చి ఇద్దరినీ తమ దర్బారులో 'వసాఉత్' - ఉద్యోగులుగా జేర్చుకొని తనకు అంతరంగికులనుగా చేసికొన్నాడు.

ఈతానీషాకథకూడ చాలా విచిత్రమైనది. ఈయనపేరు అబుల్ హసన్. కులీనవంశీకుడే గాని, ఇతని బాల్యమునాటికే, ఆస్తిఅంతా పోయి, తండ్రి చనిపోవటంచేత, ఇతను చిన్నవాడు చాలా దరిద్రం అనుభవించాల్సివచ్చింది. కాని, ఇతనికి ఇహసుఖాలమీదకన్న, మోక్షాసక్తితో వేదాంతగోష్ఠి ఎక్కువగా ఉండేది. ఆకాలంలో గోలకొండలో, "సయ్యద్ రాజ్ కొత్తాల్" అనే స్వామి, 'మహాతపస్వి' అనే ప్రసిద్ధికెక్కాడు. అబుల్ హసన్ ఆయనవద్ద శిష్యుడుగా పదునాల్గేళ్ళు యోగాభ్యాసాలలోనే భక్తియోగంలో కాలంగడిపాడు.




మహామంత్రి మాదన్న

ఆ రోజుల్లో గోల్కొండరాచనగరుపరిస్థితులు వ్యస్తంగా ఉన్నాయి. అప్పటి సుల్తాను అబ్దుల్లాకు పుత్రులు లేరు. ముగ్గురు కుమార్తెలు. పెద్దకుమార్తెను సయ్యద్ అహ్మద్ అనే మక్కాకు చెందిన గౌరవకుటుంబీకునికి, ఇచ్చి పెండ్లిచేశారు. ఇతను చాలా పలుకుబడి సంపాదించి సుల్తాను కీలుబొమ్మచేసి తానే రాజ్యం ఏలుతూఉండేవాడు. రెండవ కుమార్తెను ఢిల్లీపాదుషా, ఔరంగజేబు కుమారుడు, మహమ్మద్ సుల్తానుకిచ్చి పెండ్లిచేశారు. మూడవ కుమార్తెపెళ్ళి ఒక నాటకంగా జరిగింది. ఈ అమ్మాయిని సయ్యద్ అహమ్మద్ ఆశ్రితుడైన సయ్యద్ సుల్తాను అనేవానికిద్దామని నిశ్చయం చేసుకొన్నారు. కాని తీరా రేపు పెండ్లి అనగా సయ్యద్ సుల్తాన్ తన నేదో వెక్కిరించాడన్న ద్వేషంతో, సయ్యద్ అహ్మద్ ఈ సంబంధం తప్పించి, తన చెప్పుచేతల్లో ఉండగల ఒక అనామకుడికి కిద్దామని సంకల్పించాడు. అప్పటికప్పుడుగా అతని దృష్టిలో, ఉన్నత వంశీకుడయ్యీ పేదతనంలో విరాగిగా ఉన్న అబుల్ హసన్ కనబడ్డాడు. వెంటనే అతన్ని తీసికొచ్చి, రాజకూతురు కిచ్చి పెండ్లిచేశాడు.


సుల్తాన్ అబ్దుల్లా చనిపోగానే సయ్యద్ అహ్మద్, సుల్తాన్ అవుదామని సంరంభపడ్డాడు. కాని ఈతని పొగరుమోతుతనంవల్ల, దర్బారులో ఇతనికి చాలామంది శత్రువులు ఏర్పడ్డారు. సయ్యద్ ముజఫర్ అనే సేనాపతీ మూసాఖాన్ అనే మహల్దార్ మరికొందరు ఉద్యోగులతో కలిసి, సయ్యద్ అహమ్మద్‌ను చెఱసాలలోకి తోసి, అబుల్ హసన్‌ను 'తానీషా' అను పేరిట సుల్తాన్‌నుచేసి తామిద్దరూ మంత్రులయ్యారు. తానీషా తమ చేతిలో కీలుబొమ్మ, రాజ్యప్రమేయం లేని వట్టి విరాగి అనుకొన్నారు కాని తానీషా, వీరి దౌర్జన్యాలు గమనిస్తూ వీరిని తొలగించేందుకు సమయంకోసం చూస్తూ ఏమీ ఎరగనివానిలాగే ఉంటూ వచ్చాడు.

ఇంతలో అతనికి అక్కన్నమాదన్నల ఋన్ణ కౌశలం తోడయింది. అక్కన్నమాదన్నలు తన స్వంత సోదరులలాగా తనయందు భక్తితో తన

(25-వ పేజీ చూడుడు)



శ్రీ భద్రాచల రామాలయము



శ్రీ సీతారామ లక్ష్మణులు



మీర్ నిజాం ఆలీఖాన్
నిజాం II 1758-1803



మీర్ సికందర్ జా
నిజాం III 1803-29



మీర్ నాసిరుద్దౌలా
నిజాం IV 1829-57



మీర్ అఫ్జలుద్దౌలా
నిజాం V 1857-69



మీర్ మహబూబ్ ఆలీఖాన్
నిజాం VI 1869-1911

ఆసఫ్‌జా వంశచరిత్ర

ఆసఫ్ జాహీవంశీకులు పితృపక్షాన ఖలీఫాలూ, మాతృపక్షాన సాక్షాత్తూ మహమ్మద్ ప్రవక్తా, మూలపురుషులుగా గలవారట.

ఈ వంశంలో నవాబ్ అబీద్‌కులీఖాన్ అనునాతడు బొఖారాలో ఖాజీగా ఉంటూ 1658 లో షాజహాన్ చక్రవర్తికాలంలో ఇండియాకు తరలివచ్చి, పాదుషావద్ద మంత్రిగానూ తర్వాత అజ్మీర్ సిల్లాదార్‌గానూ నియమితుడయ్యాడు. మక్కాయాత్ర చేసివచ్చి ఖలీజ్‌ఖాన్ అనే గౌరవం సంపాదించాడు. విదేశీయులైన దర్బారీయులలో ముఖ్యుడుగా "తురానీ" అని పిలవబడేవాడు.

1681 లో ఔరంగజేబు మంత్రులలో ముఖ్యుడయి, అతనితో దక్కనుదండయాత్రల్లో బయలుదేరి జఫియాబాద్‌కు సుబేదార్ అయాడు. 1687 లో ఔరంగజేబు పాదుషాతో గోల్కొండ ముట్టడిలో పాల్గొన్నాడు. అతని సాహస పరాక్రమాలకు (యుద్ధంలో ఫిరంగికాల్పుకు చెయ్యి తునకలైపోయినా గుఱ్ఱంమీద నున్న కులీఖాన్ ఏమీ చలించలేదు) ఔరంగజేబు ముగ్ధుడయి, స్వయంగా అతనికి వైద్యోపచారాలు చేయించాడు. కులీఖాన్ బాధను ఏమాత్రం పైకి తెలియనీయకుండా ధైర్యంగా సంతోషం ప్రకటిస్తూనే, మూడవనాడు ప్రాణాలు విడిచాడు.

అతని కుమారుడు షాబుద్దీన్ ఘాజియుద్దీన్ ఖాన్ ఫిరోజ్ జంగ్, ఆ గౌరవ చిహ్నలతోనే మొగల్ దర్బారులో నిలచాడు. "ఇతను మహమ్మద్ ప్రవక్త వంశీకురాలైన సయ్యద్ బీబీని వివాహమాడటంచేత ఈ వంశీయులకు 'మీర్' అనే గౌరవబిరుదము పారంపర్యంగా రాసాగింది.

వీరి కుమారుడు మీర్ కమ్రుద్దీన్, తండ్రి మరణానంతరం తండ్రిస్థానం ఆక్రమించాడు. ఆతర్వాత ఇతడే నిజాంలలో ప్రథముడయ్యాడు. ఇతను యుద్ధంలోనూ మంత్రాంగంలోనూ దిట్ట. నాటి మొగల్ సామ్రాజ్యచక్రం తిప్పినవారిలో కమ్రుద్దీన్ ప్రముఖుడు.

1713 లో ఫరూక్‌సయ్యద్ ఢిల్లీచక్రవర్తి అవగానే మీర్ కమ్రుద్దీన్ ఛిన్ కులీచ్ ఖాన్‌ను, దక్కన్ సుబేదార్ (వైస్‌రాయి పదవి)గా చేసి, నిజామ్-ఉల్-ముల్క్-(రాష్ట్రపాలనాసంస్కర్త) అనే బిరుదం ఇచ్చాడు.

కమ్రుద్దీన్ మొగల్ దర్బారుకు ఆంతరంగికుడుగా ఉండి మహారాష్ట్రయుద్ధాలు తదితర సైనిక చర్యలన్నిటిలోనూ, ఢిల్లీసింహాసనానికి అండగా నిలచాడు. ఒకసారి మహారాష్ట్రులతో పైఠాన్‌వద్ద యుద్ధంచేయటానికి వెళ్లినప్పుడు సయ్యద్ హుసేన్ ఆలీఖాన్ అనే అతన్ని దక్కన్ సుబేదార్‌గా నియమించేటప్పటికి ఇతను ఢిల్లీకి వెళ్ళిపోయాడు. అక్కడ మోరాదాబాద్‌కు సుబేదార్‌గా ఇతన్ని సుల్తాన్ నియమించాడు.

మరుసంవత్సరం, ఫరూఖ్‌సయ్యద్ చక్రవర్తిని కనుగుడ్లు పీకి ఖైదీని చేశారు. సయ్యదులందరూ కలిసి ఔరంగజేబు మనుమడిని మహమ్మద్‌షాను చక్రవర్తిని చేశారు. మహమ్మద్‌షా కులీచ్‌ఖాన్‌ను తన ప్రధానమంత్రిగా చేసుకొన్నాడు. రాజ్యపరిపాలనను సరిదిద్దటానికి కులీచ్‌ఖాన్ ప్రయత్నించాడు. కాని ఆ సరిదిద్దటంలో దెబ్బతిన్నవాళ్ళంతా చక్రవర్తితో ఇతనిమీద నేరాలు చెప్పసాగారు. తన ప్రధాన పదవికి రాజీనామా ఇచ్చి, దక్కన్‌సుబేదారుగా మరలి వెళ్ళాడు.

అక్కడ ఇతను అధికారంలో ఉంచిన



నవాబ్ మీర్ కమ్రుద్దీన్ ఛిన్‌కులీచ్ ఖాన్ నిజాం ఉల్ముల్క్ ఆసఫ్ జా.
ఆసఫ్ జా వంశమూలపురుషుడు.
నిజాం I

ముబారిజ్ ఖాన్ ఇతనికి ఎదురుతిరిగి అధికారం అంతా తన కైవసంచేసికొని ఉన్నాడు. బీదర్ జిల్లాలోని షకర్‌ఖేడ్లావద్ద అతన్ని యుద్ధంలో చంపి, విజయుడయి, నిజాం ఉల్ముల్క్, హైదరాబాద్ ప్రవేశించి, రాజ్యాన్ని స్వాధీనం చేసికొన్నాడు. ఢిల్లీపాదుషా ఇతనివిజయానికి మెచ్చి ఏనుగులు, రత్నాలూ బహుమానంగా పంపిస్తూ ఆసఫ్‌జా, అనే బిరుదిచ్చి, దుష్టశిక్షణ శిష్టరక్షణ సాగిస్తూ ప్రజలను పాలించవలసిందని హుకుం ఇచ్చాడు. ఈ విధంగా మీర్ కమ్రుద్దీన్ ఆసఫ్‌జా నిజామ్ ఉల్ముల్క్ 1724 లో దక్కనులో దాదాపు స్వతంత్ర పరిపాలకుడయ్యాడు. కాని మొగల్ దర్బార్ విశ్వాసాన్ని ఇతను కోలుపోలేదు. దాదాపు ఒకపాతికేళ్లల్లో, బహు శ్రమించి తన రాజ్యం సుస్థిరంగా స్థాపించి, హైదరాబాద్ ముఖ్యపట్టణంగా చేసుకొని, పట్టణంచుట్టూ గోడలను నిర్మించాడు. ఆసఫ్‌జా దక్కన్ సుబేదార్ అయేనాటికి దాదాపు దక్కన్ అంతా, పశ్చిమాన్న మహారాష్ట్ర భాగం చీలిక వదిలివేస్తే ఉత్తరాన తపతినదినుంచీ, దక్షిణాన మైసూరు కర్నాట రాజ్యాలమీదుగా, తిరుచినాపల్లి వరకు ఆక్రమించింది. ఆర్కాట్ నవాబ్ (కర్నాటక నవాబు) ఇతని నియామకంలోనే, ఇతనికి లొంగి ఉండేవాడు. చికాకోల్‌నుంచి దక్షిణ భాగమంతా ఇతని రాజ్యంలోనే ఉండేది.

ఆసఫ్‌జా, సైనిక, పరిపాలక ఉద్యోగులందరికీ, ఇనాములు, జాగీరులు ఇచ్చి, వారిచేత సైనికసహాయం పొందుతూ, వారిని తన పాలెగాళ్ళగా అదుపులో ఉంచసాగాడు. ఇతను సాహిత్య వేదాంత గోష్ఠులలో కూడా కాలం గడిపేవాడు.

1729 లో మహారాష్ట్రుల ఒత్తిడి ఎక్కువ కాగా, "సర్‌దేశముఖ్" (మొత్తం ఆదాయంలో పదోవంతు పన్ను) చౌథ్, (భూమి శిస్తులలో నాల్గవవంతు) పన్నులను మహారాష్ట్రుల కిచ్చి వారితో సమాధానాలు కుదుర్చుకొన్నాడు.

1757 లో మొగల్‌చక్రవర్తిఆహ్వానం మీద ఇతను ఢిల్లీ వెళ్లగా, హైదరాబాద్‌లో ఇతని కుమారుడు నాసిర్‌జంగ్ గద్దె నెక్కి స్వాతంత్ర్యం ప్రకటించాడు. వెంటనే నిజాం ఉల్ముల్క్, హైదరాబాద్ వచ్చి కుమారుణ్ణి ఔరంగాబాద్‌వద్ద యుద్ధంలో ఓడించి, నాందేడ్‌వద్ద కాంధార్ కోటలో ఖైదుచేశాడు.

నిజాం ఉల్‌ముల్క్ సయ్యద్ ఉన్నిసా బేగంను పెండ్లాడాడు. ఈమెవల్ల గాజీఉద్దీన్ ఖాన్ ఫిరోజ్ జంగ్, నాసిర్‌జంగ్ అనే యిద్దరు కుమారులూ, పాద్షాబేగం మోషిమాబేగం అనే ఇర్వురు కుమార్తెలూ కలిగారు. ఇంకా నల్గురు ఇతర భార్యలవల్ల, సలాబత్ జంగ్, రెండవ ఆసఫ్‌జా నిజాం ఆలీఖాన్-బసాలత్ జంగ్, మీర్ ముగల్ ఆలీఖాన్ బహదూర్ అనే నల్గురు కుమారులు కలిగారు.

నిజాం ఉల్ముల్క్ చనిపోగానే సింహాసనానికి తగవులు రేగాయి. నవాబు రెండవ కుమారుడు నాసిర్‌జంగ్, సైన్యాధిపత్యం చేతిలో ఉండబట్టి రాజ్యం స్వాధీనంచేసికొన్నాడు. కాని ముజఫర్ జంగ్ అనే నిజాం దౌహిత్రుడు తన హక్కును చక్రవర్తికూడా బలపరచాడని సింహాసనంకోసం తగవు ప్రారంభించాడు. వీరిరువురికీ, ఆనాడు దక్షిణదేశంలో స్థావరంచిక్కించుకొంటూన్న ఇంగ్లీషు ఫ్రెంచి కంపెనీలు తోడయాయి. నాసిర్‌జంగ్ బ్రిటిషువారి సహాయంతో నెగ్గాడు కాని, ఆర్కాట్ దాడిలో, ఫ్రెంచి సైనికులు ఇతన్ని ముట్టడించి చంపేశారు. డూప్లే ముజఫర్ జంగ్‌కు సింహాసనమిప్పించాడు. కాని ఇతని అనుయాయులైన పఠానునాయకులే తమకు బహుమానాలు సరిగ్గా ముట్టలేదని ఇతన్ని అంతమొందించారు.

తర్వాత షాజీఉద్దీన్ సలాబత్‌జంగ్‌లు సింహాసనం కోసం పోరాడారు. సలాబత్ జంగ్ తల్లి షాజీఉద్దీన్ (నిజాంపెద్దకొడుకు)కు విషంపెట్టి చంపించింది. కొన్ని ఏళ్ల తర్వాత సలాబత్ జంగ్ తమ్ముడు నిజాం ఆలీ ఖాన్, అతని ప్రాపకంలోనే బలీయుడై, 1761 లో రాజ్యం స్వాధీనం చేసుకొని, సింహాసన మెక్కి, 1763 లో సలాబత్ జంగ్‌ను చంపించాడు. ఇల్లా పదునాలుగేళ్లలో ముగ్గురు నవాబులు సింహాసన మెక్కి బలవన్మరణం పొందారు. వీరందరినీ లెక్కవేసుకొంటే రెండవనిజాం, నిజామ్ ఆలీఖాన్, ఐదవ నిజాంగా లెక్కకుకొస్తాడు.

నిజాం ఆలీఖాన్ నలభై ఏళ్ళు రాజ్యం

(24-వ పేజీ చూడుడు)

సంస్థానంలో కమ్యూనిజం స్వరూపం

(7 వ-పేజీ తరువాయి)

ప్రభుత్వస్థాపనలు చేయటం కూడా ప్రారంభించారు. మీర్జా ఇస్మాయిల్ ప్రధానిగా వచ్చినతర్వాత, ప్రభుత్వం ప్రతిక్రియకు పూనుకుంది. అంతటితో కమ్యూనిస్టు చర్యలు తాత్కాలికంగా కట్టుపడ్డాయి - కమ్యూనిస్టులు అజ్ఞాతజీవనం అవలంబించారు. కాని స్థానికంగా వారి కార్యక్రమాల్లో ఎట్టి మార్పులు కల్గినప్పటికీ, వారు భారత కమ్యూనిస్టుపార్టీ ఆదేశానుసారంగానే వ్యవహరిస్తూ వచ్చారు. హైదరాబాదులోని సమస్యను, భారతదేశంలోని సమస్యలకు విభిన్నమైనదానినిగా పరిగణింప వీలులేదు. కాబట్టి వారు ఇంకా చాలా కాలంవరకూ ప్రభుత్వానికి తలనొప్పిని కల్గిస్తూనే ఉంటారు - ఆ తలనొప్పిని కల్గించటంలో ప్రదర్శించే తీవ్రత యొక్క స్థాయి మారుతూ ఉండవచ్చు. కాని ఇక్కడ కమ్యూనిస్టుఉద్యమం పేర జరుగుతున్న చర్యలలో ఒక విశేషం గమనార్హమైంది. రజాకార్ల నెదుర్కొంటామని, స్థానికంగానూ, బయటనుంచి, బోలెడు ఆయుధసామగ్రిని సేకరించారు. ఈ ఆయుధశక్తిని, రజాకార్లపైన; పోలీసు, మిలిటరీపైననేగాక, కోపాలు తీర్చుకోటానికి; ధనసంపాదనకుకూడా కమ్యూనిస్టులు వినియోగించారు. 1946 నుంచి, వారు దాదాపు వెయ్యి హత్యలు చేశారు - దోపిడీలు, దొంగతనాలు అనేకం చేశారు. ఈ హత్యలకు, దాదాపు 350 మంది భూస్వాములు, గ్రామాధికారులు, 800 మంది కాంగ్రెసువారు, "వ్యతిరేకుల" క్రింద, ప్రభుత్వానికి వార్తలు చేరేస్తున్నారని అనుమానింపబడ్డ పేద రైతుల నేకులు ఆహుతి అయ్యారు. పూర్వ ప్రభుత్వాన్నెదుర్కోటానికి సమకూడిన గూండాలు - అన్నిరకాల గూండాలు - నేడు ఈ కమ్యూనిస్టు ఉద్యమాన్ని నడుపుతున్నారు. ఈ తత్వం గ్రామాల్లోని రౌడీలల్లోకూడా పరివ్యాప్తమై, చివరకు కల్లు సారాయి దుకాణాల దగ్గర సమావేశాలు జరిపి, తమ శత్రువులపైన న్యాయ తీర్పుల్ని ఇవ్వటందాకా వచ్చింది. ఈ చర్యలకు కమ్యూనిస్టుఉద్యమం అనే ఉత్కృష్ట నామం ఇవ్వటం సమంజసమా అని నాకు సందేహం కలుగుతోంది. ఉద్యమానికి 'వ్యావసాయకుల అశాంతి' అనే రూపం మారింది. కేవలం, అరాచకం కల్పించటానికి, దోపిడీ చేయడానికి ఏర్పడిన సంఘవిద్రోహ కార్యక్రమంగా రూపొందింది.

అయితే ఈ సమస్యను ఎట్లా పరిష్కరించాలి? సమాధాన మివ్వటంకన్న ప్రశ్నించటం తేలిక. కమ్యూనిస్టులు నడుపుతున్న దుశ్చర్యలకు మందు లేదు. శిరస్సుల్ని నిర్దాక్షిణ్యంగా తొలగించేయాలి. తప్పుమార్గాన పడిన వీరిని రాజకీయ ఖైదీలుగా పరిగణించాలని వాదించే భావోద్రేకులతో నేను ఏకీభవించను. వీరి పరమావధి చంపడం, దోపిడీచేయటం అయినప్పుడు, వీరి పట్ల జాలిని ప్రదర్శించడం సమర్థనీయం కాదు. సంఘసుస్థిరత్వానికి, క్షేమానికి, వీరు శాశ్వతశత్రువులు. అరెస్టుకాకుండా మిగిలి ఉన్న కమ్యూనిస్టుల నందరినీ వారి రహస్యస్థావరాలనుంచి బయటకు లాగి, వారిని ఉచితమైన చోటుకు - ప్రభుత్వాతిథులుగా - పంపెయ్యాలి. ఈ పనిని ప్రభుత్వం ప్రజాసహకారంతో సాగించాలి. పోలీసు, మిలిటరీ సహాయం అందుబాటులో లేని చోట్ల, ప్రజలే ధైర్యంగా కమ్యూనిస్టుల నెదుర్కొంటున్నారు - రోజురోజుకు ప్రజల సాహసం పెరుగుతోంది. కమ్యూనిస్టుల్ని, వారి చెప్పుచేతల్లో నడిచేగూండాలను అణచటంకోసం సైనిక చర్యను జరుపవీలులేకుంటే, పోలీసులు ప్రజలే దీనిని సాగించాల్సిన అవసరం అధికంగా ఉంటుంది. ఇందువల్లనే, కమ్యూనిస్టుల నణచటానికి ఇంతకాలం పడ్తోంది.

బలాతిరేకంతో కమ్యూనిస్టుల్ని అణచటం చాలదు. అది తాత్కాలికఫలితాల్ని మాత్రమే ఇవ్వగలదు. సంఘం యొక్క ఆర్థిక, సాంఘిక స్వరూపాన్ని హింసాయుతంగా ఎదుర్కొవాలనే విధానం జనించటానికి ఆస్కారమే లేకుండా చేయాలి. దానికి అనేక నైర్మాణిక విధానాల్ని అవలంబించటం అవసరం. హింసాతత్వంవల్ల ఏర్పడ్డ పరిస్థితిని సమూలంగా నాశనం చేయాలి - హింసావాదం తిరిగి తలెత్తే అవకాశాల్ని నాశనం చేయాలి. జాగీర్దారీ జమీందారీ విధానాల్ని, ఇతర భూస్వామిక పెట్టుబడిదారీ వ్యవస్థల్ని సాధ్యమైనంత త్వరలో రద్దుచేయాలి. పేదలు లాభంపొంది, సంతుష్టిచెందటమే, వ్యవసాయిక కార్మిక సంస్కరణ లక్ష్యమైతే, ఆ సంస్కరణలు సమగ్రంగా చేయబడి, కఠినంగా అమలు కావాలి. క్రమక్రమంగా సార్వజనిక కార్యక్రమాల్ని జాతీయంచేయటానికి వేసికొన్న కార్యక్రమం, త్వరత్వరగా అమలుజరగటం అత్యవసరం. వర్గ, వర్ణరహితసంఘాన్ని, సహకార ప్రజాస్వామ్యంద్వారా స్థాపించుటకు అనేక దశాబ్దాలు పట్టవచ్చు - కాని అట్టి వ్యవస్థను శక్తివంతమైన పునాదులపై నిర్మించి, శీఘ్రంగా పురోగమించటం ముఖ్యం. వ్యవసాయ, కార్మిక సంస్కరణలు జరిగేలోగా, సాంఘిక విభేదాల్ని, మోసాల్ని అసంభవంచేయగల సాంఘిక చైతన్యం ప్రజల్లో కల్గిస్తూ, ఆర్థిక హేతువుల్ని పురస్కరించుకొని దౌర్జన్యాలకు దిగే పద్ధతి కూడదని నచ్చచెప్పవలెను. అప్పుడు పేదలకు, పీడితప్రజలకు, దౌర్జన్యంలోగల అవినీతి బోధపడ్తుంది - కమ్యూనిజం పెరగటానికి అవకాశా లుండవు. ఇట్టి పరిష్కారమార్గాన్ని అవలంబింపనంతవరకూ, మానసిక పరివర్తన కల్గింపప్రయత్నింపనంతకాలం (ఈ పని తేలిక కాదు) కమ్యూనిస్టులు తమ చేతల్ని సమర్థించుకుంటూనే ఉంటారు.

• ఇంతకాలం రైతుయొక్క కష్టాల్ని, నష్టాల్ని సాకుగా చేసుకొని కమ్యూనిస్టులు పనిసాగిస్తున్నారు. కాని వీరి వలలో పడటం తప్పని రైతు గ్రహించాడు. "దున్నకునేవానికే భూమి" అనే నినాదాన్ని వదిలేసి ఇతర పరిశ్రమలతో సహా "భూమిని జాతీయం చెయ్యాలి" అనే అభివృద్ధికరమైన నినాదాన్ని కమ్యూనిస్టులు ప్రారంభింపనున్నారు. ఇప్పటికీ రైతుసమస్యను వదలి, వ్యవసాయకూలీసమస్యను పరిష్కరించటానికి దిగారు. ఈ కూలీల్ని సంఘటితపరచి, సమ్మెలు చేయించి, వారిచే వ్యవసాయోత్పత్తిలో భాగం కావాలని లేక భూమిలోనే భాగం కావాలని అనిపించటానికి ప్రయత్నిస్తారు. కమ్యూనిస్టు తత్వానికి అంతం లేదు. శ్రమికనియంతృత్వస్థాపన జరిగేవరకు, ఒక్కొక్క మెట్టే, ఎప్పటికప్పుడే మరొక మెట్టు, ఎక్కుతూ ఉండాలి.

దీనికి ప్రత్యవాయ మొక్కటే - గాంధియన్ సోషలిజాన్ని స్థాపించాలి. ఇది మహా గురుతరమైన కార్యం. ఈ లోగా - నల్గొండ వరంగల్ ప్రాంతాలలోని స్థితి చాలా కష్టతరమై, ఆందోళన కల్గిస్తోంది. ప్రభుత్వం అనుసరిస్తున్న పద్ధతులలో తీవ్రమైన తప్పిదాలనేకం లేకపోలేదు. వీరి పద్ధతుల ఫలితంగా, దురదృష్టవశాత్తు, అవినీతి ప్రబలిపోతోంది. ఈ పద్ధతుల మూలంగా ఉద్యోగులకు దుష్ప్రవర్తనావకాశాలు లభిస్తున్నాయి. మనం ఒక విషచక్రంలో చిక్కుకుపోయాము. ఇందులోంచి బయటపడటానికి కాలం పడ్తుంది. నిజంగా - చాలా దౌర్భాగ్యస్థితిలో ఉన్నాము.

హైదరాబాదులో స్త్రీజనుల విద్యా పురోభివృద్ధి

(19 వ-పేజీ తరువాయి)

వసరానికి పోల్చి చూస్తే ఎంత? సముద్రంలో పడ్డ నీటిబిందువుపాటి. ఇంతమాత్రం పనికి ఎంత శ్రమ! కాని ఈ శ్రమ లేకపోతే ఇంతమాత్రం కూడా లభించదు. ఈ శ్రమ చేయకుంటే, జీవించటం వ్యర్థం. నారాయణగూడఆంధ్రబాలికాపాఠశాల, కళాశాల అవుదామని నిరీక్షిస్తోంది! ప్రజాహితజీవనాభిలాషులు ముందంజవేస్తారనే ఆశించవచ్చు.

ఇంతవరకు కొందరు ధనికులు సహాయం చేస్తూనే ఉన్నారు - వారు మహిళాసంస్థల కార్యవర్గాల నలంకరిస్తూనే ఉన్నారు. ఈసందర్భంలో బీరారురాజకుమారి, రాణి సరళాదేవి, బేగం జహీర్ యార్ జంగ్, గద్వాలరాణిగారు, రాణి అంబాబాయి, శ్రీమతి రుస్తుంజీ మొదలైన వారు పరిగణనీయులు.

హైదరాబాదు మహిళలచే లేడీ హైదరీ క్లబ్బు, లేడీస్ రిక్రియేషన్ క్లబ్బు నడుప బడుతున్నాయి. ఈ క్లబ్బుల్లోకి, కొందరు స్త్రీలను తీసుకురావటం చాలా కష్టమయింది. క్లబ్బుల్లోకి రావటం ఘోషామర్యాదకు విరుద్ధం. అయినా క్లబ్బులద్వారా, సమావేశాలద్వారా, చాలవరకు ఘోషా పల్చపడుతోందనే అనవచ్చు. హైదరాబాదుమహిళాసభకు అనుబంధంగా - ఆంధ్రయువతీమండలి; అంజుమన్ - ఎ - ఖవాతీన్ దక్కన్; అంజుమన్ - ఎ - ఖవాతీన్ - ఎ - ఇస్లాం; వై. డబ్లియు. సి. ఎ;, యం. ఇ. మిషన్ - మొదలైన అనేకసంస్థలు పని చేస్తున్నాయి.

రజాకార్ దినాల్లో, నగరపరిసరప్రాంతాలలో జరిగిన దుశ్చర్యల్ని నేను, శ్రీమతి ఎల్లాప్రగడ సీతాకుమారి, శ్రీమతి సంగెం లక్ష్మీబాయి స్వయంగా పోయి చూసి, అధికారులకు మా నిరసన తెలియపర్చాము. పైగా, ఆంధ్రయువతీమండలి సర్వసభ్యసమావేశం జరిపి, ఈ అమానుషకృత్యాల్ని తీవ్రంగా నిరసిస్తూ తీర్మానం చేసింది. ప్రభుత్వానికిది కంటకప్రాయమైంది.

బీదవారికోసం అనేకచోట్ల ఆహారపుదుకాణాల్ని మహిళామండలివారు స్థాపించారు. ఈ దుకాణాల్లో చౌకగా ఆహారపదార్థాలు దొరికే ఏర్పాట్లు చేయబడ్డాయి. ఇవిగాక, మహిళామండలిసభ్యురాండ్రు, శిశుసంరక్షణాలయాల్లో కస్తూర్బాస్మారకనిధిసంఘంలో పని చేస్తున్నారు. ఈ సందర్భంలో శ్రీమతి జ్ఞానకుమారి హెడా చేస్తున్న సేవ చాలా అభినందింప తగ్గది.

వయోజనవిద్యా కేంద్రాలు రజాకార్ల కాలంలో మూతపడినా, తిరిగి గూసారం బాగ్, మల్లేపల్లిలో పనిచేస్తున్నవి. శ్రీమతి హెడాపర్యవేక్షణక్రింద, అంబర్ పేటలో ఒక హరిజనబాలికాపాఠశాల నడుస్తోంది. ప్రభుత్వం, బాధితులసహాయార్థం జరుపుతున్న ప్రతి కార్యక్రమంలోనూ మహిళామండలివారు పాల్గొంటున్నారు.

ఈ సంవత్సరం హైదరాబాదు మహిళలకు భారతనారీలోకానికి - పూజ్యురాలైన శ్రీమతి సరోజనీదేవిమరణం చాలా సంతాపం కల్గించింది. ఆమె హైద్రాబాదుకు రావటం మా కొక పండుగగా ఉండేది. భారతదేశానికి, శ్రీమతి సరోజని, హైదరాబాదు చేకూర్చిన మహాదాలంకారం. ఆమెకు ఆమే సాటి. చివరకు మాకు మిగిలినది సరోజనిమధురస్మృతి.

హైదరాబాదుమహిళాసభ, స్థానికసాంఘిక రాజకీయస్థితుల ఫలితంగా, ఈమాత్రం పనిచేయటమే కష్టం. మహాసభ మహోఘనకార్యాల్ని సాధించగలిగిందని నే ననను. హైదరాబాదు రాజకీయంగా చాలా వెనకపడి ఉంది. రాజకీయరంగాల్లో ఎక్కువమంది స్త్రీలు లేరు. ఇక్కడి మా సోదరీమణులకు వర్ణవిద్వేషాలు లేవు. అతిథిసత్కారంచేయటం మాకు వారసత్వంగా లభిస్తున్న గుణసంపద. త్వరలో హిందూస్త్రీల వారసత్వపుబిల్లును భారతశాసనసభవారామోదిస్తారనే మా ఆశ.

ప్రస్తుతం సంస్థానంలో కొంత స్వతంత్రంతో పనిచేసే అవకాశం లభించింది. ధనికులు, ప్రజాహితసంస్థల్ని ఇతోధికంగా అభిమానించి, సామాన్యులతో కలసిమెలసి ఉండాలని నా విన్నపం. ధనికులు కానివారు కూడా తాము తక్కువవారమనే కించతో ప్రవర్తింపరాదు. స్త్రీకి సంఘంలో ఉన్నతస్థానం లేకపోవచ్చు - వాస్తవానికి ఉన్న స్థానం నీచమైనది కూడా కాదు. అనేకులు స్త్రీలు స్వాతంత్ర్యానికి విముఖులు - ఈ విముఖత్వాన్ని వారు వదలాలి. ఇందుకు మా సోదరులు తోడ్పటం ధర్మం. ఉస్మానియా విశ్వవిద్యాలయంలో విద్యార్థినులకు సరైన వసతులు లేవు. ఈమధ్యనే స్త్రీల కాలేజీని మంచి భవనంలోకి మార్చారు. ప్రభుత్వపు మంచితనం భవనాన్ని మార్చటంతో ఆగిపోదని విశ్వసిస్తున్నాను. సాధ్యమయ్యే సౌకర్యాల్ని సాధించటానికి మహిళాసభ వెనుకాడదు.

హైదరాబాదురాజ్యము - విద్యావిషయములు

శ్రీ మాడపాటి హనుమంతరావు

[హైదరాబాద్ సంస్థానంలో రాజకీయ చైతన్యం కలిగించిన "ఆంధ్ర పితామహులు." హైదరాబాద్ ఆంధ్రమహాసభోద్యమాన్ని ప్రారంభించిన వారు. వీరివద్ద శిష్యరికం నెరపినవారే నేడు సంస్థానంలో కాంగ్రెస్ నాయకులు. అతివాదుల్నీ, మితవాదుల్నీ కూడగట్టుకుని ఉభయుల గౌరవాదరాలు పొందారు.]

హైదరాబాదురాజ్యములో నివసించుచున్న ఒక కోటి 65 లక్షలకు మించిన ప్రజానీకమునకు విముక్తిదిన మనదగు 18 వ సెప్టెంబరు 1948 నాటినుండి గడచిన ఈ ఒక సంవత్సర కాలములో, భారత ప్రభుత్వమువారి యాదేశానుసారము, ఇచ్చటి పరిపాలనము ఒక ప్రత్యేక రాజ్యాంగముక్రింద, సైనిక పరిపాలకుని (*Miltary governor*) యధీనమునందు, సాగుచున్న సంగతి సర్వజనవిదితము. దీని నొకనూతన యుగములోని మొదటి వత్సరముగా భావించవచ్చును. ఈకొలదికాలమున ఇచ్చటి పరిపాలనయొక్క వివిధశాఖలలో మార్పులు జరిగినవి; జరుగుచున్నవి. ఇవి ఈ రాజ్యములోని ప్రజల సుఖమును పెంపొందించు నుద్దేశముతో సాగింపబడుచున్నవనుట కభ్యంతరము లేదు. ఇట్టి మార్పులకు - చాల తృప్తికరముగా గాకపోయినను, కొంతవరకైనను ఆశాజనకముగ - లోబడిన పరిపాలనశాఖలలో విద్యాశాఖ యొకటియై యున్నది.

ప్రత్యేకపరిస్థితులు :

తక్కినవిషయములలో వలెనే, ఈరాజ్యము, విద్యావిషయమునగూడ, చుట్టుప్రక్కలనున్న ప్రాంతములకంటె మొదటినుండియు చాల వెనుకబడియుండినది. గడచిన జనపరిగణనము (1941) నందు, ఈ రాజ్యమున చదువనేర్చిన వారి సంఖ్య సగటున, నూటికి ఏడువరకైనను వచ్చియుండలేదు. ఇట్టి హీనస్థితికి కారణముల వివరించుట కిది సందర్భము కాదు. చెప్పదగిన విషయము, సంగ్రహముగా నేమనిన :—ఇచ్చటి స్థితిగతులు చిరకాలమునుండియు ప్రత్యేకమగు విధానము ననుసరించి ఏర్పడుచువచ్చినవి : రాజ్యములోని పదునారు జిల్లాల మొత్తము భూభాగపు విస్తీర్ణము 82 వేల చదరపు మైళ్లకు మించియున్నది. దీనిలో నూటికి 43 కు కొంచెము హెచ్చుగు విస్తీర్ణము, (1) పాయిగాహాలు, (2) ఎస్టేట్లు, (3) సంస్థానములు, (4) జాగీర్లు మొదలగువానికి సంబంధించియున్నది. వీనివలనవచ్చు ఆదాయమంతయు, వాని ప్రభువులగు అమీర్లు, అధిపతులు, సంస్థానాధీశ్వరులు, జాగీరుదార్లు అనువారికి చెందుచున్నది. అట్టి ఆదాయములో ఇంత భాగము ప్రజలక్షేమముకొరకు వినియోగించవలయునను నిర్బంధము లేదు. అట్టినైతికమగు బాధ్యతయైనను తమ పైన గలదని వారికి స్ఫురించలేదు. ప్రజాక్షేమముకొరకు ఆదాయములోనుండి తగినంతభాగమును ఏల వ్యయముచేయుటలే"దని ఆక్షేపణ జరిగినప్పుడు, ఈ యాదాయము మా కుటుంబ పోషణమునకు ఉద్దేశించబడినదే కాని ప్రజలకొరకు వినియోగించుటకు కాదు. అట్టి నిర్బంధముగాని, నిర్ణయముగాని లేనేలేదని వారు ఘంటాపథముగ చాటుచుండిరి. వారి ప్రజలు, నిజాము ప్రభువుగారితో, తమకు కావలసియున్న విద్యాసౌకర్యములు మొదలైన వానికొరకు, మొరపెట్టుకొనగా, నిజాము ప్రభుత్వమువారు "మీప్రాంతముల ఆదాయమును అనుభవించుచున్నవారే, మీ కొరకు సౌకర్యములను కల్పింపవలయును. మేమునేమియు చేయజాల"మని ప్రత్యుత్తరము చెప్పుచుండిరి. ఈ విధముగా ఈ ప్రత్యేక భూభాగములందు నివసించుచు, మితిమీరిన పన్నులను తమ ఏలికలకు చెల్లించుచున్న జనులు, సర్వసామాన్యములగు విద్యాసౌకర్యములైనను లేక హీనదశకు లోబడియుండిరి. నిజాముప్రభుత్వమువారు, "ఈప్రాంతములందు విద్యా సంబంధమగు అనుకూలమును కల్పించు నధికారము మా విద్యాశాఖకు అప్పగించవలసిన"దనియు, "ఆదాయములో నూటికి పది చొప్పున ద్రవ్యము ఆ శాఖకిచ్చుచుండవలయు"ననియు ఆ ప్రాంతముల ఏలికలకు సూచనలు చేసియుండిరి. ఇది ఎంతలేదనినను పదునేను సంవత్సరముల పూర్వపు ముచ్చట. అయినను, జాగీర్లు మున్నగువాని యజమాన మహాశయులు అందున కంగీకరించక తమ ప్రజలకు అవసరమగు విద్యాసౌకర్యములను తామే కల్పింతుమనిరి: నిజాము ప్రభుత్వమువారు ఉపేక్షించి యూరకుండిరని చెప్పవలయును. ఇట్టి ప్రత్యేకాధికారముల ననుభవించుచు, విద్యావిషయములం దత్యంత దీనావస్థలో నుండిన ప్రజలుగల ప్రదేశములలో, ప్రభువుగారి స్వంతకమతమని చెప్పదగిన "సర్ఫేఖాసు" ఇలాకా కూడ నుండెను. దీనిలో విశాలమగు నొక జిల్లా, "అత్రాపుబల్దా" అనునది. ఈ జిల్లా వైశాల్యము 2551 చదరపు మైళ్లు. జనసంఖ్య 4,99,661. గ్రామముల సంఖ్య 934. పాఠశాలలలో జదువు విద్యార్థుల సంఖ్య 4170. నిజాము ప్రభువు ఈ ప్రాంతమును ఇప్పటి ప్రభుత్వమువారి సలహా ననుసరించి వదులుకొనుటలో సంవత్సరమునకు మూడుకోట్ల రూపాయల ఆదాయమును వదలుకొనిరని తెలియుచున్నది. ఇది కాక, విడివిడిగా అనేక తాలూకాలు ఉండెనని చెప్పినచో, పరిస్థితుల సున్నితము సులభముగా బోధపడగలదు. విద్యావిషయమున నిట్టి దుర్దశకు పాల్పడి, తరణోపాయము నెరుగకయుండిన ఈ విశాలభూభాగమును - రాజ్యములోని నూటికి 43 కు మించిన భూభాగమును - అభివృద్ధినిరోధకమగు పాలనమునుండి తప్పించి, రాజ్యములోని మిగిలిన (నూటికి 56 కు కొంచెము మించియున్న) ప్రాంతములతో గలిపివేసిన మహాత్కార్యము, నా యభిప్రాయమున ఇప్పటి సైనిక ప్రభుత్వమువారు ఈ రాజ్యమునకు చేసిన మహోపకారమై యున్నది. వీనిలోని "సర్ఫేఖాసు" ప్రాంతము, ఇంచుమించు మూడు నెలలక్రిందను, తక్కినభాగము గడచిన నెలలోను, నిజాముప్రభువుయొక్కయు, తదితర పాలక మహాశయులయొక్కయు అధీనమునుండి తీసికొనబడిన సంగతి సర్వజనవిదితము. దీని పర్యవసాన మేమనగా, ముందు రాజ్యములోని ఈ (దాదాపుసగము) భాగములో నివసించువారు గూడ తదితరులవలెనే విద్యాసౌకర్యముల ననుభవించుభాగ్యము గాంచుచున్నారు!

సంస్కరణములు :

గడచిన ఈ యొక సంవత్సర కాలములో, అధికారము వహించియున్న సైనిక ప్రభుత్వము వారిదృష్టి విద్యాశాఖ (*Dept of Education*) పైన తగినంత ప్రసరించలేదనియే స్పష్టముగా దోచుచున్నది. ఈ శాఖపైన నధికారము వహించియున్న ఒక మంత్రివర్యులు మాత్రము క్రొత్తవారు; మిగిలినవారందరు దాదాపు అందరును అనుట న్యాయమేమో - వెనుకటివారే! జాతీయనిర్మాణకార్యమున కత్యంత ముఖ్యమగు ఈ శాఖ ఇంకను నేటి ప్రభుత్వమువారి దృష్టిని తగినంత యాకర్షించకపోయెనే యని విచారపడుచున్నవారు ప్రజాక్షేమము గోరువారిలో ఎందరో కలరని ఎరుగుదుము! ఇది చాల దురదృష్టముగా గానవచ్చును అయినను, ఈసంవత్సర కాలములో, ఎక్కువ క్రియాపూర్వకముగా గాకపోయినను, వాగ్దానాదిరూపముల బయట పడిన సంస్కరణములను ఉల్లేఖించకుండుట న్యాయము కాదుకదా?

ప్రారంభవిద్య

రాజ్యములో నున్న గ్రామముల మొత్తము సంఖ్య 22 వేల 5 నూర్లు. వీనిలో 17 వేల ఊళ్లలో పాఠశాలలు లేవు. ఇప్పుడు పాలించుచున్న ప్రభుత్వమువారు ఈ లోపమును గ్రహించి, రాబోవు ఏడు సంవత్సరముల కాలములో 8 వేల క్రొత్త ప్రారంభవిద్యాలయములు



స్థాపింపవలయునని నిశ్చయించినట్లు తెలియుచున్నది. ఈ సంవత్సరము వీనిలో ఎనిమిదినూర్ల పాఠశాలలు (రెండువందలు ఇద్దరిద్దరు పంతుళ్లు గలవియు, ఆరువందలు ఒక్కొక్క పంతులు గలవియు) స్థాపించెదరట. వీటికొరకు 9 లక్షల రూపాయలు వ్యయమగునని అంచనా వేయబడినది. ఇది జరిగినచో, గొప్పవిషయమే. అయినను వీనిలో ఎక్కువభాగము, క్రొత్తగా మన ప్రభుత్వము క్రిందకు తేబడిన సర్ఫేఖాసు జాగీర్లు మున్నగు నూటికి 43 వంతునున్న భూభాగములకు చెందవలసియుండును. విద్యాశాఖవారి పాఠశాలలను పంచిపెట్టుటయందు సరియైన విచక్షణను ఉపయోగించెదరో, లేదో, చూడవలసియున్నది. యీ కార్యమును జయప్రదముగా నిర్వహించుటలో ఆటంకముగా నున్న విషయమొకటి కలదు. అది తర్ఫీతు పొందిన (*trained*) ఉపాధ్యాయులు తగినంతమంది లేకపోవుటయే యని గ్రహింపదగినది. ఇప్పుడు విద్యాశాఖ క్రిందనున్నట్టు తర్ఫీతు పొందిన ఉపాధ్యాయుల సంఖ్య నూటికి 60 మాత్రమేయట. వీరిలో ఎక్కువమంది మాధ్యమిక (*middle*) మరియు ఉన్నత (*High*) పాఠశాలలలోనే యున్నారేమోయని నాసందేహము. ఈ విధముగా జూచినచో, ప్రారంభ విద్యావ్యాప్తికిగల యాటంకము త్వరలో తీరునది కాదని స్పష్టమగును. ఏలయన ట్రైనింగు పొందిన ఉపాధ్యాయినులయొక్కయు ఉపాధ్యాయులయొక్కయు సంఖ్య త్వరలో పెరుగునది కాజాలదు.

మాధ్యమిక-ఉన్నతవిద్య

క్రొత్త ప్రభుత్వమువారు చేసిన మరియొక ఉపకారము, నూతనవిద్యావత్సరమునుండి—అనగా జూన్ 1949 నుండి—ప్రభుత్వపాఠశాలలోని మూడుతరగతులలో—ఐదవ, ఆరవ, ఏడవ తరగతులలో, లేక, మొదటి, రెండవ. మూడవ ఫారములలో—బాలబాలికల మాతృభాషను గూడ ప్రధానబోధన భాష (*Mediem of-instruction*) గా నేర్పరచుట. పూర్వము ప్రారంభవిద్యలో తప్ప, పై తరగతులలో బోధనభాష ఉర్దూయే ఉండేది. కొలది సంఖ్యగల ఉన్నతపాఠశాలల (*High schools*) లో మాత్రము బోధన ఇంగ్లీషుభాషలో జరుపబడుచుండెడిది. ఇప్పుడు విద్యాశాఖ వారు, తెలంగాణమునందు తెలుగులోను, మహారాట్వాడీ జిల్లాలలో మహారాష్ట్రములోను, కన్నడ జిల్లాలలో కన్నడ భాషలోను, పై మూడు తరగతులందు వివిధ విషయములను బోధింప ననుజ్ఞయిచ్చిరి. ఈ సంస్కరణము ఇప్పుడిప్పుడే అమలులోనికి వచ్చుచున్నది. "ఇది ఉదార సంస్కరణము కనుక ఈ సంవత్సరము నుండియే దీనిని ఆరవఫారము తుదివరకు ఆచరణలో పెట్టవలసి"నదని హైదరాబాదు రాజ్యపు ఆంధ్ర సారస్వతపరిషత్తువారు, గౌ॥ విద్యామంత్రిగారిని కోరిరి. కాని వారిప్పుడు "ఈ సంస్కరణకు అంతటి వైశాల్యము కలిగించ వీలులే"దనియు "రాబోవు సంవత్సరమున దీనిని నాల్గవ, ఐదవఫారములకును, ఆ పై సంవత్సరము ఆరవ ఫారమునకును వ్యాపింపజేయుదు" మనియు వాగ్దాన మొనర్చిరి. కనుక ఈ సంస్కరణము విషయమున కూడ ఇప్పుడే చెప్పదగిన మేలు కలుగలేదు.

విశ్వవిద్యాలయ విద్య

ఇక విశ్వవిద్యాలయవిధానమునందు ఈ సంవత్సరమున జరిగిన మార్పులేమి కలవో విచారింతము. గడచిన డిశంబరులో (1948) భారత ప్రధానమంత్రి పండిత జవాహర్లాలు నెహ్రూ గారు హైదరాబాదు విజయముచేసియుండిరి. ఆ సందర్భమున ఉస్మానియావిశ్వవిద్యాలయపు వైసు చాన్సెలరుగారు రెండుప్రకటనముల సల్పియుండిరి : (1) ఈ విశ్వవిద్యాలయమున ప్రారంభమునుండి - గడచిన 28 సంవత్సరముల దీర్ఘకాలమున - బోధనభాషగానుండిన ఉర్దూకు బదులు హిందూస్థానీని (ఫారసీ, దేవనాగరి అను) రెండు లిపులలోను నెలకొల్పుట: (2) తెలంగాణములోని కాలేజి (వరంగల్లు) నందు తెనుగును, మహారాట్వాడీలోని ఔరంగాబాదునందున్న కాలేజిలో మహారాష్ట్రమును, కర్ణాటకజిల్లాలలోని దగు గుల్బర్గాకాలేజీలో కన్నడమును (ఇప్పుడున్న ఉర్దూభాషకు బదులు) ప్రధానబోధన భాషలుగా నేర్పరచుట: ఈ రెండువరములు గొప్పవే; సంకల్పములు ఉదారములేకాని, అమలు జరుగలేదు. క్రొత్త విద్యావత్సరమారంభమై మూడు నెలలు కావచ్చుచున్నది. పైరెండు సంస్కరణలు ఎప్పుడు ప్రవేశపెట్టబడునో చెప్పవీలులేదు.

ఇంకొక సంస్కరణము విశ్వవిద్యాలయ పరీక్షాప్రణాళికనుండి మతవిద్యను తొలగించుట. గడచిన 28 ఏండ్లలో, ఉస్మానియావిశ్వవిద్యాలయపు పరీక్షలకు మహమ్మదీయ విద్యార్థి విద్యార్థినులకొరకు - ముఖ్యముగా నిజాము ప్రభువుగారి ప్రత్యేక మతశాఖయగు "సున్నీ"లకు - మత విద్యనిర్బంధముగా నుంచబడినది. తక్కినవారందరికి, - అన్ని మతములవారికి - మతవిద్య కూడదని నీతివిద్య నిర్బంధముగా చేర్చవలయునని విధియుండెను. ఈనిర్బంధము ఇప్పుడు తొలగింపబడినది. దీనితోపాటు, దేశభాషలగు ఆంధ్రమహారాష్ట్ర కర్ణాటకములకు, ఆయాభాషలు మాతృభాషగాగలవారు, చదివి పరీక్షయియ్యవలయునను నిర్బంధము కల్పింపబడినది. ఈచిన్న సంస్కరణమునందును కొన్ని లోపములు కలవు. ఆ వివరములనిప్పుడు చర్చించ దలచలేదు. మొత్తము మీద, వైసుచాన్సెలరుగారు హైదరాబాదు ఆంధ్రసారస్వతపరిషత్తు రాయబారవర్గము వారి ప్రార్థనమును అంగీకరించి ఈమాత్రపు మేలు చేకూర్చినందునకు వంద్యులు

గొప్ప మార్పు

ఇంతకు పూర్వము ఈ విశ్వవిద్యాలయమువారు, ప్రైవేటు కళాశాలలను అంగీకరించ (*recognize*) మని పట్టు పట్టియుండిరి. గడచిన అయిదారువత్సరములలో మూడు పర్యాయములు స్థానికములగు సుప్రసిద్ధసంస్థలవారు, ఉర్దూబోధన భాషగా నుంచుట కొప్పుకొనుచు, కాలేజీలను స్వంతవ్యయములతో స్థాపింతుమనియు వానిని విశ్వవిద్యాలయము వారంగీకరించవలయు

(26-వ పేజీ చూడుడు)

ఆసఫ్‌జా వంశచరిత్ర

(21-వ పేజీ తరువాయి)

చేశాడు. రాజ్యానికిరాగానే కర్ణాటకంమీదికి దండెత్తాడు. కాని క్లైవ్‌ను చూసి వెనక్కు తిరిగాడు. 1766 లో ఉత్తర సర్కారులు కంపెనీ వారికిచ్చేటట్టూ,కుంపిణీవారు ఇందుకు బదులుగా నిజాంకు అవసరమైనప్పుడు సైనికదళాలు సరఫరాచేయటం, యుద్ధావసరం లేనప్పుడు ఏటేటా 9 లక్షలు రొఖం ఇచ్చేటట్లూ నిజాం ఒప్పందం చేసికొన్నాడు.

కుంపిణీసేనల సరఫరా జరగిందిగాని నిజాం మైసూరునవాబ్ హైదరాలీతో కలిసి బ్రిటిష్ వారిని ఎదిరించాడు. నిజాం ఓడిపోయి కుంపిణీ వారితో సంధిచేసుకొన్నాడు.

నిజాం తరఫున సర్కారులలో ఉన్న నవాబు, నిజాం తమ్ముడు బసాలత్ జంగ్ 1782 లో చనిపోయాడు. కాని 1788 దాకా కూడా సర్కారులు కుంపిణీవారి స్వాధీనం కాలేదు. కుంపిణీవా రియ్యవలసిన పేష్కసు బాకీ పడింది. 1790 లో కుంపిణీవారితోనూ పీష్వాలతోనూ కలిపి, మళ్లీ నిజాం సంధిపత్రాలు వ్రాసుకొన్నాడు. మహారాష్ట్రులు మళ్లీ నిజాంను కప్పం ఈయమని ఒత్తిడి తెచ్చారు. ఇంగ్లీషు వారు ఇటూ అటూ పలకలేదు. ఫ్రెంచివారి సహాయంతో నిజాం, మహారాష్ట్రులమీదికి దండెత్తాడు. కాని కుర్దాయుద్ధంలో పూర్తిగా ఓడిపోయాడు. ఆ రోజుల్లో స్త్రీల పటాలాలు కూడా నిజాంకు రెండుపటాలా లుండేవిట. వాళ్లు చాలా గొప్పగా యుద్ధంచేసేవారట.

1798 లో టిప్పుసుల్తాన్‌ను ప్రతిఘటించటానికి నిజాం, మహారాష్ట్రులు, కుంపిణీవారు ఏకమయ్యారు. దీనికై ఏటా నిజాం 24,17,100 రూపాయలు వార్షికం ఇచ్చుకోవలసి వచ్చేది. టిప్పుసుల్తాన్ పతనంకాగానే, అతని రాజ్యాన్ని ముగ్గురూ పంచుకొన్నారు. నిజాంను కాపాడేందుకు మళ్లీ కొత్త సంధిపత్రం వ్రాసుకొని, అతని కియ్యవలసిన పేష్కసు హెచ్చించి 1799 లో, కర్నూలు కడప బళ్లారులను కూడా తమ ఫర్మానాలో కలుపుకొన్నారు. నిజాం అలీఖాన్ నలభైఏళ్లు రాజ్యంచేసి, 1803 లో చనిపోయాడు.

ఇతని తర్వాత సికందర్‌జా పోటీ లేకుండా సింహాసనానికి వచ్చిన మూడవ నిజాం. ఇతని కాలానికి మహారాష్ట్ర యుద్ధాలు పూర్తి అయిపోయాయి. గత నూరేళ్లుగా యుద్ధాలతో దేశం చితికిపోయింది. ఇప్పటినుంచి శాంతియుతంగా రాజ్యపాలనంవైపు దృష్టి మరలించేందుకు నిజాంకు అనువైంది. 1822 లో నిజాం పరిపాలన విషయాలను సరిజూచేందుకు బ్రిటిష్‌వారు సర్ మెట్కాఫ్ అనే రెసిడెంటును ప్రప్రథమంగా హైదరాబాద్‌లో నియమించారు.

నిజాం సికందర్ జా 1829 లో మరణించాడు. ఇతని తర్వాత ఇతని కుమార్డు నాసిరుద్దౌలా బహద్దరు సింహాసనానికి వచ్చాడు. ఇతని కాలంలో అరేబియాలో, వాహబ్ తిరుగుబాట్లు జరిగాయి. నిజాం తమ్ముడు ముబారిజుద్దౌలా కూడా సంస్థానంలో బ్రిటిష్‌వారిని కూలదోసేందుకు కుట్ర చేస్తున్నాడని బయల్పడింది. 1839-లో అతన్ని ఖైదీచేశారు.

నాసిరుద్దౌలా కాలంలోనూ పరిస్థితు లంతగా బాగుపడలేదు. సంస్థానంలో ధనం లేక జీతగాళ్ళు ఇబ్బంది పడసాగారు. కుంపిణీవారివద్ద కోటిరూపాయలు,సంస్థానంవారుఅప్పులు తీర్చేందుకు బదులు తీసుకొన్నారు. ఇందుకు మింజుమలె ఏటా 17 లక్షల రాబడిఉన్న సంస్థాన భాగాన్ని కుంపిణీవారి కిస్తామన్నారు.

1853 లో బీరారు, షోలాపూర్‌వరకు సరిహద్దుజిల్లాలు, కృష్ణా తుంగభద్రలమధ్య ఆబ్, (దీనిమీద ఏటా 50 లక్షల ఆదాయం వచ్చేది)నిజాంనుంచి బ్రిటిష్‌వారిపర మయ్యాయి.

1857 లో నాసిరుద్దౌలా చనిపోగా కుమారుడు నవాబ్ అఫ్‌జల్ ఉద్దౌలా నిజాం అయాడు. ఇతను రాజ్యానికి వచ్చేటప్పటికి సిపాయి మ్యూటినీదినాలు. ఈ విప్లవంలో నిజాం బ్రిటిష్ వారికి అండగా నిలిచాడు. సిపాయివిప్లవం ముగిసేటప్పటికి, కుంపిణీపోయి, బ్రిటిష్‌సామ్రాజ్యం తయారయింది. బ్రిటిష్ వైస్‌రాయి నిజాంను గౌరవించి అతని స్థానం అతనికి నిలిపాడు. 1869 లో అఫ్‌జల్ ఉద్దౌలా చనిపోయాడు. 1869 నుంచి ఆరవ నిజాం, నవాబ్ మీర్ మహబూబ్ అలీఖాన్ నిజాంగా 1911 దాకా పాలన మొనర్చి బ్రిటిష్‌వారి మన్నన లందాడు. 1911లో ఏడవ నిజాం, నవాబ్ మీర్ ఉస్మాన్ అలీఖాన్ బహద్దూర్ రాజ్యానికి వచ్చాడు. ఆసఫ్‌జాహీ వంశంలో హైదరాబాద్‌కు ఈఏడుగురునవాబులు నిజాం ఉల్ముల్కు బిరుదంతో పరిపాలించారు.

భారతదేశ ఆర్థికవ్యవస్థలో హైదరాబాద్ సమీకరణ

(10 వ-పేజీ తరువాయి)

కాలు, సెంట్రల్ ఎక్సైజ్, రైల్వేలవల్ల రాబడి, ప్రత్యక్షసుంకాలవల్లనే వస్తోంది. ఈ రాబడి పోగొట్టినట్లయితే హైదరాబాద్ ప్రభుత్వ ఆర్థికనిర్మాణం కూలిపోతుంది. దీన్నిబట్టి అక్కడి పన్నులవిధానం ఎంత అస్థిరమైనదో గ్రహించవచ్చును. ఇతర పన్నులు విధించి రెవిన్యూ ఇంకా చాలా రాబట్టవచ్చుననే దొక్కటే హైదరాబాద్‌లో మంచి విషయం. ఆ రాబడికీ, మద్యం పైన పన్ను విధించడానికీ మున్ముందు రాబోయే ప్రభుత్వం ప్రయత్నించవలసి ఉంటుంది. మిగతా ప్రాంతాల్లోపన్నుల విధానాన్నే ఇక్కడా అనుసరించవలసి ఉంటుంది. దానికి తగినట్లు పన్నుల విధానాన్ని ఇక్కడ పూర్తిగా సంస్కరించాలి.

ప్రత్యేకసైన్యం:

హైదరాబాద్‌లో ప్రత్యేక సైన్యాన్ని నియోగించినందువల్ల ఖర్చు అపారంగా ఉంది. దీన్ని పూర్తిగా రద్దు పరచడమో లేక తగురీతిని తగ్గించడమో యోచించాలి. ఈవిషయాన్ని కూడా యూనియన్ ప్రభుత్వం, సంస్థాన ప్రభుత్వాలమధ్య ఆర్థిక వ్యవహారబాంధవ్యాల సంస్కరణలోనే విచారించాలి.

దీనివల్ల ఈ సంస్థానంలో ఆర్థిక స్వయం పరిపాలన అనేది ఊహామాత్రమే కాని వాస్తవం కాదని బోధపడుతుంది. భారతదేశంలో అంతర్భాగంగా కలిసిపోవాలంటే, నూత్నవ్యవస్థలో హైదరాబాద్ ఉచితస్థానం ఆక్రమించాలంటే ఆర్థికంగా విలీనం కాక తప్పదు. ఎలా లీన మవుతోందో యూనియన్ ప్రభుత్వం, రాష్ట్ర ప్రభుత్వాలమధ్య సంబంధాలనుబట్టే నిర్ణయించబడుతుంది. ప్రత్యేక ద్రవ్యచలామణి, రహదారీ సుంకాలు, ప్రత్యేక తపాలాశాఖమొదలైన ప్రత్యేకతలన్నీ రద్దయిపోవలసిందే. పన్నుల విధింపు ఇతర ప్రాంతాలలోవలె సంస్కరించబడాలి. ఇతర రాష్ట్రాలకూ సంస్థానాలకూ కేంద్రప్రభుత్వంతో ఎట్టి సంబంధ బాంధవ్యాలుంటాయో అలాంటి సంబంధబాంధవ్యాలే హైదరాబాద్‌కీ ఏర్పడాలి. ఈ మార్పులవల్ల కొన్ని శాఖల రాబడిలోపం, కొన్ని కొత్తరాబడి పన్నుల విధింపు మొదలైన మార్పులు అవసరమవుతాయి. యూనియన్ ప్రభుత్వానికీ హైదరాబాద్ ప్రభుత్వానికీ మధ్య ద్రవ్య వ్యవహారాల సమర్థన జరగాలి. దీనివల్ల ఆర్థికంగా సంస్థానంలో పెద్ద కల్లోలం వస్తుందని భయపడవలసిన అవసర మేమీ లేదు. ఇతర ప్రాంతాలలోవలెనే హైదరాబాద్‌లో కూడా ఆర్థిక సుస్థితనే భారతప్రభుత్వం కాంక్షిస్తుంది.

ప్రజల్లో దారిద్ర్యాన్ని, అనారోగ్యాన్ని దైన్యాన్ని, అజ్ఞానాన్ని నివారించి ఆర్థిక సుభిక్షం లభింపచేయడానికిగాను దేశీయార్థిక వ్యవస్థను సుశిక్షితమార్గాలలో సంస్కరించడమే భారతప్రభుత్వం అనుసరించగల విధానం. ఆర్థిక సంపద్వృద్ధి కార్యక్రమాల్ని అమలు జరపాలంటే, అన్ని ప్రాంతాలకూ సమవిధానం నిర్ణయించబడాలి. వివిధప్రాంతాలు తదను గుణమైన పద్ధతుల్ని అనుసరించవలసి ఉంటాయి. యావత్తు దేశానికి హితకరమైన కార్యకలాపాల్లో హైదరాబాద్ పాల్గొనకుండా విడివడి ఉండదు; ఉండలేదు.

రాజకీయరీత్యానే గాక ఆర్థికరీత్యాకూడ ప్రత్యేకపంథావిడిచి సర్వజనులకూ శ్రేయోదాయకమైన సక్రమ వ్యవస్థలో అంతర్భాగంగా తన భవిష్యత్తుకూడా ఆశాద్యోతకంగా ఉండగలదని హైదరాబాద్ ప్రజలు దృఢవిశ్వాసంతో ఉండవచ్చును.

ఫణిగిరి- బౌద్ధఆరామ శిథిలాలు

(తరువాయి)


నన, వర్చస్వియైన పురుషుని రూపము చిత్రించబడియున్నది.

పలకకుడివైపు ముఖమునకూడ రెండవదానిలోవలెనే యున్నదికాని, ఇచట పద్మము క్రింద పురుషునిబదులు, సింహము చెక్కబడియున్నది.

ఈ శిథిలములో దొరకిన మానవచెక్కడము, కుడ్యశిల్పమువలె నున్నది. దీనిలో విగ్రహము వామనరూపుడైన బొజ్జయ్యరూపమువలె, నేటి కార్టూన్ శిల్పములవలె నున్నది. ఈ విగ్రహమునకు చెక్కిన అలంకరణములు, నిండైన బొజ్జ ఇవి, ఇది కుబేరునిస్వరూపమునకు వ్యంగ్యశిల్పమేమోనని యనిపించుచున్నది. విగ్రహమురూపురేఖలు దాక్షిణాత్యవిధానములోనే ఉన్నవి. ముఖమున భావప్రకటనము, విగ్రహముఅంగవిన్యాసము, ఉత్తమశిల్పలక్షణములను ప్రకటించుచున్నవి.

ఫణిగిరిలో, దొరికిన నాణెములలో ఆంధ్రరాజులవి అరువదినాల్గునాణెము లున్నవి. ఇవన్నియు సీసముతో చేయబడిన నాణెములు. క్రీ. శ. 2 వ శతాబ్దపు నాణెములుకూడ మరికొన్ని దొరికినవి. ఈ నాణెములు ఫణిగిరి ఆరామకాలమును నిరూపించు తక్కిన చారిత్రకపరిశోధనలను బలీయమొనర్చుచున్నవి.

ఒకనాడు దక్కన్‌లో ప్రబలముగా వెలిగిన ఆంధ్రసామ్రాజ్యవైభవమును ఈ నాణెములు వేనోళ్ల చాటుచున్నవి. వీటిని బాహిరపరచి పూర్వచరిత్రను పండితలోకమున కందించుట మా విధాయకధర్మము. మనపూర్వచరిత్రసవరణలో, ఫణిగిరిశిల్పసంపద అపారముగా నుపయోగించగలదని ఆశించుచున్నాము.



పోలీసుచర్య శాంతంగా ముగిశాక, భారతప్రభుత్వానికి హైదరాబాదు పౌరులతరఫున, వందన సమర్పణోత్సవం జరుపుతూన్న శ్రీ జమ్మలాపురం కేశవరావుగారు.

తానీషా, అక్కన్న, మాదన్నలు

(2 వ పేజీ తరువాయి)

క్షేమమూ, రాజ్యక్షేమమూ సర్వదా కోరుతూ, ప్రాణాలర్పించగలరని గ్రహించాడు. మాదన్న ఉపాయబలంతో, మూసాఖాన్, మహల్దార్లిద్దరికీ తగవులు పెంచి, తానీషా ముందే వారు ఔచిత్యం తెలియకుండా ప్రవర్తించే అదను కనిపెట్టి వారిద్దరినీ ఖైదుచేయించాడు. మాదన్నకు "సూర్యప్రకాశరావు" అనే బిరుదు ఇచ్చి మహామంత్రినిచేసి, రాజ్యభారం అంతా అతని కప్పగించి, ఒక కంట కనిపెడ్తూనే, తన వేదాంతసాహిత్యాదిగోష్ఠీకలాపాలలో తాను శాంతంగా కాలం గడుపుతూండేవాడు. అక్కన్న మహాసేనాపతి. మాదన్న తమ్ముడు వెంకన్న "రుస్తుంరావు" అని బిరుదుతో ఫౌజుదారు. వీరి మేనల్లుడు గోపన్న (రామదాసు) భద్రాచలం తహసీల్దారు. ఈ విధంగా మాదన్న మహామంత్రి ఎదురులేని వైభవంతో గోల్కొండసామ్రాజ్యమునంతా సుభిక్షంగా ఏలుతూండేవాడు. ఆనాటి గోల్కొండసామ్రాజ్యం అంటే ఉత్తరాన్న కళింగదేశంవల్లనుంచీ దక్షిణాన పుదుచ్చేరివరకూ తెలుగునాడుఅంతా విస్తరించి ఉండేది.

మాదన్న విదేశాంగనీతిలో దిట్ట. గోల్కొండసుల్తానులు ఒకమాదిరిగా ఔరంగజేబుకు సామంతులుగానే కప్పంచెల్లిస్తూ ఉండేవారు. బీజాపురంవారితోనూ బాంధవ్యాలు మిగుల్చుకోవలసి వచ్చేది. దక్షిణాన శివాజీ ప్రబలుడై దక్షిణమంతా కొల్లగొట్టుతున్నాడు. ఔరంగజేబుతో చెలిమి కప్పకు పాముకు చెలిమి. ఏనాడు కబళిస్తాడో తెలియదు. దగ్గర శత్రువు కాగలవాడు శివాజీ. మాదన్న తానీషాశివాజీలకు మైత్రి కలిపాడు. శివాజీ గోల్కొండకు అండగా నిలబెట్టూ, దక్షిణాన్న కొల్లగొట్టిన సామ్రాజ్యంలో గోల్కొండవారికికూడా ధనమూ, రాజ్యమూకూడా పంపకం చేసేట్టూ, ఇందుకుగాను, శివాజీకి తానీషా, కొన్నిలక్షలు వరుమానం చెల్లించేటట్టూ శివాజీతానీషాలమధ్య, మాదన్న ఒప్పందము కుదిర్చాడు. ఔరంగజేబుకు ఈవిషయం తెలిసి గోల్కొండవారిపై కారాలు మిరియాలు నూరాడు. గోల్కొండలో తన ప్రత్యేకరాయబారిని నియమించి, తానీషాను అదుపులోపెట్టమని ఆజ్ఞలిచ్చాడు. బీజాపూర్ గోల్కొండలపై దండయాత్రలకు ఎప్పటికప్పుడు సన్నాహంలోనే ఉండేవాడు.

మాదన్న గోల్కొండసామ్రాజ్యానికి అపాయంరాకుండా ఎప్పటికప్పుడు తన రాజనీతి చతురత నుపయోగించి జాగ్రత్తగా ఉండేవాడు. విదేశీవర్తకులకు, సదుపాయాలూ అవీ జాగ్రత్తగా చూస్తూ వారి విషయంలో తగు జాగ్రత్త అవలంబించేవాడు.

కాని మాదన్న పరిపాలన కొందరు స్వార్థపరులైన దర్బారీయులకూ, అంతఃపురస్త్రీజనానికి గిట్టకుండా ఉండేది. తానీషాతో ఎన్నో పితూరీలు చెప్పేవారు. కాని తానీషా వారిమీద విశ్వాసాన్ని చివరిదాకా గోల్పోలేదు. ఆ సమయంలోనే గోపన్న భద్రాచలం తాలూకా తహసీలు ఖజానాకు పంపకుండా, స్వయంగా సాహసం చేసి, భద్రాచలంలో ఆరులక్షలు పెట్టి శ్రీరామాలయం కట్టించాడు. అక్కన్నమాదన్నల మేనల్లుడు ఇల్లా స్వతంత్రించటంకూడా విరోధులకు మాదన్నమీద చాడీలు చెప్పటానికి ఆస్కారమయింది. గోపన్నను ఖైదుచేశారుగాని, చివరికి తానీషాయే అతన్ని విడిపించి, భద్రాచలరామాలయానికి ఏటేటా తన కానుకలుకూడా పంపసాగాడు.

మాదన్న శివాజీమీద పెట్టుకొన్న ఆశలు విఫలమయ్యాయి. శివాజీ గోల్కొండవారు ఇచ్చినవన్నీ పుచ్చుకొని కిమ్మనకుండా మాట్లాడక ఊరుకొన్నాడు. అతని మాట చెల్లించుకొనేందుకు అతనికి అవకాశం కుదరలేదు. ఇంతలో అతనూ స్వర్గస్థుడయ్యాడు.

మాదన్నఅక్కన్నల వైభవం తక్కినవారికి చాలాకంటకమయింది. ఈలోగా బీజాపూర్‌పై ఔరంగజేబు దాడివెడలినాడు. "బీజాపూర్‌కు సహాయముచేసిన గోల్కొండపని సున్న"యని తానీషాకు ఖబురుచేశాడు. గోల్కొండవారు రహస్యముగ బీజాపూరుకు సహాయము చేయక తప్పలేదు.

ఔరంగజేబుకు గోల్కొండ ఆక్రమించుకోవాలని దురాశ పుట్టింది. గోల్కొండ సుల్తాన్ కాఫిర్ అనీ కాఫిర్ అయిన మాదన్న చేతిలో కీలుబొమ్మయి, దుర్వ్యసనాలలో ఒడలు మరచాడనీ ప్రచారము సాగించాడు. రాయబారితో తానీషాతో కజ్జా తెచ్చుకోమని పురికొల్పాడు.

అప్పట్లో అత్తెమత్తరాయడు అనేదర్బారీయుణ్ణి అక్కన్న అగౌరవపరచాడు. మాదన్న తెలుసుకొని అతన్ని శాంతింపచేయ ప్రయత్నించాడుగాని అతను ఆ పగ అట్టే నిలబెట్టుకొన్నాడు. గోలుకొండలో సామ్రాజ్యానికి ప్రభుత్వానికి విరుద్ధంగా కుట్రలు ప్రారంభమయాయి.

మొగలాయీలు గోల్కొండపై దండెత్తి వచ్చారు. అత్తెమత్తరాయడు మాదన్నపైనా తానీషాపైనా సేనానులలో ద్వేషాలుకల్పించాడు.

ఔరంగజేబుకుమారుడు షా అలం గోల్కొండను ముట్టడించాడు. తానీషా కప్పము కట్టూ రాయబారాలు నడిపాడు. అక్కన్నమాదన్నలను తొలగించాల్సిందని, ఔరంగజేబు ఫర్మానా. అక్కన్నమాదన్నలు స్వయంగానే సుల్తాన్‌కు వీడ్కోలుచెప్పి మంత్రిపదవినుండి వైదొలగారు. ఆ తర్వాతఒకనాడు బంగారుపల్లకీలలో అక్కన్నమాదన్నలు బైటికి వస్తూండగా అత్తెమత్తరాయని సిఫాయీలు, వారి పల్లకీలను అడ్డగించి, ఇద్దరు మంత్రుల తలలు తటాలున నరికి, వారి దేహాలను నేలపై ఈడ్చుకొంటూపోతూ వారి బంధువులు మొదలైన హిందువులున్న పేటలమీదికి పోయి ప్రజలను చిత్రవధ చేశారు. మాదన్నకు పిల్లలులేరు. అక్కన్న కొడుకు మల్లన్న. ఒకమురు, తురక, మాదన్నభక్తుడు, ఈ బిడ్డను పాత్తిళ్లలో దాచి, జాగ్రత్తగా అక్కడనుంచి దాటించి కాపాడాడు.

అక్కన్న మాదన్నల మృతికి తానీషా చాలా విచారించాడు. తన సోదరులలాగా వారిని చూచాడేతప్ప అతని ద్రోహ మేదీ లేదు.

తర్వాత తానీషా ఔరంగజేబుకు లొంగిపోతూ కమ్మ వ్రాశాడు. మొగలాయీలు గోల్కొండను స్వాధీనంచేసికొన్నారు. తానీషాను దౌలతాబాద్‌కోటలో ఖైదీని చేశారు. ఖైదీగా అక్కడే పదునాలుగేళ్లుండి, అక్కడ క్రీ. శ. 1702 లో చనిపోయాడు.

హైదరాబాదు ఆర్థికాభివృద్ధి

(6-వ పేజీ తరువాయి)

వాన్ని దృష్టిలోనుంచుకొని ప్రవర్తించాలి. వ్యవసాయంకూడా ఇతరవృత్తులవలె, లాభకరమైనదేనని, దాస్యవృత్తి కాదని, ప్రభుత్వం ఋజువు చేయాలి. వ్యవసాయం అభివృద్ధి అయినకొలదీ పశుసంపదకూడా అభివృద్ధి చెందుతుంది. ఆదర్శ వ్యవసాయం, పశుపోషణ, వస్తువినియోగం – ప్రజల్లో వ్యాప్తం చేయటానికి ప్రాజెక్టుల నిర్మాణంతో, చక్కటి అవకాశం లభిస్తుంది.

వ్యవసాయానికి నీ రెంత అవసరమో, ఎరువులు కూడా అంతే. మన దేశంలో వంటచెరకు సప్లయిని ప్రభుత్వమే కొనసాగించని ఫలితంగా అడవులు నిరుపయోగం కావటం, పెండ (పేడ) దురుపయోగం కావడం మన మంతా ఎరిగిన విషయమే. సంస్థానంలో అడవులు కొల్లలుగా ఉన్నాయి. అయినా పశువులిచ్చే ఎరువును తగలపెట్టక తప్పటంలేదు. కట్టెల్ని ప్రభుత్వమే చౌకగా సప్లయిచేసి, ఎరువును జాగ్రత్తచేయమని ప్రజల్లో ప్రచారం చేయటం చాలా ముఖ్యం.

ఆపైన – ఇక్కడ భారతదేశంలో ఉత్పత్తి అయ్యే నూనెగింజల మొత్తంలో నాలుగో వంతు ఉత్పత్తిఅవుతున్నది. స్థానికంగా ఉత్పత్తి అవుతున్న వేరుశనగలో రెండు భాగాలు మాత్రమే నూనెమిల్లుల్లోకి వెడుతోంది. మిగిలింది ఎగుమతి అవుతున్నది. ప్రత్తి గింజలనుంచి నూనెను తీయుటేలేదు. ఆముదాలపై రావాల్సినంత ఆదాయం లేదు. నూనెపరిశ్రమను పెట్టేట్లయితే, ఎరువుకు పనికొచ్చేపెండి పుష్కలంగా లభించటమేగాక, అనేక ఇతర లాభాలు కూడా ఉన్నాయి. రంగులు, వార్నిషులు తయారుచేయవచ్చు. కృత్రిమనెయ్యిని ఉత్పత్తిచేయవచ్చు. ఆముదం యంత్రాలకు ఉపకరిస్తుంది. ఇన్నాళ్లనుంచి ప్రభుత్వంవారు, బోలెడు ఆదాయంవచ్చే, నూనెగింజల పరిశ్రమను ఎందుకు అశ్రద్ధచేశారో అర్థంకాకుండా ఉంది. సంవత్సరానికి 774 వేల టన్నుల వేరుశనగ, మిగిలిన నూనెగింజలు రెండులక్షలటన్నులు ఉత్పత్తి అవుతున్నాయి. కొంత జాగ్రత్త వహిస్తే, ఈ ఉత్పత్తి ఇంకా పెరుగుతుంది. ప్రస్తుతం 76 ఎక్స్‌పెల్లర్లు – పాతకాలంనాటివి పనిచేస్తున్నయ్యి. ఈ పరిశ్రమను వెంటనే అభివృద్ధిచేయబూనుకోటం అవసరం.

ప్రత్తి

ప్రత్తిపంటకు అనుకూలమైన భూసారం కల ప్రాంతం సంస్థానంలో చాలా ఉంది. దాదాపు 170 లక్షల పౌనుల ప్రత్తి పండుతోంది. ఇక్కడి ప్రత్తి చాలా మేలురకపుది. ప్రత్తిని శుభ్రపరచి బేళ్లుగా కట్టే చిన్నచిన్న మిల్లులు నగరాల్లో చాలా ఉన్నాయి. వస్త్రాలమిల్లులు ఆరున్నాయి – వీటిల్లో 121000 మరకదుళ్లు 2134 మగ్గాలు పనిచేస్తున్నాయి. ఈ మిల్లులకు అదనంగా కదుళ్లు మగ్గాలు కావాలంటే, భారత ప్రభుత్వం చేసే దిగుమతులపై ఆధారపడాలి. కాని ఈలోగా చేనేతపరిశ్రమకు ఎక్కువ ప్రోత్సాహం ఇవ్వవచ్చు. సంస్థానంలో లక్షకు పైగా మగ్గాలున్నట్లు లెక్కలు చూపుతున్నాయి. పైగా నారాయణపేట, సంగారెడ్డి, గద్వాల నైజాంబాదు మొదలైన ప్రదేశాల్లో పట్టునేతకూడా ఎంతోకాలంనుంచి సాగుతోంది. రాయచూరు జిల్లాలో మంచి చీరల్ని నేస్తారు. ఔరంగాబాదు, పైఠాన్ నగరాలు జరీ నేతకు పేరుపడినయ్యి. సంస్థానంలో సంవత్సరానికి పన్నెండుకోట్ల గజాల చేనేతగుడ్డ ఉత్పత్తి అవుతోంది. కాని ఈమధ్య నూలు సప్లై సరిగా లేక ఉత్పత్తి మూడోవంతుకు పడిపోయింది. ప్రభుత్వంవీరికి నూలు సప్లై చేసే బాధ్యతను వహించి, ఉత్పత్తిఅయిన వస్త్రాల్ని కొనుక్కోవాలి. ప్రతిచిన్నయంత్రాన్ని దిగుమతిచేసుకోవాల్సిన ఈరోజుల్లో మిల్లులపైనే పూర్తిగా ఆధారపడవీలులేదు. చేనేత పారిశ్రామికులకు, ఆకర్షవంతమైన వస్త్రాల్ని ఉత్పత్తి చేసేవిధానాల్ని ప్రభుత్వం నేర్పించాలి. అప్పుడు కుటీర పారిశ్రామికులు బాగుపడటానికి వీలుంటుంది.

నైజాంసాగరాన్ని అభివృద్ధిచేస్తే, చెరుకు పంటకూడా అభివృద్ధి చెందుతుంది. అప్పుడు బోధన్ చక్కెర మిల్లునుంచి అధికంగా చక్కెర ఉత్పత్తి అవుతుంది. ప్రస్తుతం సంవత్సరానికి పదహారు వేలటన్నులు ఉత్పత్తి అవుతోంది. చక్కెర తయారుకాగా, మిగిలిపోయిన పదార్థంతో పవర్ ఆల్కహాల్ తయారుచేసి, దాన్ని మోటారుకార్లకు ఉపయోగించటం, ప్రస్తుతం కొద్దికొద్దిగా సాగుతోంది. ముందు ముందు ఇది అధికంగా జరగవచ్చు. అప్పుడు పెట్రోల్ ఖర్చు కొంత తగ్గి, ఎక్కువ పనిని చేసుకోగలుగుతాము.

ఇవన్నీగాక సంవత్సరానికి లక్షా ఏభైవేల టన్నుల సిమెంటు ఉత్పత్తి అవుతోంది. 14 వేల టన్నుల గాజు సామాన్లు, నాలుగు వేల టన్నుల కాగితం ఉత్పత్తి అవుతున్నాయి.

గోదావరిలోయ

కాని, గోదావరి ప్రాజెక్టు (కదం) ప్రణాళిక ప్రకారం అభివృద్ధి అవుతే, అనేకపరిశ్రమల్ని అభివృద్ధిచేసుకునే అవకాశం లభిస్తుంది. ప్రాజెక్టుకు దగ్గరే బొగ్గుగనులు, అడవులు, ముడిపదార్థాలు – అన్నీ లభించటంవల్ల, విద్యుచ్ఛక్తికూడా ఉత్పత్తి అవుతుందికాబట్టి – ఇక్కడ పరిశ్రమల్ని నడపటం తేలిక. ఆ పరిశ్రమల్ని ఇక్కడ పేర్కొంటున్నాను.

పింగాణీ పరిశ్రమ

పింగాణీ పరిశ్రమకు కావాల్సిన, చైనామట్టి ఫైర్ క్లే, సైటింగ్, ఫెల్‌స్పార్, బెన్‌టొనైట్ క్వార్ట్‌జ్ – అన్నీ సంస్థానంలోనే దొరుకుతున్నాయి. ఈ పరిశ్రమకు కావాల్సిన యంత్రాలుకూడా భారతదేశంలోనే లభిస్తాయి.

సిమెంటు

షాబాదులో ఉత్పత్తిఅయ్యే సిమెంటు రాష్ట్రమంతటికీ చాలదు. పైగా అదిలాబాదుజిల్లాలోనే సున్నపురాయి మొదలైనవి బాగా దొరుకుతాయి. అదీగాక గోదావరిప్రాజెక్టు నిర్మాణానికి సిమెంటు అవసరం. కాబట్టి ముందే ఒక పెద్దసిమెంటుఫ్యాక్టరీని ఇక్కడ కట్టటం అత్యవసరం.

ప్లాస్టిక్స్

ప్లాస్టిక్ పరిశ్రమకు కావల్సినవి, బొగ్గు, ఆల్కహాల్, కట్టెలు, గ్రాఫైట్, మైకా, యాస్బెస్టాస్ మొదలైనవి. ప్రాజెక్టుదగ్గరే అనేక ఫ్యాక్టరీల్ని కట్టదల్చారు కాబట్టి ఒక పరిశ్రమకు మరొకటి తోడుగా ఉంటుంది. పైగా దగ్గర్లోనే బొగ్గు, కట్టెలు బాగా లభించే ఆధారాలున్నాయి.

రేయాన్ సిల్కు

ప్రత్తి, కట్టెలపప్పి, కాస్టిక్ సోడా, కార్బన్-బై-సల్ఫైడ్, యాసెటిక్ యాన్ హైడ్రైడ్, యాసిటన్—రేయాన్ ఉత్పత్తికి అవసరమయ్యే వస్తువులు. ప్రత్తి రాష్ట్రంలో దొరుకుతుంది. కాస్టిక్ సోడా భారతదేశంలో లభిస్తోంది. బెల్లంపల్లి కెమికల్స్—ఫర్టిలైజర్స్ ఫ్యాక్టరీలో సల్ఫ్యూరిక్ యాసిడ్ ఉత్పత్తి అవుతుంది. మిగిలిన రసాయనాల్ని ఆల్కహాల్ నుంచి తయారు చేయవచ్చు. ఈ సిల్కు ఫ్యాక్టరీ, గోదావరిప్రాజెక్టుదగ్గర ఉండటంవల్ల ఇతర ఫ్యాక్టరీలు రసాయనాల్ని సప్లై చేయగలవు,

ఎరువుల ఫ్యాక్టరీ

బొగ్గు, కోక్‌లనుంచి అమ్మోనియాను తీయవచ్చు. దగ్గర్లోనే బొగ్గుగనులున్నాయి కాబట్టి ఈ చోటు ఎరువుల పరిశ్రమకు తగి ఉంది.

ఇవిగాక ఎలెక్ట్రిక్ సామానులు తయారుచేసే ఫ్యాక్టరీ కూడా అత్యవసరమైనది. కాని ఇది తేలికగా అయ్యే పని కాదు. అయినా ప్రారంభం చేయవచ్చు.

ఈ విధంగా గోదావరిప్రాజెక్టుదగ్గర పరిశ్రమలతో కూడిన చక్కటిపట్నం – సంస్థాన సౌభాగ్యానికి చిహ్నంగా ఏర్పడుతుంది.

మిగిలిన ప్రాజెక్టులుకూడా, విద్యుచ్ఛక్తిని సప్లయి చేసేవే కాబట్టి సంస్థానంలో చాలా భాగం సుక్షేత్రమై, ప్రజలు హాయిగా ఉండగలుగుతారు. వరంగల్, కరీంనగరం, అదిలాబాదు జిల్లాలలో దాదాపు 11 లక్షల టన్నులబొగ్గు లభిస్తోంది. రాయచూరులో బంగారం బాగా లభించవచ్చు. జగిత్యాల, అదిలాబాదుల దగ్గర ఇనుము దొరకుతుందని చెప్తున్నారు. అనేక ఇతర చిన్న పరిశ్రమలుకూడా నెలకొల్పబడ్డాయి. కుండీలు, నిప్పుపెట్టెలు, బిస్కట్లు, గాజులు – బొమ్మలు, కంబళ్లు, కుంపటులు మొదలైన కుటీరపరిశ్రమలు ఉన్నాయి.

సంస్థానార్థికవ్యవస్థ నభివృద్ధి చేయటానికి ఇతర రాష్ట్రాల్లో వలె పెద్ద పెద్ద ఖర్చులు చేయనక్కరలేదు. చిన్న ప్రాజెక్టులతో, ఆహార స్వయంపోషకత్వం సిద్ధిస్తుంది. జాగ్రత్తగా, పదేళ్ళు సక్రమంగా వెచ్చించిన ధనం – సంవత్సరానికి ఏడెనిమిది కోట్లు చాలు – సంస్థానసంపదను అత్యంతంగా అభివృద్ధి చేస్తుంది.

హైదరాబాదు రాజ్యము విద్యావిషయము

(23-వ పేజీ తరువాయి)

వనియు, వినయముగ ప్రార్థించియుండిరి. ఆర్థికోపపత్తిని తగినంత సమకూర్చ చూపెదమనియు చెప్పిరి. అయినను, ఉస్మానియావిశ్వవిద్యాలయాధికారులు పనేమిరా వీలు లేదనిరి. ఇట్టి విజ్ఞప్తులకు అధికారు లిచ్చిన జవాబులు కూడ విచిత్రములుగా నుండెను. అట్టివానిలో నొకదాని* యందలి వాక్యములు ఈక్రిందివిధముగా నుండెనవి:—

H. E. H, the nizams gudicial, Police & general departments Secretarys letter No. 1015 d 27 th khurdura 1353 f (1-5-1944)

"మహోన్నతవహించిన నిజాముగారి రాజ్యమున, కాలేజీని స్థాపించుటకు సెలవియ్య వీలు లేదు. ఉస్మానియావిశ్వవిద్యాలయముతో, ఏ కాలేజీని అనుబంధింపజేయ (*apptciate*) ను కూడ వీలులేదు. ఎలయనగా, ఉస్మానియా విశ్వవిద్యాలయము, యూనిటరీ (*unitary*) పద్ధతికి లోబడిన నొక బోధకమును, నివాసకమును (*Residental*) అను విశ్వవిద్యాలయము. ఈసూత్రము ననుసరించి, ఇది, తన అధికార పర్యవేక్షణముల క్రింద విద్యాబోధకశాఖలను స్థాపించగలదు. కాని కాలేజీలను అనుబంధించుకొనజాలదు. (ఈ రాజ్యములోని ఏదైన) ప్రైవేటు కాలేజని బయటి విశ్వవిద్యాలయము అనుబంధితము చేసికొనవచ్చునా యను విషయమున చెప్పవలసినదేమనగా, నిజాముప్రభుత్వము ఆ పద్ధతిని పరిపాలనాసౌష్టవమునకు విరుద్ధముకనుక అంగీకరించజాలదు. అంతేకాదు. బయట విశ్వవిద్యాలయము ఏదియు, దానికి వర్తించునట్టి "లా" ప్రకారము తన నిర్ణీతమైయున్న హద్దులకు బయటనుండు ఏ కాలేజిని అనుబంధింపజేసికొనగూడదు."

"ప్రభుత్వ విద్యాశాఖ కార్యదర్శి"

ఉస్మానియా విశ్వవిద్యాలయము, ప్రజల కలాశాలలు స్థాపనం కాకుండ అవలంబించినవిధానమును, తత్సంబంధమైన తర్కమును పై వాక్యములవలన స్పష్టపడగలదు. ఉద్ధృతములైన వాక్యరత్నముల సారాంశము ఒక వాక్యములో చెప్పవలయునన్నచో, "అమ్మ తాను పెట్టదు, అడుగుకొని తిననియ్యదు!" అను లోకోక్తిని జ్ఞాపకము చేసికొనిన చాలును!

ఇటీవల విశ్వవిద్యాలయాధికారుల దృక్పథము, ఈ విషయమున మారినదనియు, ఉస్మానియా విశ్వవిద్యాలయమును, కాలేజీలను అనుబంధింపజేసికొను విశ్వవిద్యాలయముగా మార్చవలయునను అంశము ఆలోచనయందున్నదనియు, కొన్ని షరతులకు నియమములకును లోబడి ముందు ప్రైవేటు కాలేజీలు ఈ విశ్వవిద్యాలయమువలన అంగీకరింపబడవచ్చుననియు తెలియుచున్నది. ఇట్టి మార్పు జరిగినచో, ఈ రాజ్యములోని ప్రజలకు కాలేజి విద్యవలని లాభముపొందు అవకాశములు విస్తారముగా లభించగలవనియు ఆశ కలుగుచున్నది.

ఈ సంస్కరణము నిజముగా మహోపకారమగును! కాని అది అమలులోనికి రావలయును!

ముగింపు

ఇంకను ఎన్నియో విద్యావిషయములు కలవు వాని నన్నిటిని వివరింపదలచినచో గ్రంథవిస్తరమగును. కొద్దిలో సారాంశ మేమనగా.–ఇప్పటి ప్రభుత్వమువారి దృష్టి రాజ్యపు విద్యావిషయికావసరములపైపు ఇంకను తగినంత ప్రసరించలేదు. ప్రాతపద్ధతులే సాగుచున్నవి. క్రొత్త సంస్కరణలు ఇంకను ఆచరణమునలేవు. శిష్టాచారులగు ప్రాతియధికారు లుండువరకు నవీన సంస్కరణముల ప్రవేశము వారికి "చవిగాని" నుండుట సహజము. ఇది 18-9-1948 వ నుండి దాదాపు ఒక సంవత్సర కాలములో కలిగిన యనుభవము!


ఈ వ్యాసమునందు విషయములు ప్రజాదృక్పథమున నిష్పాక్షికదృష్టితో విమర్శింపబడినవి. లోపము లుండిన క్షమింపబడుగాక!

స్థాపితము: 1933 టెలిఫోను: 7413

రేడియో అండ్ ఎలెక్ట్రిక్స్ లిమిటెడ్,

(హైదరాబాదులో ఇన్‌కార్పొరేటు చేయబడినది).

పీటర్ పాన్



రెండు బ్యాండ్లు: 19—50, 200—500 మీటర్లు

★

బిజిలీ కరెంటులేకుండానే పనిచేయగల డ్రై బ్యాటరీ పోర్టబిల్ రేడియోలు

వ్యాపారస్తులకు ధారాళమైన డిస్కౌంటు.

వెల సెట్టు ఒకటికి ఐ. జి. రూ. 290/- బ్యాటరీ ఐ. జి. 16-12-0 అదనము.

★

ఏజన్సీ షరతులకై వ్రాయండి:

* ఫిల్కో * బుష్ * ముల్లర్డ్

మేలురకపు మెయిన్స్ సెట్లు

సరసమైన ధరలకు దొరకును — మీ అభిమానసెట్టును స్వీకరించండి.

రేడియో మరమ్మతు వగైరాలు నిపుణతతో చేయగలము.

మేనేజింగ్ ఏజంట్లు:


హెడ్డాఫీసు: **కె. వరదరాజ్ అండ్ సన్స్,** బ్రాంచి:

69 ఏ, కింగ్స్‌వే, సికిందరాబాద్. స్టేషన్‌రోడ్డు, నాంపల్లి హైదరాబాదు-దక్కన్.

తంతి: "RADELEC"

హోటళ్ళకు, సినిమాలకు, ఆదర్శవంతమైనవంటఇళ్ళకు, థియేటర్లకు, రైల్వేఆహారశాలలకు, పారిశ్రామిక కేంద్రములందలిసౌకర్యములకు

రెఫ్రిజిరేషన్ సామగ్రి చాలా అవసరం




- వెలస్వల్పం
- అమర్చటం సులభం
- పనిసాగించటం తేలిక

★


ఐస్ కాండీ ప్లాంట్ (ఐస్‌ఫ్రూట్ మెషీన్)

— లేదా —

బెవరేజ్ బాటిల్ కూలర్



★



ఐస్‌క్రీమును తయారుచేయుటకు, పదిలపరచుటకు, బాటిల్ కూలింగ్‌కు ఉపకరించు యంత్రములు

★

సోడా ఫౌంటెన్లు, కోల్డ్‌స్టోరేజ్‌సామగ్రి, ఐస్‌క్రీం తయారుచేయు యంత్రములు, రెఫ్రిజిరేషన్ సామానులన్నీ మావద్ద సరసమైన ధరలకు దొరుకును.

ఎయిర్‌కండిషనింగ్, రెఫ్రిజిరేషన్ ఇంజనీరింగ్ ఏర్పాట్లు అతినిపుణముగా చేయబడును.

పై ఏర్పాటులన్నింటిని చేయుటలో, యంత్రములను రిపైర్ చేయుటలో

నమ్మకమైన తోడ్పాటు ఇవ్వబడును.

వివరములకు:-

యునైటెడ్ కమర్షియల్ ఏజన్సీస్,

840. సుల్తాన్ బజారు, హైదరాబాద్ - దక్కన్.

Telegrams :-EQUIPMENT- Telephone :-2793

Regd. No. M. 4479

Edited Printed & Published by S. Sambhu Prasad, at the Andhra Patrika Press, 7, Thambu Chetty St, G. T. Madras 1.